ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ షష్ఠి మ. 12.17 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: చిత్త మ. 3.05 వరకు, అనంతరం స్వాతి; అమృతకాలం: ఉ.8.40 నుండి 10.10 వరకు; వర్జ్యం: రా.8.53 నుండి 10.33 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:296 • మంగళవారం 6 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



కాళేశ్వరం... జూన్ మంత్రం!

అక్కడ మహాయజ్ఞం జరుగుతోంది. రాత్రి, పగలూ తేడా లేదు. ఇంజనీర్, కార్మికుడు వ్యత్యాసం లేదు. ప్రాజెక్టు.. కాంట్రాక్టర్.. అధికారులు.. వర్కర్ల బంధం లేదు. ప్రాజెక్టు పూర్తిచేయాలి.. నీళ్ళివ్వాలి.. ఎంత కాంక్రీట్ వేశాం.. ఎన్ని బస్తాల సిమెంట్ వాడాం.. సవాల్ ఏదైనా చేద్దాం.. చేసేద్దాం.. అంతా ఇదే వాతావరణం. ఏ బ్యారేజీ దగ్గర చూసినా.. పంప్‌హౌజ్ దగ్గర చూసినా.. సర్జ్‌పూల్ దగ్గర చూసినా.. రిజర్వాయర్ల దగ్గర చూసినా.. ఒకటే మంత్రం. ఆ మంత్రం పేరు జూన్. ఇప్పటిదాకా సగం పనులు పూర్తికాని బ్యారేజీ దగ్గరికి వెళ్ళి ఎపుడు పూర్తవుతుందని ప్రశ్నించినా.. ఏ మాత్రం తడుముకోకుండా జూన్ అని ధీమాగా చెప్పేస్తున్నారు. పనుల్లో వేగం..ఇంజనీర్లు, కార్మికులు, ఏజెన్సీలలో ఉన్న ఆత్మవిశ్వాసం.. కార్యాచరణ యజ్ఞం ఇది సాధ్యమేనన్న భావన కలిగిస్తోంది. ఆసియాలోనే అనేక ప్రత్యేకతలున్న మహా ప్రాజెక్టుగా ప్రశంసలందుకుంటున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల తీరును ఆంధ్రప్రభ క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్ నేతృత్వంలో హైదరాబాద్ జర్నలిస్టుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీ నుండి రంగనాయకసాగర్ వరకు పలు బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లు, సర్జ్‌పూల్‌లు పరిశీలించింది. గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ నదీజలాలను ఒడిసిపట్టి బీళ్ళలోకి నీళ్ళు మళ్ళించాలన్న మహాయజ్ఞం కాళేశ్వరం. తపస్సులా సాగుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల్లో ఇప్పటిదాకా జరిగిన పనుల తీరు, క్షేత్రస్థాయి పరిస్థితిపై ఆంధ్రప్రభ ప్రత్యేక కథనం..

రోజువారీ లక్ష్యాలతో ముందుకు!

• తపస్సులా శ్రమిస్తున్న ఇంజనీర్ల బృందం • స్వప్నిస్తూ.. శ్వాసిస్తూ.. కదనోత్సాహం • నిర్విరామంగా శ్రమిస్తున్న వేలాది కార్మికులు • ప్రగతి భవన్‌కు, జలసౌధకు పనుల అనుసంధానం • ప్రతిరోజూ పనులపై సీఎం కేసీఆర్ ఆరా • ఆంధ్రప్రభ క్షేత్రస్థాయి అధ్యయన నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై నిర్మిస్తున్న బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లు, టన్నెల్స్, సర్జ్‌పూల్స్ నిర్మాణాల వేగం పెంచడానికి రోజువారీ టార్గెట్లు ఫిక్స్ చేస్తున్నారు. ఒక్కో



కాళేశ్వరం ప్యాకేజీ-8లో చురుగ్గా టన్నెల్ పనులు

పని దగ్గర ఒక్కో రకంగా 3500నుండి 4వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఏ రోజు లక్ష్యాలు.. ఆ రోజే అధిగమిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లు, ఇతర నిర్మాణాల చుట్టూ అత్యంత శక్తివంతమైన కెమెరాలను ఏర్పాటుచేసి వాటిని ప్రగతిభవన్‌కు, జలసౌధకు అనుసంధానం చేశారు. ప్రగతిభవన్‌లో ఉన్న మెగా స్క్రీన్ ద్వారా సిఎం కెసిఆర్ కాళేశ్వరం పనులను ప్రత్యక్ష్యంగా వీక్షిస్తారు. ప్రతిరోజూ తన కార్యాలయంలోకి రాగానే.. సిఎం కెసిఆర్ ముందు స్క్రీన్ ఆన్ చేయమని చెప్పి.. కాళేశ్వరం పనులు చూస్తారు. ఆ తర్వాతే ఇతర కార్యక్రమాల్లోకి వెళ్తారు. మంత్రి హరీష్‌రావు ప్రతి బ్యారేజీకి ఒక వాట్సాప్ గ్రూప్, ప్రతి టన్నెల్‌కు, పంప్ హౌజ్‌కు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటుచేసుకుని.. ఏ ప్యాకేజీలో ఆ రోజు ఎంత పని ⇨ 3వ పేజీలో...



(ఫైల్)

మళ్లీ మెరుపు దాడులు?

పాక్, చైనాలకు గుణపాఠమే లక్ష్యం

కారిడార్ మీదే భారత్ గురి

రహదార్లు, భారీ వంతెనల ధ్వంసానికి వ్యూహం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

భారత్‌లో ఎన్నికల ఏడాదికావడంతో రక్షణపరంగా దూకుడు పెంచే అవకాశాలు ఉన్నట్లు కొన్నిరోజులుగా పరిశీలకులు సందేహిస్తున్నారు. పాకిస్థాన్ అధికారిక గెజిట్‌లాంటి దినపత్రిక ''ది డాన్'' సోమవారం నాటి సంచికలో వ్యక్తం చేసిన భయాందోళనలు పరిశీలకుల ఆలోచనలకు మద్దతుగా నిలుస్తున్నాయి. దీర్ఘకాలంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య భారత్‌ను అంతర్గత, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇబ్బందులకు గురిచేస్తూనే ఉంది. భారత్‌కు చెందిన ఈ భూభాగంలో పాక్ అనధికార పెత్తనం చెలాయిస్తోంది. పైగా ఈ భూభాగంలోని గిల్జిత్, బల్జిస్థాన్‌ల మీదుగా చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణ నిమిత్తం చైనాకు అనుమతులు ఇచ్చేసింది. దీంతో భారత్ నడినెత్తి మీదుగా చైనాకు చెందిన ఆయుధ శకటాలు నిత్యం రాకపోకలు సాగించేలా పాక్ కుటిల యత్నానికి దిగింది. చైనాలోని బీజింగ్ నుంచి గిల్జిత్, బల్జిస్థాన్‌ల మీదుగా పాక్‌లోని ⇨ 3వ పేజీలో...









ఆర్థిక ఇబ్బందులతో...

భార్య, పిల్లలను కడతేర్చాడు

జిల్లెలగూడలో విషాదం

హైదరాబాద్ (సరూర్‌నగర్), ప్రభన్యూస్: నిండు నూరేళ్లు అన్యోన్యంగా జీవించాల్సిన భార్యాభర్తలు... ఆర్థిక సమస్యలు... ఆపై కలహాలు చెలరేగాయి. ఆలుమగలిద్దరూ గొడవపడ్డారు. క్షణికావేశంలో భార్యను పిడిగుద్దులతో కొట్టి చంపేశాడు. కొడుకు, కూతురిని గొంతు నులిమి ఉసురుతీశాడు. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారులోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లెలగూడ మునిసిపాలిటీ పరిధిలోని సుమిత్ర ఎన్‌క్లేవ్‌లో మాలె హరేందర్ గౌడ్ మలక్‌పేట్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో డెంటల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జ్యోతి (28), కుమారుడు అభిజిత్(6), కూతురు(4) సహస్రలతో కలిసి నివాసముండేవాడు. హరేందర్‌గౌడ్, జ్యోతిలకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. అప్పటి నుంచి ఇద్దరు అన్యోన్యంగానే జీవనం కొనసాగిస్తుండేవారు. ఈ మధ్యకాలంలోనే ఆర్థిక ఇబ్బందులుతో గొడవలు పడేవారు. రెండు నెలల నుంచి అటు ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటిదగ్గరే ఉండడంతో ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. ఆదివారం రాత్రి కూడా భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. సోమవారం ఉదయం కూడా గొడవ చోటుచేసుకోవడంతో క్షణికావేశంలో కోపోద్రిక్తుడైన హరేందర్ గౌడ్, భార్యను పిడిగుద్దులతో తలపైన బలంగా కొట్టడంతో జ్యోతి అక్కడికక్కడే మరణించింది. కుమారుడు అభిజిత్‌ను, కూతురు సహస్రను గొంతు నులిమి చంపేశాడు. భార్య, పిల్లలను చంపేసి పక్కన ఉన్న ఇంటివారితో ముగ్గురిని చంపేశానని చెప్పి మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

విషయం తెలుసుకున్న ఎల్బీనగర్‌డీసీపీ వెంకటేశ్వర్లు, వనస్థలిపురం ఏసీపీ రవీందర్ రెడ్డి, మీర్‌పేట్ సీఐ మన్మోహన్, డీఐ మధుసూదన్, ఎస్ఐ రాఘవేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని ⇨ 7వ పేజీలో...

ఉక్కు సంకల్పం!

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తగ్గింపు ధరతో స్టీల్ సరఫరా చేయండి 9 లో

ఉక్కు కంపెనీల యజమానులతో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి

పురపాలికల ఏర్పాటుతో

అభివృద్ధి వేగవంతం

పాలన వికేంద్రీకరణతోనే మంచి ఫలితాలు

మునిసిపల్ మంత్రి కేటీఆర్ 2 లో



సోమవారం సచివాలయంలో స్టీల్ కంపెనీల యాజమాన్యాలతో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి సమావేశం



రైతులకు ఆర్థిక సాయం పంపిణీపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

• రొటేషన్ పద్ధతిలో చెక్కులు అందజేత • వారంలో మార్గదర్శకాలు

పెట్టుబడికి టైమ్ షెడ్యూల్!

బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింపజేయనుంది. బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్దేశిత మొత్తానికి చెక్కులు పంపిణీ చేయాలని కార్యాచరణ ప్రణాళిక తయారుచేసింది.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతిష్ఠాత్మక పెట్టుబడి మద్దతు పథకాన్ని క్షేత్రస్థాయిలో కార్యాచరణకు రంగం సిద్ధమవుతున్నది. రాష్ట్రంలో అందుబాటులో ఉండే నగదును రొటేషన్ పద్ధతిలో రైతులకు సర్దుబాటు చేసేందుకు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణలో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారు. అవసరమైతే చెక్కుల పంపిణీని దశల వారీగానైనా చేపట్టడం ద్వారా ఈ ఖరీఫ్‌లో రైతులకు నైతిక, ఆర్థిక మద్దతు అందజేయాలన్న కృతనిశ్చయంతో మళ్లీ మంత్రివర్గ ఉపసంఘం రంగంలోకి దిగింది. ఖరీఫ్ నుంచి రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఎకరాకు నాలుగు వేల రూపాయల చొప్పున పెట్టుబడి రాయితీ మొత్తాన్ని అందజేయాలన్న రాష్ట్రప్రభుత్వ సంకల్పానికి కరెన్సీ కొరత ఎదురవుతున్న సంగతి తెల్సిందే. ఈ విషయమై రాష్ట్ర మంత్రులు, అధికారులు అటు కేంద్ర ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంకుని సంప్రదించి సరిపడా నగదుని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే అక్కడి నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాకపోవడంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యామ్నాయాల మీద దృష్టి సారించింది. పులి మీద పుట్రలా తాజాగా రసాయన ఎరువుల ధరలు అమాంతం పెరగడంతో రైతులపై అదనపు భారం పడనున్నది. ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే దాదాపు రెండు వేల కోట్ల రూపాయల కోట్లకు పైగా ఆర్థిక భారం పడుతుంది. పెట్టుబడి మద్దతు పథకానికి అవసరం మేరకు కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించకపోతే ప్రతిపాదిత మొత్తాన్ని రెండు విడతలుగా ఇవ్వగల అవకాశాలను.. దరిమిలా ఎదురయ్యే రాజకీయ సమస్యలను అధ్యయనం చేస్తున్నారు. ఏదెలా ఉన్నా ఏప్రిల్ రెండో వారం నుంచి లేదా మొదటి వారం నుంచి బేరర్ చెక్కులు అందజేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ పథకం అమలుకు సులువైన మార్గాలపై తాజాగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఇచ్చిన నివేదిక ప్రకారం చెక్కుల పంపిణీలో వ్యూహాత్మకంగా ⇨ 9వ పేజీలో...

ఔరా..!



ఎయిడ్స్ సోకిందని కోడలిని గెంటేశారు

అత్తగారింటి ముందు కోడలి నిరసన.. ధర్నా

వరంగల్ జిల్లా గొల్లపల్లిలో ఘటన 7 లో



ఇంటింటా విజయ పాల ఉత్పత్తులు

విజయ డెయిరీ ఆధునీకరణ, విస్తరణ • ఈ బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు • గొర్రెల పంపిణీ పథకం విప్లవాత్మకం • గొర్రెల పథకాన్ని తప్పుదోవ పట్టిస్తే దండనే • 50 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం • రైతు బజార్లలో ఆధునిక మాంసం మార్కెట్లు • ఆంధ్రప్రభ ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి తలసాని 3 లో





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

సిద్ధిపేట పోలీసు కమాండ్‌కంట్రోల్ సెంటర్ రాష్ట్రానికి ఆదర్శం

సిద్ధిపేట , ప్రభన్యూస్ : హైదరాబాద్ తర్వాత సిద్దిపేట పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అత్యాధునిక హంగులతో నిర్మించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపడం జరిగిందని మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం పొన్నాల శివారులో నూతనంగా నిర్మించిన అధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, పాతూరి సుధాకర్ రెడ్డి, ఫారుఖ్ హుస్సేన్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్రపోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోధర్, ఐపీఎస్ మల్లారెడ్డి, శివకుమార్, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రతీ మునిసిపల్ కార్పొరేషన్‌కు సీఎం కేసీఆర్ కమిషనరేట్ ఇచ్చారన్నారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ వింగ్, ట్రాఫిక్ కేంద్రాలు సిద్దిపేట కమిషనరేట్ మొదలైందన్నారు. పట్టణంలో ఇప్పటికే రూ. 1.60 లక్షలతో అధునాతన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా హైదరాబాద్ తర్వాత రాష్ట్రానికే ఆదర్శవతంగా ఉండే విధంగా రూ. 3 కోట్ల రూపాయలతో అత్యంత విశాలమైన గదులతో అధునాతన హంగులతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించుకోవడం హర్షనీయమన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను భవిష్యత్తులో సీసీఎస్, ట్రాస్క్‌ఫోర్స్ కోసం కూడా వాడుకోవచ్చున్నారు. అదే విధంగా 15 కోట్ల వ్యయంతో దుద్దెడ శివారులో నూతనంగా సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయాన్ని నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొత్త మున్సిపాలిటీలకు పన్ను పెంపులో రెండేళ్లు మినహాయింపు

- పురపాలికలుగా అవుటర్ రింగ్ రోడ్డు లోని 167 గ్రామాలు
- శివారులో 10 మున్సిపాలిటీల ఏర్పాటుపై కసరత్తు
- 7న మరోసారి నేతలు, అధికారులతో మంత్రి కేటీఆర్ చర్చలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రం లో కొత్తగా ఏర్పడే పురపాలికల్లో రెండు సంవత్సరాల పాటు పన్నుల పెంపు లేకుండా చూడాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అవసరమైతే మరో ఏడాది పాటు కూడా మినహాయింపు ఇచ్చే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. గ్రామపంచాయతీలను నగర పంచాయతీలుగా ఏర్పాటు చేయడం వల్ల ప్రజలపై ఎలాంటి భారం ఉండకుండా తగు జాగ్రత్తలను తీసుకుంటోంది. పైగా గ్రామ పంచాయతీలను పురపాలికలుగా ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజ నాలపై కూడా ప్రజలకు పెద్దఎత్తున వివరిం చాలని తలపెట్టింది. ఆయా గ్రామాలను శరవేగంగా అభివృద్ధి చేయాలన్న ఏకైక సంకల్పంతోనే కొత్తగా పురపాలికలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు సోమవారం సచివాలయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. అవుటర్ రింగు రోడ్డు లోపల ఉన్న గ్రామాలను పురపాలికలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. శివారు ప్రాంతాల్లోని అమీన్‌పూర్, బొల్లారం, కొంపల్లి, పుప్పాలగూడ,



ప్రగతినగర్, తెల్లాపూర్, కొల్లూర్, తుర్కయాంజాలతో పాటు మరికొన్ని మున్సిపాలిటీల ఏర్పాటు చేయడంపై చర్చించారు. రాజేంద్రనగర్, ఇబ్రహింపట్నం, కుత్బుల్లాపూర్, మహేశ్వ రం, సంగారెడ్డి నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నగర ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

15వేలకు మించి జనాభా ఉన్న పంచాయతీలను ఖచ్చితంగా నగర పంచా యతీలు, మున్సిపాలిటీలుగా మార్చా లని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు మంత్రి కేటీఆర్ వివరించారు. నూతన పురపాలికల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలు వివరించాలని వారికి సూచించారు. అలాగే పురపాలికలుగా ఏర్పాటు చేసిన తరువాత కనీసం రెండేళ్ళ పాటు పన్నుల పెంపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు. నూతనంగా ఏర్పడే పురపాలిక సంస్థలకు ఆర్థిక సమస్య తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందిస్తామన్నారు. కొత్తగా ఏర్పడే మున్సి పాలిటీల వల్ల ఆయా ప్రాంతాల పరిధిలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుం దన్నారు. ప్రభుత్వం నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున చేపడుతున్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం ద్వారా రాబోయే జనాభాను సైతం ఈ ప్రక్రియలో పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డు లోపల 167 గ్రామాలున్నాయని, వాటి భౌగోళిక పరిస్థితులను బట్టి నూతన పురపాలక సంస్థలుగా ఏర్పాటు చేయడం, ఇతర పురపాలికల్లో విలీనం చేయడం వంటి అంశాలను పరిశీలిస్తున్నామన్నారు.

ఈ ప్రక్రియపై అధికారులు తమ నివేదికలతో పాటు స్థానికంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు కూడా నూతన పురపాలికలకు సంబంధించిన ప్రతిపాద నలు సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేయాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. కాగా ఈ నెల 7వ తేదీన మరో సారి సమావేశమై కీలక నిర్ణయం తీసు కోవాలని నిర్ణయించారు. ఈసమావేశానికిమున్సిపల్, పంచాయతీరాజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మైనింగ్ సదస్సుకు రండి
గవర్నర్‌కు మంత్రి కేటీఆర్ ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం 14వ తేదీన నిర్వహించనున్న మైనింగ్ టుడే సదస్సులో పాల్గొనాల్సిందిగా గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి మంత్రి ఈ మేరకు ఆయనను ఆహ్వానించారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ, జాతీయ సదస్సుల గురించి ఈ సందర్భంగా గవర్నర్‌కు ఆయన వివరించారు.


మావోయిస్టుల అలజడి నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎక్కడిక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న ఆక్టోపస్ బలగాలు

ఇక హైటెక్ రైతు బజార్లు

- టోకెన్ విధానం ద్వారా రైతుల ఉత్పత్తుల విక్రయం: మంత్రి హరీశ్‌రావు

సిద్ధిపేట , ప్రభన్యూస్ : సిద్దిపేట ప్రాంత రైతులు మురిసే విధంగా సకల హంగులతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విధంగా మోడల్ రైతుబజార్ నిర్మించుకొని రైతులకు అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమ వారం సిద్దిపేటలోని నూతన రైతు బజార్‌ను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులకు కూర గాయలు రవాణాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ఉండే విధంగా మెయిన్ రోడ్డుకు దగ్గరలోనే మోడల్ బజార్‌ను నిర్మించడం జరిగిందన్నారు. సిద్దిపేటలో నిర్మించిన రైతుబజార్ రాష్ట్రానికే ఆదర్శ మన్నారు. ఆన్‌లైన్ పద్దతిలో టోకెన్ సిస్టం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించు కోవచ్చున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్లాంట్స్, బాత్‌రూంతో పాటు వికలాంగుల కోసం లిఫ్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులు మిగిలిపోయిన కూరగాయలను కోల్డ్ స్టోరేజీలో నిలువ చేసి తర్వాతి



రోజున అమ్ముకునే సదుపాయాన్ని కల్పించామన్నారు. రైతుమార్కెట్‌లో మిగిలిన కూరగాయలు, చెత్తతో కరెంట్ ఉత్పత్తి చేసే సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతుబజార్ 600 నుంచి 700 క్వింటాళ్ల కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయని, రైతులకు వానాకాలం, ఎండ కాలంలో సరైన సదుపాయాలు లేక ఇబ్బం దులు కలిగేవని అన్నారు. రైతులు వినియోగదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేశా మన్నారు. వినియోగదారుల సౌక ర్యార్థం 7ఎల్‌ఈడీ స్క్రీన్‌ల టీవీలను ఏర్పాటు చేసి కూరగా యల ధరలను సూచిస్తు న్నామ న్నారు. అదే విధంగా రైతు బజార్‌కు ఆదాయం సమకూర్చేం దుకు ప్రకటనల కోసం ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 600మంది రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు 332 స్టాల్స్ ఏర్పాటు చేసి మూడు ప్రవేశద్వారాల వద్ద స్వైపింగ్ మిషన్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజు ల్లో రైతును రాజుగా చూసే రోజులు దగ్గర్లోనే ఉన్నా యన్నారు. త్వరలోనే గోదావరి నీళ్ళను తీసుకొచ్చి ఆ నీటితో ఇక్కడి భూములలో పంటలు పండించి సస్యశామలం చేస్తామన్నారు. అనంతరం రైతులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ తదితరులుపాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణతోనే అభివృద్ధి

- మున్సిపల్ శాఖలో పెద్ద ఎత్తున సంస్కరణలు
- ప్రభుత్వ పథకాల బాధ్యత అధికారులదే : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మూడున్న ర సంవత్సర కాలంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న పలు విప్లవాత్మక నిర్ణయాలు...చేపడుతున్న సంస్కరణ వల్లే సాధ్య మవుతోం దన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో వికేంద్రీకరణ సూత్రాన్ని బలంగా నమ్ముతోం దన్నారు. పాలన వికేంద్రీకరణ ద్వారానే ప్రభుత్వం ఆశించిన విధంగా అనతి కాలంలోనే ఫలితాలు వస్తున్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. పైగా పాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా చేరుతాయన్నారు. సోమవారం సచివాలయంలో తెలం గాణ మున్సిపల్ కమిషనర్ల డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి



మంత్రి మాట్లా డుతూ, మారు తున్న కాలానికి అనుగుణంగా పాలన లో పలు సంస్కరణలను తీసుకవచ్చినప్పుడే అభి వృద్ధి చెందిన రాష్ట్రా లు, పట్టణాలతో పోటీపడగ లమన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖలో ఇప్పటికే పలు సంస్కరణలను చేపట్టామన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు పెద్దఎత్తున నిధులు కేటాయించమన్నారు. పట్టణాల్లో అర్బన్ మిషన్ భగీరథ ద్వారా రూ.4,500 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నా మని గుర్తు చేశారు. 15వేల జనాభా ఉన్న పంచాయతీ లను నగర పంచాయతీలుగా, మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసు కుందన్నారు. వీటిని ఏర్పాటు చేయడంతో పాటు నిధులను కూడా కేటాయిస్తా మన్నా రు. ఇలా వికేంద్ర కరణ ద్వారా ప్రజలకు పాలన ఫలాలు అందుతా యని తెలిపారు. జీహెచ్ ఎంసీలో మరిన్ని సర్కిళ్ళను, జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్కరణల అమలులో మున్సిపల్ కమీషనర్ల కీలక పాత్ర వహిం చాలని మం త్రి కేటీఆర్ సూచిం చారు. ఆయా పనుల్లో ఎలాంటి కాల యాప నకు తావివ్వకుండా సకాలంలో పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు దృష్టిసారించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ల ప్రమో షన్లు...ఖాళీల భర్తీ అంశాన్నిసీఎం దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు వారికి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మె ల్యే శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



త్వరలో ఏఎన్‌ఎంల సమస్యలకు పరిష్కారం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : త్వరలోనే రెండో ఎఎన్‌ఎంల సమస్యలను పరిష్కరిస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి హామీ ఇచ్చారు. సోమ వారం రెండో ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎఎన్‌ఎంల జీతాలు పెరుగుతాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతంలోనే ఎఎన్‌ఎంల సమస్యలకు సంబంధించి సీఎం చర్చించామని ప్రస్తుతం దానిపై చర్చలు జరుగుతున్నాయని త్వరలో సీఎం వాటికి పరిష్కారం చూపుతారని ఆయన తెలిపారు. మిగతా వాళ్లకు జీతాలు పెరిగాయన్న ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరి సమస్యలు పరిష్కరించే ఆలోచనలో సీఎం ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అందులో రెండో ఎఎన్‌ఎంల నియామకాలే విచిత్రంగా జరిగాయన్నారు. అప్పట్లో నెలకొన్న ఒక్కో సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కరించుకుంటూ బంగారు తెలంగాణ బాటలో పయనింపచేస్తున్నామన్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖలో అనేకసంస్కరణలు తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా , ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



కుల వృత్తులకు పూర్వ వైభవం

- నాయీబ్రాహ్మణ వృత్తి నైపుణ్యానికి రూ. 20 కోట్లు
- శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కిట్లు, సర్టిఫికెట్లు జారీ : మంత్రి జోగురామన్న

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బీసీ సంక్షేమ శాఖమంత్రి జోగు రామన్న తెలిపారు. నాయీబ్రాహ్మణుల వృత్తి నైపుణ్యం కోసం రూ. 20 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకున్న నాయి బ్రాహ్మణ యువతీ, యువకులకు మంత్రి సోమవారం సచివాలయంలో సర్టిఫికె ట్లను, వారి వృత్తికి అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఉన్న 3.10 లక్షల నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని మంత్రి జోగురామన్న తెలిపారు. ఈ ఏడా ది రూ. 250 కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. అందులో రూ. 20 కోట్లు కేవలం వృత్తి నైపుణ్య శిక్షణను ఇవ్వడానికే కేటాయిం చామన్నారు. మిగిలిన రూ. 230 కోట్లు రుణాల రూపంలో నాయిబ్రాహ్మణులకు ఇవ్వనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2017-18 బడ్జెట్‌లో బీసీలకు రూ. 5070 కోట్లు కేటాయిం చామని తెలిపారు. ఈ ఏడాది ఈ నిధులను ఇంకా పెంచనున్నట్టు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ. 1250 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. అర్హులైన బీసీలకు బ్యాంకులతో సంబంధం లేకుండానే రుణాలను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంబీ సీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, నాయిబ్రాహ్మణ ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీలకు ఐపీఎంతో చెక్

- మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఆహార కల్తీ నివారణలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వ్యాన్ ఎంతో ఉపయోగపడుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఐపీఎం(ఇండియన్ ప్రీవియెంట్ మెడిసిన్) (ముందస్తు రోగ నిరోధక ఔషధ విభాగం)కి మొబైల్ వ్యాన్ రావడం సంతోషించదగ్గ విషయమని ఇది చారిత్రాత్మకమని మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. సోమ వారం శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వ్యాన్‌ను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐపీఎంకి మొబైల్ వాహనం రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఢిల్లీలో ఈ మధ్య వైద్య ఆరోగ్య శాఖల మంత్రుల సమావేశంలో రెండు వ్యాన్‌లు కావాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని ప్రస్తుతం ఒక దానితోనే సరిపుచ్చారన్నారు. త్వరలోనే మరో వాహనం కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ఆహార కల్తీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేంద్రానికి సూచనలు చేశామని ఆయన పేర్కొన్నారు. ఆహార కల్తీ నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం ఉంద న్నారు. అమ్మకందారులు, వ్యాపా రులు కల్తీని అరికట్ట డంలో నిజాయితీగా వ్యవహరిం చాల న్నారు. దీనికి అధికారులు కూడా సహకరించాలన్నారు.

త్వరలో అంతా సర్దుకుంటుంది

గాంధీ ఆస్పత్రిలో జరుగుతున్న వరుస ఘటన లపై మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఆ ఆస్పత్రి అవినీతిలో కూరుకుపోయిందని ఇప్పుడిప్పుడే అది సర్దుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అలాంటి సమయంలో చిన్నచిన్న పరిణామాలు చోటుచేసు కోవడం సహజమేనని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే అంతా సర్దుకుంటుందని విలేకరులకు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చినట్లుంది: స్వామిగౌడ్

మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ ఐపీఎం కార్యాలయానికి రావడం అమ్మమ్మ ఇంటికి వచ్చిన అనుభూతి కలిగిందన్నారు.ఐపీఎం అంటే ఎవరికీ తెలియదని, కుక్కల దవాఖాన అంటేనే అందరికీ తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. నాచారంలో ఉన్న ల్యాబ్‌ను ఇక్కడకు మార్చాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆహార, కల్తీ నియంత్రణకు అధికారులకు అవసరమైన వాహనాలను సమకూర్చాలన్నారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వాహనాలను జిల్లాకు ఒకటి చొప్పున ఇవ్వాలని ఆయన కోరారు. ఆహార కల్తీని నివారించకుండా మందులకు చికిత్సలకు ఎంత ఖర్చు చేసినా ఫలితం ఉండదన్నారు. ఐపీఎం ఉద్యోగులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మనరాష్ట్రం లో మొదటిసారిగా ఈ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వాహనాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి, టీఎన్జీవో కారం రవీందర్ రెడ్డి, వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జూపల్లి రాజేందర్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ వ్యాన్‌తో ప్రయోజనాలు

మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వ్యాన్‌లో అన్నిరకాల ఫుడ్ టెస్టింగ్ సదుపాయాలు ఉంటాయి.

వ్యాన్ వెళ్ల కలిగిన చోట్లలో అక్కడికక్కడ ఆహార పదార్థాలను పరీక్షించవచ్చు.

దానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం శిక్షణ కలిగిన ఉన్న సిబ్బంది వ్యాన్‌తో పాటు అందు బాటులో ఉంటారు.

పాలు, వంటనూనెలు, నెయ్యి, మసాలాలు, వంటి అనేక ఆహార పదార్థాలను వాటి నాణ్యతలను పరీక్షించే సదుపాయాలను ఇందులో సమకూర్చారు.

నేరుగా అక్కడే ఆహార పదార్థాలను పరీక్షించే వీలు ఉండడం వలన అక్కడికక్కడే ఆహార పదార్థాలను సీజ్ చేయడంతోపాటు వాటి నిర్వాహకుల మీద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

పంచాయతీల లెక్కలు తేలేదెన్నడు!

- కొత్తగా ఆదాయ వివరాల చేర్పులు
- వార్డుల సంఖ్యతో జాబితాలు
- మొదటికొచ్చిన కసరత్తులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గ్రామ పంచాయతీల లెక్క తేలటం లేదు. జనాభా ప్రాతి పదికన గ్రామ పంచా యతీల ప్రతి పాద నలు సిద్ధం చేసిన అధికారులకు కొత్తగా మరి కొన్ని వివరాలు జోడిం చి నివేదికలు పంపాల ని ప్రభు త్వం నుంచి ఆదేశాలు అంద టంతో ఇప్పటి దాక చేసిన కసర త్తులు మళ్లీ మొదటి కొస్తున్నాయి. రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శ కాలు ఇవ్వటంతో ఆమేరకే అధికారులు కొత్త పంచాయ తీల ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. ప్రతి పంచా యతీకి ఆస్థి పన్నుల వసూళ్లతో వివిధ పథకాల కింద లభిస్తు న్న ఆదాయంతో పాటుగా పంచాయతీ పరిధిలో వార్డుల సంఖ్యను కూడా పొందుపరిచి పంపాలన్న ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకూ గ్రామాల్లో జానాభా, సర్వే నంబర్లతో రెవెన్యూ సరిహద్దుల మ్యాపింగ్ వంటి



వాటితోనే పంచాయ తీల ఫార్మెట్ రూ పొం దించి పంపారు. ఇక తిరిగి ఫార్మెట్‌లో రెవెన్యూ, వార్డుల సం ఖ్యను కూడా జత పరచా ల్సి రావ టం తో మొత్తం పని మళ్లి మొదటికి వస్తోం ది.

రాష్ట్రం లో ప్రతి 500జనాభాకు ఒక పంచాయతీ ప్రాతిపదికన శివా రు గ్రావాలు , తాండాలు, గిరిజన గూడెలను పంచాయతీలుగా మార్చేం దుకు అవసర మైన ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారులను ఆదేశించింది. ప్రతిపాదనలు పంపా ల్సిన గడువు కూడా గత నెల 31తోనే ముగిసి పోయింది. వరంగల్‌తోపాటు మరో రెండు మూడు జిల్లాల నుంచి ఇంకా వివరాలు అందాల్సి వుంది.

ఈ నేపథ్యంలో తాజగా పంచా యతీల రెవెన్యూ, వార్డుల సంఖ్య కూడా జత పరచా లన్న తాజా ఆదేశాలతో మొత్తం పని తొలినుంచి చేసుకు రావాల్సి వస్తోందని నిజామాబాద్ జిల్లాకు చెందిన పంచాయతీ రాజ్ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

నిధుల కేటాయిపుపై కసరత్తులు

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరపాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నాడు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీల వారీగా ఏ పంచాయతీకి ఎన్ని నిధులు కేటాయించాలి. జనాభాను ఏప్రాతి పదికన లెక్కలోకి తీసుకోవాలి అన్న అంశాలపై ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. హైదారాబాద్ మినహా రాష్ట్రంలోని 30 జిల్లాల పరిధిలో సుమారు నాలుగు వేల దాక కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటి స్క్రూటినీ పనులు చివరిదశకు వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీఏ భవనాలకు రూ. 37 కోట్లు
ప్రభుత్వానికి నివేదిక అందజేసిన అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జిల్లాల్లో ఆర్టీఏ సొంత భవనాల నిర్మాణం కోసం రూ. 37 కోట్లు ఖర్చు కానుంది. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో పాటు పాత జిల్లాల్లోని అత్యధిక కార్యాలయాలు అద్దె భవనాల నుండే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి కూడా భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. జిల్లా కలెక్టర్లను సంప్రదించి సొంత భవనాలకు అవసరమైన స్థలాలను సేకరించాలని ఆర్టీఏ అధికారులను ఆదేశిం చారు. దీంతో ఆర్టీఏ అధికారులు జిల్లాల వారిగా స్థలాల అన్వేషణ కొనసాగిస్తు న్నారు. అనువైన స్థలాలను గుర్తించి ఆర్టీఏ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్లను కోరడం జరుగుతుంది. ఇప్పటికే అందు బాటులో ఉన్న స్థలాల్లో సొంత భవనాల నిర్మాణం కోసం చర్యలు తీసుకుం టున్నారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే చేపట్టిన భవనాల నిర్మాణాలు నిధులు లేక ముందుకు సాగడం లేదు. వాటిని పూర్తి చేయడానికి నిధులు కోరుతున్నారు. కొత్త భవనాల నిర్మాణాలు, సామాగ్రి, సాంకేతికతను అందిపుచ్చుకొనేందుకు సుమా రు రూ. 37 కోట్లు అవసరమని అధికారులు భావించారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందచేశారు. బడ్జెట్‌లో ఆర్టీఏ లక్ష్యాలను ఖరారు చేయడంతో పాటుగా కొత్త భవనాల నిర్మాణాల కోసం నిధులు కేటాయించే అవకాశం ఉందని ఆర్టీఏ అధికారులు తెలిపారు. 2017 -18లో ఆర్టీఏ వసూళ్ల లక్ష్యం రూ. 3,401 కోట్లుగా నిర్ణయించారు. ఇప్పటికే రూ. 3,200లకు పైగా మొత్తాలను ఆర్టీఏ అధికారులు ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. వచ్చే ఆర్థికసంవత్సరం ఆర్టీఏ ఆదాయం రూ. 3,850 కోట్ల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. సేవలను మెరుగుపర్చడం, వనరులను సమీకరించుకోవడంతో ఆదాయం మెరుగుపడుతుందని తెలిపారు. అద్దె భవనాలు సౌకర్యంగా ఉండటం లేదని, అనేక ఇబ్బందుల మధ్య సిబ్బంది పని చేయవలసి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ఆర్టీఏ కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని తెలిపారు. దశల వారిగా పాత జిల్లా కేంద్రాలతో పాటుగా కొత్త జిల్లా కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లోని ఆర్టీఏ కార్యాలయాలకు సొంత భవనాలు కావాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. మంత్రి మహేందర్ రెడ్డి సానుకూలగా స్పందించారని, నిధులు మంజూరు చేయించడానికి చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

గ్రామ పంచాయతీలకు నిధుల వరద
నల్లగొండ జిల్లాకు అత్యధికం - వరంగల్‌కు అత్యల్పం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మరి కొద్ది నెలల్లో 14వ ఆర్థికసంఘం కాల పరిమితి ముగియనున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వంగ్రామ పంచాయతీలకు పెద్దమొత్తంలో నిధులు విడుదల చేసింది. గ్రామాల అభివృద్ది లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రూ.464కోట్ల విడుదలయ్యాయి. 14వ ఆర్థికసంఘం నుంచి రెండవ విడుతగా ఈ నిధులు నేరుగా గ్రామ పంచాతీయలకు విడుదలయ్యాయి. జిల్లాల వారీగా నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ.26.90కోట్లు విడుదలయ్యాయి. ఆతరువాత స్థానంలో సంగారెడ్డి జిల్లాకు రూ.25.02కోట్లు ,మహబూబ్ నగర్ జిల్లాకు 24.74కోట్లు విడుదలయ్యాయి. అన్ని జిల్లాల్లోకి అతి స్వల్పంగా వరంగల్ అర్బన్ జిల్లాకు రూ.5.96కోట్లు విడుదలయ్యాయి.

జిల్లాల వారీగా 14వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన నిధుల వివరాలు ..

జిల్లా	- నిధులు రూ.కోట్లలో		
అదిలాబాద్	- 12.26	మహబూబాబాద్	- 14.91
మంచిర్యాల	- 12.71	ఖమ్మం	- 21.97
నిర్మల్	- 11.84	భద్రాద్రి కొత్తగూడెం	- 17.45
కొమరంభీం	- 9.51	మెదక్	- 14.99
కరీంనగర్	- 14.34	సంగారెడ్డి	- 25.02
జగిత్యాల	- 15.99	సిద్దిపేట్	- 16.94
పెద్దపల్లి	- 11.02	మహబూబ్ నగర్	- 24.74
రాజన్నసిరిసిల్ల	- 9.21	వనపర్తి	- 10.72
నిజామాబాద్	23.60	నాగరకర్నూల్	- 15.66
కామారెడ్డి	- 18.50	జోగులాంబ గద్వాల	- 10.72
వరంగల్‌ఆర్బన్	- 5.96	నల్లగొండ	- 26.90
వరంగల్ రూరల్	13.02	సూర్యాపేట	- 18.50
జయశంకర్ భూపాలపల్లి	- 13.56	యాదాద్రి	- 14.22
జనగాం	- 10.65	వికారాబాద్	- 16.76
		మేడ్చల్	- 8.91
		రంగారెడ్డి	- 23.49.

పొలంలోనే కుటీర పరిశ్రమ

- చిన్నగోడౌన్లు.. కంటైనర్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి
- చిన్నపాటి ధాన్యం మరలుంటే రైతులకే మేలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : కేంద్రం నుంచి అన్ని రాష్ట్రాలు వ్యవసాయాన్ని లాభసాటి బాటలో పెట్టాలని యోచిస్తున్నాయి. ఇందుకోసం అనేక పథకాలు ప్రకటించి అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా పెట్టుబడికి తగ్గ లాభం రైతుకు చేకూరాలన్నదే ఈ పథకాల ప్రధానాశయం. ఇప్పటికే సాగులో ఆధునిక యంత్రాల ప్రవేశంతో ఉత్పాధక వ్యయం తగ్గింది. తక్కువ సమయంలోనే ఎక్కువ దిగుబడి సాధించేందుకు నూతన వంగడాల సృష్టి దోహదపడింది. ఇప్పటికీ దేశవ్యాప్తంగా రైతులు తగిన ఆదాయాన్ని ఆర్జించలేక పోతున్నారు. కనీసం పెట్టుబడిని కూడా తిరిగి పొందలేకపోతున్నారు. ఇందుకు కారణం మార్కెటింగ్ సదుపాయాల కొరతే. చేపలు, రొయ్యల వంటి ఆక్వా ఉత్పత్తుల నుంచి కొన్నిరకాల పళ్ళు, కూరగాయల్ని కూడా ధర ఎక్కువ ఉన్న ప్రాంతానికి సురక్షితంగా, సులభంగా తరలించగలుగుతున్నారు. ఇందుకోసం ఇన్సులేషన్ చేసిన వాహనాలు అందుబాటు లోకొచ్చాయి. సమశీతోష్ణ లేదా శీతల వాతావరణాన్ని ఇందులో ఏర్పాటు చేయగలుగుతున్నారు. ఈ కంటైనర్లలో సుదూరంలోని ముంబై, కోలకతా, లక్నో వంటి ప్రాంతాలకు కూడా ఒకటి రెండ్రోజుల్లోనే ఈ ఉత్పత్తుల్ని చేరవేస్తున్నారు. అక్కడ మార్కెట్లో వీటికి తగిన ధర లభిస్తోంది. శీతల కంటైనర్లలో రవాణా వల్ల తాజాదనం చెడిపోవడం లేదు. దీంతో వీటి ఉత్పాదకులకు తగిన లాభాలు సమకూరుతున్నాయి. అదే బియ్యం విషయాని కొచ్చేసరికి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ధాన్యం ఉత్పత్తిని దాచుకునే వీలు అందుబాటులో లేదు. గోడౌన్లు ఉన్నా అవి ఏమూలలకు సరిపోవు. దీంతో కళ్ళాల నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించక తప్పని పరిస్థితి రైతులకు ఏర్పడుతోంది. లేదా కళ్ళాల్లోనే ధాన్యాన్ని బ్రోకర్లకు అప్పగించని స్థితి నెలకొంటోంది. ఇప్పటికే ఆధునిక వ్యవసాయ విధానాల్లో అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ మార్కెటింగ్ విషయానికొచ్చేసరికి మాత్రం మార్పులు రావడంలేదు. రైతుల పొలాల పరిధిలోనే ఉత్పత్తికి తగిన స్థాయిలో నిల్వచేసేందుకు వీలైన చిన్న చిన్న గోడౌన్లు లేదా సమశీతోష్ణస్థితిలో ఉంచగలిగే కంటైనర్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి. బియ్యం మిల్లులపైనే ఆధారపడకుండా చిన్న చిన్న ధాన్యం మరల ఏర్పాటును ప్రోత్సహించాలి. ఇవి పెద్దగా పెట్టుబడితో కూడిన వ్యవహారాలు కాదు. ప్రభుత్వం కాస్త ప్రోత్సాహమిచ్చి, కొంత సబ్సిడీలిస్తే రైతులు తమ కళ్ళాల్లోనే వీటిని ఏర్పాటు చేసుకోగలుగుతారు. తద్వారా మార్కెట్లో ధరలు పెరిగే వరకు ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశముంటుంది. అలాగే ధరలకు అనుగుణంగా అవసరమైన మేరకే బియ్యాన్ని మరాడించి మార్కెట్‌కు తరలించే వీలేర్పడుతుంది. ఈ విధానంలో బియ్యంతో పాటు పశువులకు అవసరమైన తవుడు, దూగరలు కూడా రైతుకు సమకూరతాయి. వీటన్నింటిని పరిశ్రమలుగా ఏర్పాటు చేసుకోవచ్చు. గతంలో ఇలాంటి పరిశ్రమలకు ఎంతో ప్రోత్సాహముండేది. మహాత్మ గాంధీ కూడా ఇలాంటి చిన్నపరిశ్రమలవైపే మొగ్గుచూపేవారు. కుటుంబ సభ్యులతోనే వీటిని నిర్వహించుకోవచ్చు. పెద్దగా పెట్టుబడి ఉండదు. ఆశించిన ప్రయోజనం చేకూరుతుందని మార్కెటింగ్ విశ్లేషకులు సూచిస్తున్నారు. గ్రామాల స్థాయిలో ఈ విధానాన్ని ప్రోత్సహిస్తే మహాత్ముడు ప్రతిపాదించిన కాటేజీ పరిశ్రమలకు ఇది మరో రూపం. రైతులు తమ ఉత్పత్తులకు తామే వినియోగదారుడికి అవసరమైన విధంగా మార్పులు చేసి నిల్వచేసి విక్రయించడం ద్వారా ప్రతి రైతు, ప్రతి క్షేత్రం కూడా చిన్నపాటి కుటీరపరిశ్రమగా మారుతుందని, అది కుటుంబ సభ్యులతో నిర్వహించుకోవచ్చని, తద్వారా అధికాదాయం పొందొచ్చని ఈ రకమైన ఆలోచన చేయాల్సిన అవసరముందని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర పెంచి రైతుల్ని తమకు మాత్రమే విక్రయించేలా ఒత్తిడి తేవడం లేదా దళారుల బారిన పడేలా వారి మానాన వారిని వదిలేయడం కాకుండా రైతును కేవలం సాగుదారుడిగానే కాకుండా చిన్నపాటి పారిశ్రామికవేత్తగా, వ్యాపారవేత్తగా కూడా తీర్చిదిద్దడం ద్వారా తన పంటకు న్యాయబద్ధమైన ధరను సొమ్ము చేసుకునే విధంగా రైతుల్ని తీర్చిదిద్దే అవకాశాలుంటాయని వీరు సూచిస్తున్నారు.

మళ్లీ మెరుపుదాడులు?

(మొదటిపేజీ తరువాయి)

గదర్ పోర్టు వరకు ఆర్థిక కారిడార్ పేరిట నిర్మించే ఈ భారీ రహదారి పాక్, చైనాల ఆయుధ మోహరింపు కేంద్రాలుగా మారనుంది. పైగా భారత్‌లోని కీలక నగరాలైనా ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, జైపూర్, అమృత్‌సర్, లక్నోలతో పాటు సుదూరంలోని హైదరాబాద్, చెన్నైల్ని కూడా లక్ష్యంగా చేసుకుని ప్రయోగించగలిగే క్షిపణుల పరిధికి అనుగుణంగా ఈ రహదారి నిర్మాణం సాగుతోంది. దీనిపై దీర్ఘకాలంగా భారత్ తన అభ్యంతరాన్ని తెలియజేస్తున్నా పాకిస్తాన్ పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయ వేదికలపై కూడా దీనికి పరిష్కారం లభించలేదు. ఈ దశలో సర్జికల్‌స్ట్రైక్స్ తరహా దాడుల్ని నిర్వహించడం ద్వారా కారిడార్ పేరిట నిర్మిస్తున్న రహదార్లు, ముఖ్యంగా భారీ వంతెనల్ని ధ్వంసం చేయాలని భారత్ యోచిస్తోందన్నది డాన్ పత్రిక కథనం. ఇందుకోసం నాలుగొందల మంది ముస్లిం యువకుల్ని ఎంపిక చేసి సంబంధిత శిక్షణ కోసం ఆఫ్ఘనిస్థాన్‌కు పంపించిందని కూడా ఈ పత్రిక పేర్కొంది. ఇప్పటికే దీన్ని గమనించిన పాక్ హోంశాఖ స్థానికంగా భద్రతను కట్టుదిట్టం చేయాలని పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రభుత్వానికి సూచించినట్లు ఇది పేర్కొంది.

కొన్ని మాసాలుగా ఉపఖండంలో భారత్ అంతర్గత సమస్యల్ని ఎదుర్కొంటోంది. తరచూ పాక్ కవ్వింపులకు పాల్పడుతోంది. ఇటీవల చైనా నుంచి కూడా కవ్వింపులు పెరిగాయి. డోక్లామ్ సంఘటన అనంతరం సరిహద్దుల్లో ఎక్కడోచోట చైనా చొరబాట్లు సాగుతూనే ఉన్నాయి. చైనాలోని క్సింజియాంగ్ మీదుగా నిర్మాణం కానున్న ఈ కారిడార్ భారత ఈశాన్య ప్రాంతం మీదుగా సాగిపోతుంది. ఓ విధంగా భారత్ తలచుట్టూ ఈ నిర్మాణం సాగనుంది. దీని వల్ల భారత సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందంటూ ప్రకటించిన ఆందోళనపై ఇరుదేశాలు స్పందించకపోవడంతో ఆకస్మిక దాడుల విధానమే మేలని ఇప్పటికే సైనిక వ్యవహారాల నిపుణుడు కేంద్రానికి సూచించినట్లు సమాచారం. తాజాగా రాజౌరి సెక్టార్‌లో కాల్పుల ఉల్లంఘనకు పాల్పడి నలుగురు భారతీయ సైనికుల్ని పాక్ హతమార్చడంపై ఆర్మీ వైస్‌చీఫ్ జనరల్ శరత్‌చంద్ నర్మగర్భంగా వ్యాఖ్యలు చేశారు. పాక్‌కు తగిన విధంగా ప్రతిఫలం చెల్లించుకోక తప్పదు.. ప్రతీకారం ఖచ్చితంగా ఉంటుంది.. అయితే అదే ఉంటుందంటూ చెప్పను.. కానీ తలబొప్పికట్టేలా పాక్‌కు గుణపాఠం నేర్పడం మాత్రం తథ్యమంటూ ఆయన పేర్కొన్నారు. పాక్ మనపై యుద్ధం ప్రకటించిందని కూడా వ్యాఖ్యానించారు. ఇప్పటికీ మౌనాన్ని ఆశ్రయిస్తే చరిత్రకు బదులివ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు.

ఇప్పటికే పాక్‌కు అమెరికా నుంచి ఆర్థిక, సైనిక సహకారం నిల్చిపోయింది. మరోవైపు అమెరికా, చైనాల మధ్య సంబంధాలు తీవ్రంగా బెడిసికొట్టాయి. ఈ దశలో భారత్ తీసుకునే ఏ చర్యకైనా అమెరికా మద్దతు లభిస్తుందంటూ అంతర్జాతీయ సైనిక వ్యవహారాల నిపుణులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇటీవలె కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన తాజా వ్యాఖ్యలు కూడా కేంద్ర ప్రభుత్వ ఆలోచనకు అద్దంపడుతున్నాయి. తరచూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భారత సైన్యంపై కాల్పులకు తెగబడుతున్న పాక్‌లోకి ప్రవేశించి మరీ దాడులు చేస్తామంటూ రాజ్‌నాథ్ హెచ్చరించారు. భారత్ ఏమాత్రం బలహీనదేశం కాదు... శత్రువులపై భారత భూభాగంపై నుంచి కాదు.. అవసరమైతే వారి దేశంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడులు చేయగలిగే సామర్థ్యం, తెగింపు భారత్‌కు ఉన్నాయంటూ ఆయన హెచ్చరించారు. దీంతో ఎన్నికలకు ముందే పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంపై భారత్ దాడులు చేసి పాక్‌కు తగిన విధంగా బుద్ధిచెప్పడం ఖాయమన్న వాతావరణం కనిపిస్తోంది.

ఇంటింటా విజయ పాల ఉత్పత్తులు

- విజయ డెయిరీ ఆధునీకరణ, విస్తరణ
- ఈ బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు
- గొర్రెల పంపిణీ పథకం విప్లవాత్మకం
- గొర్రెల పథకాన్ని తప్పుదోవ పట్టిస్తే దండనే
- 50 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- రైతు బజార్లలో ఆధునిక మాంసం మార్కెట్లు
- **ఆంధ్రప్రభ** ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి తలసాని



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో విజయా పాలను వినియోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసరావు చెప్పారు. ప్రైవేట్ పాల ఉత్పత్తి సంస్థలకు ధీటుగా విజయా డెయిరీని భారీ ఎత్తున విస్తరించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఆయన తెలిపారు. నగర శివారులోని మేడ్చల్‌లో వంద ఎకరాల స్థలంలో విజయా డెయిరీ విస్తరణకు ప్రణాళికలు సిద్ధంచేశామని ఈ బడ్జెట్‌లోనే ఇందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని మంత్రి తలసాని సోమవారం ఆంధ్రప్రభకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. సమైక్య రాష్ట్రంలో విజయా డెయిరీని నాటి పాలకులు పట్టించుకోలేదని ప్రైవేట్ డెయిరీల అభివృద్ధికే వారు దృష్టి సారించారని దీంతో ఈ సంస్థ అభివృద్ధి చెందలేకపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో కేవలం నాలుగున్నర లక్షల లీటర్ల పాలను మాత్రమే విజయా డెయిరీ, ముల్కనూరు డెయిరీ, మదర్ డెయిరీ సంస్థలు సరఫరా చేస్తున్నాయని ఇంతకంటే పెద్దఎత్తున ప్రైవేట్ డెయిరీలు పాలను, పాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నాయని చెప్పారు. రుచిలో, నాణ్యతలో విజయా డెయిరీకి మించిన పాలు, పాల ఉత్పత్తులు లేవని అయితే ఈ ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకు వెళ్ళడంలో విఫలమయ్యామని చెప్పారు. అతి త్వరలోనే హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో వెయ్యికిపైగా విజయా డెయిరీకి సంబంధించిన ఉత్పత్తులను విక్రయించేందుకు పార్లర్లకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తలసాని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వచ్చే రెండు, మూడు మాసాల్లో పూర్తిస్థాయిలో పార్లర్లు ఏర్పాటవుతాయని ఆయన చెప్పారు. విజయా డెయిరీ ఉత్పత్తి చేసే నెయ్యికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ఇతర డెయిరీలేవీ విజయా డెయిరీ ఉత్పత్తి చేసే నెయ్యికి పోటీగా వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలు, వసతి గృహాలు, స్వచ్ఛంద సంస్థలకు విజయా డెయిరీ ఉత్పత్తి చేసే పాలు, పాల ఉత్పత్తులను అందించేలా ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తొలుత మంత్రులతో సమావేశమై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. విజయా డెయిరీ ఆధునీకరణకు సంబంధించి ఇప్పటికే అధికారులు, ఉద్యోగులతో అనేక దఫాలు సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం తీసుకుబోయే చర్యలను వివరించామని అందుకు వారు కూడా సమ్మతించారని తలసాని పేర్కొన్నారు.

వచ్చే ఏడాదిలో ప్రతి ఇంటా విజయా పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విజయా డెయిరీ ఆధునీకరణకు సంబంధించి ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయని పాలను శీతలీకరించేందుకు వీలుగా మార్కెట్‌లో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగుతామని తెలిపారు. రైతుల నుంచి పెద్దఎత్తున పాలను కొనుగోలు చేస్తామని ఇప్పటికే పాడి రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించిందని చెప్పారు. విజయా డెయిరీ తయారు చేస్తున్న ఐస్‌క్రీమ్ ఎంతో రుచిగా ఉంటుందని తెలంగాణలో వివాహం జరిగినా, ఇతర శుభ కార్యాలయాలు ఏదీ జరిగినా అక్కడ విజయా డెయిరీ ఐస్‌క్రీమ్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, నగర పాలక సంస్థల్లో ఉన్న హోటల్ యజమానులతో తమ శాఖకు సంబంధించిన అధికారులు సమావేశాలు నిర్వహించి విధిగా సంస్థ ఉత్పత్తి చేస్తున్న పాలను, నెయ్యి, ఐస్‌క్రీమ్‌తో పాటు ఇతర ఉత్పత్తులను వాడేవిధంగా చూస్తామని చెప్పారు.

గొర్రెల పథకం విజయవంతం

సీఎం కేసీఆర్ మానస పుత్రిక గొర్రెల పథకం విజయవంతమైందని తలసాని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ మదిలో గొర్రెల పథకం చేపట్టాలన్న ఆలోచన వచ్చిందని వెంటనే ఈ పథకం అమలుకు ఆయన నడుం బిగించారని చెప్పారు. ఈ పథకం వల్ల తెలంగాణ జిల్లాల్లో ఉన్న యాదవులు, కురవలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని గుర్తుచేశారు. 75 శాతం సబ్సిడీతో ఈ గొర్రెల పథకం ప్రవేశపెట్టామని ఎనిమిది రాష్ట్రాల నుంచి గొర్రెలను కొనుగోలుచేసి వీటిని లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. గొర్రెలు అమ్ముకోకుండా, ఈ పథకం పక్కదారి పట్టకుండా జియోట్యాగింగ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఎక్కడ గొర్రెలు కొనుగోలుచేస్తే అక్కడే ఆ గొర్రెలకు జియోట్యాగింగ్ చేసి అక్కడి నుంచి ఏ ప్రాంతానికి వాటిని పంపించాలో అక్కడికి చేరవేశామని తెలిపారు.

ఈ పథకం ప్రారంభించిన నాలుగున్నర మాసాల్లో 40 లక్షల గొర్రెలను లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. గొల్ల, కురవల జీవనాధారం గొర్రెలను మేపుకోవడమేనని ఇదే వృత్తిని వారు నమ్ముకుని జీవిస్తున్నారని అటువంటి వారికి అండగా నిలబడాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కులవృత్తులను నమ్ముకుని గ్రామీణ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలన్న తపన ముఖ్యమంత్రి కేసీఆర్‌దని, అందుకు అనుగుణంగానే గొర్రెల పథకంతో పాటు పాడి రైతులకు గేదెలు, మత్స్యకారులకు చేపలు ఇలా ఎన్నెన్నో వినూత్న పథకాలకు ఆయన నడుం బిగించారని చెప్పారు. మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లల కార్యక్రమాన్ని కూడా ఊహించని రీతిలో విజయవంతమైందని గ్రామాలు, తండాలు, పట్టణాలు, చెరువులు ఎక్కడున్నా అక్కడి వారికి చేప పిల్లలను ఉచితంగా ఇచ్చి వాటిని ప్రభుత్వమే నీళ్ళలోకి వదిలిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో తెలంగాణలోని ముదిరాజ్, తెలుగు, ఇతర కులాల వారు చేప పిల్లలను మార్కెటింగ్ చేసి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అందజేసిన చేపపిల్లలను సంరక్షించుకునే బాధ్యత మత్స్యకార కమిటీలకు అప్పగించామని చెప్పారు. మార్కెటింగ్ శాఖ నిర్వహిస్తున్న రైతు బజార్లలో స్థలాన్ని బట్టి మాంసం మార్కెట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మత్స్యకారులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వం కమిటీ హాళ్ళను నిర్మిస్తుందని ఒక్కో హాలుకు సబ్సిడీగా రూ.8 లక్షల వరకు ఇస్తుందని చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తర్వాత ప్రభుత్వానికి గొర్రెల పథకం ద్వారా మంచి పేరుప్రఖ్యాతలు వచ్చాయని ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న గొల్ల, కురవలు ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్న అంశాలను వెల్లడిస్తున్నారని తలసాని గుర్తుచేశారు. గొర్రెల పెంపకందారులకు ఉచితంగా 75 శాతం సబ్సిడీతో గడ్డి మొలకలు అందజేస్తున్నామని, వీటిని అటవీ ప్రాంతంలో పెంచుకుంటే గొర్రెల మేతకు ఇబ్బంది లేకుండా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం అందజేసిన గొర్రెలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకోసం ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటుచేసి గ్రామ గ్రామాన తిరిగి వ్యాక్సిన్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే పశు సంవర్ధకశాఖ రెండువేల ఖాళీలను భర్తీ చేశామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 22 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశామని దీన్ని 50 కోట్లకు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

కాళేశ్వరం... జూన్ మంత్రం!



(మొదటిపేజీ తరువాయి)

జరిగింది.. మరుసటి రోజు లక్ష్యం ఏంటని ఆరా తీస్తూ.. అధికారులను అప్రమత్తం చేస్తుంటారు. సిఎం ఆదేశాల మేరకు.. మంత్రి హరీష్‌రావు తరచూ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లో పరిశీలిస్తుండగా, ఎక్కడ సమస్య తలెత్తినా నిమిషాల్లోనే మంత్రి హరీష్ పరిష్కారం చూపుతున్నారని ప్రాజెక్ట్ సైట్‌ల వద్ద పలువురు ఇంజనీర్లు, ఏజెన్సీల ప్రతినిధులు ఆంధ్రప్రభతో చెప్పారు. మేడిగడ్డ మినహా.. మిగతా పనులన్నీ జూన్ నాటికి పూర్తిచేసే లక్ష్యంతో సాగుతుండగా, తమపై ఒత్తిడేమీ లేదని.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వంగా ఉందని సుందిళ్ళ ప్రాజెక్టు వద్ద ఓ ఇంజనీర్ తెలిపాడు. తాము రోజుకు 16గంటలు పనిచేసినా.. అంతకు మించి పనిచేసినా.. దీనిని కష్టంలా భావించడం లేదని, ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలన్న కసితో శ్రమిస్తున్నామని చెబుతున్నారు. మెరికల్లాంటి యువ ఇంజనీర్లు కాళేశ్వరంకు బలం కాగా, వీరిలో అణువణువునా స్ఫూర్తిని నింపడంతో మంత్రి హరీష్ సఫలమయ్యారు. ఫలితంగా ఇది ప్రభుత్వపనిగా అక్కడ పనిచేస్తున్నవారిలో భావనలేదు. తపన.. కసి.. భావోద్వేగాలతో అక్కడ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణ పనులు.. ఇలా తపస్సులా జరగడం దేశంలోనే అరుదు. తెలంగాణ ప్రభుత్వం ఇందులోనూ తనదైన ముద్ర వేసింది. ప్రభుత్వ తపనను.. ప్రజల ఆర్తిని అర్థం చేసుకున్న వందలాది ఇంజనీర్లు.. వేలాది కార్మికులు.. ఏజెన్సీలు రాత్రి, పగలూ తేడా లేకుండా చేస్తున్న మహాయజ్ఞం సత్ఫలితాలనిస్తోంది. ప్రతి పని ప్రదేశం వద్ద కనిపిస్తున్న కదనోత్సాహం.. ఖరీఫ్‌కు కాళేశ్వరం జలాలను తీసుకొచ్చే వాతావరణాన్ని ఏర్పరిచింది. 18.25లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా, మరో 18.82లక్షల స్థిరీకరణకు ప్రాజెక్టును రూపకల్పన చేయగా.. పూర్తిగా కాకున్నా పాక్షికంగానైనా జూలై నాటికి నీరు అందబోతోంది.

అబ్బురపరిచే సాంకేతికత

కాళేశ్వరం ప్రాజెక్టులో సాంకేతికత అబ్బురపరుస్తోంది. లక్ష్మీపూర్ ప్యాకేజీ-8లో చేపట్టి నిర్మాణం దాదాపు పూర్తయ్యేదశకు చేరిన సొరంగం, సొరంగంలో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన సర్జ్‌పూల్ ఒక మహాద్భుతంగా ఆవిష్కృతమయ్యాయి. మేడారం ప్రాజెక్టు నుండి ప్యాకేజీ-8కు నీటిని చేర్చే ఈ టన్నెల్‌ను 15కిమీ పొడవున నిర్మిస్తున్నారు. టన్నెల్, సర్జ్‌పూల్ నిర్మాణం ప్రపంచమే అబ్బురపడేలా ఉంది. ఇలాంటి ప్రతిష్టాత్మకమైన టన్నెల్ దేశంలోనే ఎక్కడా లేదని ఇంజనీర్లు తెలిపారు. స్విట్జర్లాండ్, ఇంగ్లాండ్ దేశాలలో పెద్ద టన్నెల్స్ ఉన్నాయని.. లక్ష్మీపూర్ టన్నెల్ ఆసియాలోనే అతిపెద్దదని వివరించారు. ఇక్కడ 1,87,000హార్స్‌పవర్ (139మెగావాట్లు) ఉన్న అతి భారీమోటార్లు వాడుతుండడం విశేషం. 7భారీ మోటార్లు ఈ సర్జ్‌పూల్‌లో అమరుస్తుండగా.. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ నుండి నీరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్‌లోకి.. అక్కడి నుండి మిడ్‌మానేరులోకి వెళ్ళనుంది. ఇంత భారీ సామర్థ్యమున్న బాహుబలి మోటార్లు భారతదేశంలోనే ఒక సాగునీటి ప్రాజెక్టులో నిర్మించడం ఇదే ప్రథమం. ఈ సర్జ్‌పూల్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి.

గొర్రెల పథకంలో రికార్డు

- 2 లక్షల మందికి 42 లక్షల గొర్రెల పంపిణీ
- గొల్ల, కురుమ కుటుంబాలకు శాశ్వత స్వయం ఉపాధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షలకు పైబడి ఉన్న గొల్ల, కురుమ కుటుంబాలకు శాశ్వత స్వయం ఉపాధి మార్గాలను చూపాలన్న నిర్ణయంలో భాగంగా తెలంగాణ ఆవిర్భావ దినం పురస్కరించుకుని గత జూన్ 2న ప్రారంభించిన ఈ పథకం అతి తక్కువ సమయంలోనే లక్ష్యాలను చేరుకునే దిశగా పురోగతి సాధిస్తోం ది. ఇప్పటికే అనేక రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలుసు కేసీఆర్ సర్కారు సరికొత్త విధానంలో అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి సంకల్ప బలంతో ముందడుగు వేస్తోంది. సహజ, మానవ వనరులు సమృద్ధిగా ఉన్న రాష్ట్రంలో ప్రతిరోజూ 8లక్షల లీటర్ల పాలు, 650 లారీల గొర్రెలు దిగుమతి చేసుకోవడాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి మన అవసరాలను మనమే తీర్చుకోవాలన్న ధృడ సంకల్పంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగం గానే రూ.5వేల కోట్ల సబ్సిడీ నిధులతో ప్రతిష్టాత్మకమైన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపిన సమాచారం మేరకు ఇప్పటివరకు 23.80 లక్షల గొర్రెలను పంపిణీ చేశారు. దసరా నాటికి 20 లక్షల గొర్రెలు పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చిన నేపథ్యంలో లక్ష్యానికి మించి మరో నాలుగు లక్షల గొర్రెలను ఎక్కువగానే పంపిణీ చేశారు.

ఇప్పటి వరకు రెండు లక్షలకుపైగా గొల్ల, కుర్మలకు ఒక్కొక్కరికి 21 చొప్పున 75శాతం సబ్సిడీపై 42 లక్షల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ గొర్రెలను ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి తెచ్చి లబ్ధిదారులకు అందించడమైంది. ఇప్పటి వరకు 15.50 లక్షల గొర్రె పిల్లల పునరుత్పత్తి జరిగి సుమారు 700 కోట్ల సంపద గొల్ల, కుర్మలకు ఒనగూడమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ వాటా రూ.1,877 కోట్లు, లబ్ధిదారుల వాటా రూ.625 కోట్లు మొత్తం రూ.2,502 కోట్లు ఖర్చు చేశారు.

సంరక్షణ చర్యలు కూడా ఆదర్శమే

గొర్రెల ఆరోగ్య పరిరక్షణ కోసం యూనిట్‌కు రూ.425 చొప్పున జిల్లాలకు రూ.6 కోట్లు విడుదలచేసి మెడికల్ కిట్స్‌తో గొర్రెల ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోకవర్గానికి ఒకటి చొప్పున 100 సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. పశుగ్రాసం కొరత రాకుండా స్టెల్లో పశుగ్రాస పెంపకానికి ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. అటవీ భూములకు గొర్రెల మేపుకు సడలింపు ఇచ్చారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా గొర్రెలకు షెడ్లు, నీటితొట్ల నిర్మాణాలకు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ అసాధారణ ప్రగతికి రాష్ట్రంలో పని చేయనున్న పశు సంవర్ధకశాఖ అధికారులు, డాక్టర్లు, పారా సిబ్బంది, గోపాలమిత్రల సేవలు వెలకట్టలేనివని తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.లక్ష్మారెడ్డి అన్నారు. ఈ పథకం పురోగతిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తూ సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహం, పకడ్బందీగా ముందుకు తీసుకువెళ్ళడంలో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ చొరవతో అనూహ్య ప్రతి సాధించామన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇంత భారీస్థాయిలో గొర్రెల పంపిణీ లేదని, ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి ప్రశంసిస్తున్నారని అన్నారు. లబ్ధిదారులు ఎవ్వరూ కూడా ఈ గొర్రెల యూనిట్లు అమ్ముకోకూడదని, రీసైక్లింగ్‌కు పాటుపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టర్ల పర్యవేక్షణలో

జిల్లా రైతు సమితులు

- వారంలోగా ఏర్పాటుకు ఆదేశాలు
- లక్ష్యాల చేరువ దిశగా సంక్షేమ కార్యక్రమాలు
- పర్యవేక్షణ రాష్ట్ర సమితికి .. బాధ్యత మార్క్‌ఫెడ్‌కు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాధ్యమైనంత త్వరలో జిల్లా రైతు సమన్వయ సమితు లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభిం చింది. ఇప్పటికే పూర్తి కావాల్సిన ఆ ప్రక్రియను గరిష్టంగా వారం రోజుల్లోగా పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు అందా యి. ఇందుకు సంబం ధించి సీఎం కార్యాలయ ఉన్నతాధి కారులు మార్గ దర్శకాలను పంపించారు. జిల్లా స్థాయిలో అత్యంత కీలకంగా పనిచేసే 24 మంది సభ్యులతో కూడిన సమన్వయ సమితుల అధికా రాలు బాధ్యతలపై ఈ నెలాఖరులోగా శిక్షణ కూడా ఇవ్వను న్నారు. ఆ తర్వాత మండల, గ్రామ సమాఖ్యల సభ్యులకు కూడా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుం టున్నా రు. త్వరలో ప్రారంభ మయ్యే ఖరీఫ్ నుంచి వ్యవసాయ రంగ అభి వృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాల్లో సమన్వయ సమితులే కీలకంగా పనిచేయాల్సి ఉన్నందున ఈ వ్యవస్థలో లోటుపాట్లను సవరించే అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. పెట్టుబడి మద్దతు మొదలుకుని పంట కొనుగోళ్ళ వరకు ప్రతి కార్యక్రమం లోనూ వీరి భాగస్వామ్యం ఉండేవిధంగా కలెక్టర్ల ఆధ్వర్యం లో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధమవు తున్నాయి.



రాష్ట్ర ప్రతిష్టతో ముడిపెట్టుకుని ఉన్న పెట్టుబడి మద్దతు పథకాన్ని సమన్వయ సమితుల నేతృత్వంలోనే అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యం లో ఆయా జిల్లాల నుంచి ప్రాతి నిధ్యం వహిస్తున్న మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రస్థాయిలో రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత అమలు బాధ్యతలను ఆ పాలకమండలి పర్యవేక్షిస్తోంది. వ్యవసాయ రంగంపై అవగాహన ఉన్న ఒక సీనియర్ అధికారికి ఈ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించి పూర్తిస్థాయిలో కార్యక్రమాలను ఇక్కడి నుంచే ప్రారంభిం చనున్నారు.

ఒకే గొడుగు కిందకు అన్ని పథకాలు

ప్రభుత్వం ద్వారా రైతు కుటుంబాలకు అందించే సహకారాన్ని, చేయూతను సమన్వయ సమితుల ద్వారానే ప్రారంభించనున్నారు. ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువుల పంపిణీ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతులకు పెట్టుబడి మద్దతు పథకం తదితర అంశాలన్నీ ఒకే వ్యవస్థ కింద పర్యవేక్షిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నది సీఎం కేసీఆర్ ముందుచూపు ఆలోచన.

కొనుగోళ్ళకు మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీ

వ్యవసాయోత్పత్తులు బహిరంగ మార్కెట్‌లో అమ్ముడుపోని సందర్భాల్లో సమన్వయ సమితుల ద్వారా కొనుగోళ్ళు చేసే అంశాన్ని మార్క్‌ఫెడ్ పర్యవేక్షిస్తుంది. వ్యవసాయ యాంత్రీకరణ ఆవశ్యకత పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోనున్నారు. పరిశోధనా ఫలాలను రైతులకు చేర్చడం ద్వారా రెండింతల దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పరికరాలను ఈ ఏడాది ఖరీఫ్ నుంచే విస్తృతస్థాయిలో పంపిణీ చేయనున్నారు.

ఈ విషయాన్ని కూడా గ్రామగ్రామాన ప్రచారంచేసి సమన్వయ సమితుల ద్వారానే అర్హులను గుర్తించనున్నారు. వ్యవసాయ రంగంలో నెలకొని ఉన్న సమస్యలన్నింటినీ పూర్తిగా తొలగించాలన్న లక్ష్యంతోనే ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు వెసులుబాటు కల్పిస్తోందని మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 6 ఫిబ్రవరి 2018

కర్ణాటకపై ఎమ్ఐఎమ్ కన్ను!



శంకరాజీయం
-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ముఖచిత్రాన్ని హైదరాబాద్ నీడ కమ్ముకుంటోంది. ఈ ఏడాది ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేయాలని ఆల్ ఇండియా మజ్లీస్ ఇత్తెహాదుల్ ముస్లిమైన్(ఏఐఎమ్ఐఎమ్) నిర్ణయించు కోవడం ఆసక్తిని రేపుతోంది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎమ్ఐఎమ్ ఇక్కడ పోటీకి దిగితే ఎన్నికల గణాంకాలే మారిపోయే అవకాశాలున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలను పునర్నిర్వచించుకుంటోంది. దేశంలోని ముస్లిం ఓట్లను గుప్పిట పట్టే అంశంపై ఎమ్ఐఎమ్ దృష్టి సారించింది. ఈ మార్పు వల్ల దెబ్బతినేది కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం ఓటు బ్యాంకే. కర్ణాటకలోని ముస్లిం ఓటర్లు కాంగ్రెస్ లేదా జేడీ(ఎస్) పార్టీల వైపు మొగ్గుచూపుతారు. తొలినాళ్ళలో దేవెగౌడను ముస్లిం ఓటర్లు బాగా నమ్మారు. తమ రక్షకుడిగా ఆయన్ను భావించారు. ఆయన కుమారుడు హెచ్‌డి కుమార స్వామి బీజేపీ పంచన చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంతో పరిస్థితి ఒక్కసారి మారిపోయింది. అప్పటి నుంచి ముస్లిం ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటేయడం మొదలు పెట్టారు. తాజాగా కాంగ్రెస్ రాష్ట్రంలోని హిందువులను ప్రసన్నం చేసుకునే పనిలో పడింది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారాన్ని ఓ పెద్ద ఆలయం నుంచి రాహుల్ గాంధీతో ప్రారంభింపజేయాలని పార్టీ భావిస్తోంది. రాహుల్ గాంధీ బ్రాహ్మణుడనీ, హిందూ మతం పట్ల విశ్వాసం కలిగున్నారనీ పార్టీ పేర్కొంటోంది. ఇది కాంగ్రెస్‌కు బహుళ ప్రయోజనాలను సాధించిపెడుతుందని భావిస్తోంది. గుజరాత్ వ్యూహాన్నే ఇక్కడా అనుసరించాలనేది కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్తల ఉద్దేశం. ఇది తమకు కలిసొస్తుందని వారంటున్నారు.

దీనితో పాటు రాష్ట్రంలో కీలకమైన లింగాయత్ సామాజికవర్గాన్ని దువ్వుతోంది కాంగ్రెస్. తాము అధికారంలోకి వస్తే లింగాయత్‌లకు ప్రత్యేక మతపరమైన గుర్తింపునిస్తామని హామీ ఇస్తోంది. ఈ సామాజిక వర్గం సాధారణంగా బీజేపీకి మద్దతు పలుకుతుంది. కాంగ్రెస్ చేపడుతున్న ఈ చర్యలు, వైఖరిలో వస్తున్న మార్పులు మైనారిటీలలో ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యాన్ని సునిశితంగా గమనించిన అసదుద్దీన్ ఒవైసీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అడుగులేస్తున్నారు. కర్ణాటకలో ఎమ్ఐఎమ్ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని వారికి తెలుసు. కానీ, తమ వాణిని వినిపించే అవకాశం కలుగుతుంది. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులను పోటీకి పెట్టాలని ఒవైసీ భావిస్తున్నారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్న స్థానాలపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఉదాహరణకు బెంగళూరు నగరం అసెంబ్లీకి 28మంది ఎమ్మెల్యేలను పంపుతుంది. శివాజీనగర్ వంటి ప్రాంతాలలో ముస్లింల ఆధిక్యత ఉంది. ఇలాంటి స్థానాలలో ఎమ్ఐఎమ్‌కు గెలిచే అవకాశాలున్నాయి. కొన్ని సీట్లను చేజిక్కించుకునే వీలు కూడా ఉంది. కల్బుర్గి, బీదర్ వంటి జిల్లాల్లో ముస్లిం ఓటర్లదే ఆధిపత్యం. ఉత్తర కర్ణాకలో కూడా ఇదే పరిస్థితుంది. కోస్తా జిల్లాల్లో కూడా గట్టి అభ్యర్థులను పోటీ చేయించేందుకు ఎమ్ఐఎమ్ ప్రయత్నిస్తోంది. ఈ ప్రాంతాలలో ఆరెస్సెస్ వీరితో తరచూ తలపడుతుంటుంది. ఈ సంఘటనలలో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తుంటాయి. కాంగ్రెస్‌తో ఉన్నప్పటికీ సిద్దరామయ్య ప్రభుత్వం వీరిని ఆదుకోవడంలో విఫలమవుతోంది. ఈ రాష్ట్రంలో వారొక బలమైన నాయకుడి కోసం మైనార్టీలు వేచి చూస్తున్నారు. తమ స్వరాన్ని వినిపించే నాయకుడి కోసం, తమ రక్షకుడి కోసం చూస్తున్నారు. హిందూ తీవ్రవాద సంస్థల నుంచి ఎమ్ఐఎమ్ తమను కాపాడగలదని భావిస్తున్నారు. ఉత్తర కర్ణాటక లోని గుల్బర్గా, బీదర్, దక్షిణ కర్ణాటకలోని బెంగళూరు, కోలార్, జిల్లాల్లో కాంగ్రెస్‌ను ఎన్నికల్లో దెబ్బదీయగల సత్తా ఎమ్ఐఎమ్‌కు ఉంది. కర్ణాటక మొత్తం మీద ముస్లింల ఆధిపత్యం ఉన్న నియోజక వర్గాలు 25 నుంచి 26 ఉన్నాయి. ఈ నియోజక వర్గాలలో ముస్లింల ఓట్లే విజేతను నిర్ణయిస్తాయి. చిన్నా చితక పార్టీలను కలుపుకుని ఎమ్ఐఎమ్ ఈ స్థానాలలో పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి గడ్డుపరిస్థితి ఎదురవు తుంది. పరిస్థితిని గమనించి, ఆందోళనకు గురైన కాంగ్రెస్ తొలి దశలో ఒవైసీతో అవగాహన కుదుర్చుకునేందుకు ప్రయత్నించింది. చామరాజ్‌పేట్ ఎమ్మెల్యే బి.జడ్. జమీర్ అహ్మద్ ఖాన్‌పై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ బాధ్యతను ఉంచారు. నిశ్శబ్దంగా తెరచాటుగా చేసిన ఈ ప్రయత్నం ఫలితమీ యలేదు. ఇది కాంగ్రెస్‌కు అసంతృప్తిని మిగిల్చింది. ఖాన్ పట్ల ఒవైసీ కూడా ఆగ్రహించారని వార్తలొచ్చాయి. ఇన్ని రోజులూ ఖాన్ నన్ను విమర్శించారు. అలాంటి వీడియోలను కూడా నేను చూశాను. ఇప్పుడాయన నన్ను కలవాలను కుంటున్నారు. కాంగ్రెస్‌తో కలిసి నడవాలంటున్నారని ఒవైసీ మండిపడ్డారు. ముందుగా తానేం చేయాలో ఖాన్ నిర్ణయించుకోవాలని ఒవైసీ సూచించారు. కర్ణాటకలో తనకు బహిరంగ సభల్లో ప్రసంగించేందుకు అవకాశమీయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒవైసీ నిప్పులు కురిపించారు.



ఉత్తర ప్రదేశ్ తరహా ఎన్నికల దృశ్యాలే తమకు తిరిగి కనిపిస్తాయేమోనని కాంగ్రెస్ భయపడుతోంది. బీజేపీకి ప్రయోజనం కలిగించే అవకాశాలే ఎక్కువని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎమ్ఐఎమ్‌కు బీజేపీతో రహస్య అవగాహన ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కర్ణాటకలోని అనేక నియోజకవర్గాలలో మైనార్టీల ఓట్లను చీల్చేందుకు బీజేపీ ఎమ్ఐఎమ్‌తో తెరచాటు ఒప్పందాన్ని కుదుర్చుకుందని హోం మంత్రి రామలింగా రెడ్డి ఆరోపిస్తున్నారు. బీజేపీ, ఎమ్ఐఎమ్ కలిసి పరోక్షంగా ముస్లిం అభ్యర్థులను దక్షిణ కర్ణాటకలో పోటీకి నిలిపే అవకాశాలున్నాయని సీనియర్ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ ఇదే తరహా వ్యూహాన్ని అనుసరించింది. ఘన విజయాన్ని సాధించింది. ఎమ్ఐఎమ్‌తో రహస్యంగా చర్చించామన్న వార్తలనూ, కాంగ్రెస్ ఆరోపణలనూ బీజేపీ కొట్టిపారేసింది. కర్ణాటక ఎన్నికలలో తమ పార్టీ 150 స్థానాలను గెలుచుకోవడం తథ్యమనే విశ్వాసంతో ఉంది. ఇదే సమయంలో మైనారిటీ వర్గాన్ని బుజ్జగించేందుకు కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మైనార్టీ వర్గాలకు చెందిన నేతలు, సభ్యులపై ఉన్న మతపరమైన కేసులను ఉపసంహరించుకోవచ్చా లేదా అనే అంశంపై అభిప్రాయాలను కోరుతూ రాష్ట్ర హోం శాఖ జిల్లా ఎస్పీలకు లేఖ రాయడం ఆశ్చర్యపరిచే పరిణామం. ఎన్నికల ప్రయోజనాల కోసం సిద్దరామయ్య ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతుండడాన్ని ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి. ఈ క్రమంలో ఇందులో అన్ని సామాజిక వర్గాల నేతలనూ చేరుస్తూ అభిప్రాయాలను తెలపాలని జిల్లా ఎస్పీలను కోరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని.. విద్రోహ శక్తులతో రహస్య ఒప్పం దాలను కుదుర్చుకోవడానికి ప్రయత్ని స్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ ప్రత్యారోపణకు దిగింది. కోస్తా కర్ణాటక జిల్లాలలో సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా వంటి పార్టీలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ఇలా వ్యవహరిస్తోందని వివరించింది. ఆయా ప్రాంతాలు మతపరంగా సున్నితమైనవని పేర్కొంది. రహస్య అవగాహనలంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని స్పష్టంచేసింది. ప్రజల దృష్టిని మళ్ళించేందుకే ముఖ్యమంత్రి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ప్రత్యారోపణ చేసింది. ఒవైసీతో ఒప్పందం కుదుర్చుకోవడానికి తామేమీ నిస్పృహలో లేమని తెలిపింది. అటువంటి సంస్థలు లేదా పార్టీలతో తాము చర్చలకు కూర్చోలేదన్నారు. ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా తమకు అలాంటి అవసరం రాదని స్పష్టంచేసింది. అసదుద్దీన్ ఒవైసీ కూడా కాంగ్రెస్ ఆరోపణను కొట్టిపారేశారు. కాంగ్రెస్‌కు ఇటు మైనారిటీలూ, అటు హిందువుల మద్దతు లభించకపోవడంతో బలహీనపడిందని హైదరాబాద్‌కు చెందిన ఎమ్ఐఎమ్ సీనియర్ నాయకుడు పేర్కొన్నారు. అందుకే బీజేపీ ఒవైసీకి ఒక రహస్య ప్రతిపాదన చేసిందని తెలిపారు. కోస్తా కర్ణాటకలో సాయం కోరిందని చెప్పారు. దీనివల్ల కాంగ్రెస్ అనుకూల ముస్లిములు తమకు ఓటేసేలా చేయాలనేది ఆ ప్రతిపాదన సారాంశమన్నారు. మంచి ముస్లిములు, చెడ్డ ముస్లిములు అనే సిద్ధాంతంతో బీజేపీ తమను సంప్రతించిందన్నారు.

ఎన్నికల రంగంలోకి ఎమ్ఐఎమ్ ప్రవేశంతో కాంగ్రెస్ తన వ్యూహాలను మార్చుకుంది. అనుభవజ్ఞులైన, ప్రభావశీలురైన ముస్లిం నేతలను ప్రచారానికి ఉపయోగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇది మైనార్టీ ఓట్లు నష్టపోకుండా చూడగలదని భావిస్తోంది. బీహార్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఇదే తరహా వ్యూహాన్ని అనుసరించింది. మహారాష్ట్రలోని నాందేడ్-వాఘలా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలోనూ ఇదే వైఖరిని పాటించింది. బీహార్‌లో కాంగ్రెస్ మహాఘటబంధన్‌లో జేడీ(యు), ఆర్జేడీలతో కలిసి పనిచేసింది. తనకు కేటాయించిన 40 అసెంబ్లీ స్థానాల్లో 27 స్థానాలను గెలవగలిగింది. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలోనూ 81 వార్డులకు, 73 గెలుచుకుంది.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరి ఎమ్ఐఎమ్ ఓట్లను చీల్చింది. ఇదే అభ్యాసాన్ని కాంగ్రెస్ కర్ణాటక ఎన్నికల్లో సైతం పాటిస్తుందనడంలో సందేహం లేదు. ఓట్లను చీల్చే ఎటువంటి పనులకు పాల్పడవద్దని కాంగ్రెస్ అధినాయకత్వం రాష్ట్ర క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఒవైసీకీ కర్ణాటకకూ ఎటువంటి సంబంధం లేదని ప్రచారం చేసే అవకాశముంది. నష్టపోయే ముస్లిం ఓట్లను పరాడ్డుకోవడానికి కన్నడను అభిమానించే కార్యకర్తలనూ, బృందాలనూ ప్రోత్సహించాలని నిర్ణయిం చుకుంది. బీజేపీని కన్నడ వ్యతిరేక, కర్ణాటక వ్యతిరేక శక్తిగా ఆరోపిస్తోంది. కర్ణాటకకు మహయాది నదీ నీటిని విడుదల చేయని గోవా వైఖరిని కాంగ్రెస్ సాకుగా తీసుకుని, మధి స్తోంది. గోవాలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వమున్న సంగతి తెలిసిందే. కర్ణాటకలోని కరవు పీడిత ప్రాంతాలకు గోవా ప్రభుత్వం నీటిని ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నిస్తోంది. కన్నడ వ్యతిరేక వైఖరికి ఇది నిదర్శనం కాదా అని కాంగ్రెస్ బీజేపీని నిలదీస్తోంది.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ఇటీవలే పింక్ ఆటోల పథకాన్ని ప్రవేశపెట్టింది. వీటిని మహిళలే తోలుతారు. సబర్బన్ రైలు సర్వీసులు, రోడ్లు వంటి హామీలను గుప్పిస్తున్నారు. ఫలవంతమైతే మంచిదే. కాకపోతే ఎమ్ఐఎమ్ కాంగ్రెస్ ఓట్లను చీలుస్తుంది. అది బీజేపీకి ప్రయోజనకారి. బీజేపీకి అనుకూల వైఖరిని అనుసరిస్తున్న జేడీ(ఎస్) ఎటూ ఉండనే ఉంది. పార్టీ అధ్యక్షుడు దేవెగౌడ తన పార్టీ కార్యకర్తలను ఈ విషయాన్ని ఇప్పటికే స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసి, చేతులు కాల్చుకుంది. బీజేపీతో కలవడానికి తనకేమీ ఇబ్బంది లేదని దేవెగౌడ చెప్పారనేదే సారాంశం. సొంత రాష్ట్రంలోనే అధికారంలోకి రాలేకపోవడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో కర్ణాటక ముక్కోణ పు పోటీకి సిద్ధమవుతోంది. కాంగ్రెస్, బీజేపీ, ఎమ్ఐఎమ్ మధ్యే ఈసారి ప్రధానపోటీ ఉంటుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఫలించిన సుష్మాదౌత్యం

మత, సంస్కృతీ సంప్రదాయాల పరంగా నేపాల్‌తో భారత్‌కి శతాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. నేపాల్ రాజు త్రిభువన్ హయాంలో రెండు దేశాల మధ్య ఏర్పడిన వాణిజ్య సంబంధాలు రాజు బీరేంద్ర హయాంలో బాగా వృద్ధి చెందాయి. నేపాల్‌కి అవసరమైన చమురు, నిత్యావసరాలను మొదటి నుంచి భారత్ సరఫరా చేస్తోంది. వాణిజ్య సంబంధాలే ఇరుదేశాల మధ్య బంధాన్ని పటిష్టం చేశాయి. రాజకుటుంబాల మధ్య కూడా వైవాహిక సంబంధాల వల్ల నేపాల్ మనకు మరింత సన్నిహితమైంది. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్య తల్లి, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా భార్య నేపాల్ రాజవంశీయురాలే. నేపాల్‌లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా దీర్ఘ కాలం సాగిన మావోయిస్టుల పోరాటానికి నేతృత్వం వహించిన పుష్పకమల్ దహాల్ అలియాస్ ప్రచండ ప్రజాస్వామ్య వ్యవస్థ అవతరించిన తర్వాత ప్రధానమంత్రి అయ్యారు. నేపాల్‌లో మావోయిస్టులు అజ్ఞాతంలో ఉండి ఆందోళన సాగిస్తున్న సమయంలో ఖాట్మండూ నుంచి బీర్ గంజ్ మీదుగా బీహార్‌లో ప్రవేశించి నలంద, సివాన్ జిల్లాల్లో పట్టు సాధించారు. తర్వాత జార్ఖండ్, చత్తీస్ గఢ్ మీదుగా తెలంగాణకు తమ కార్యక లాపాలను విస్తరింపజేశారు. వారిని ఎదుర్కొనడం అప్పట్లో కష్టసాధ్యమయ్యేది. నేపాల్‌లో మావోయిస్టులు రాజ్యాధికారాన్ని చేపట్టిన తర్వాత మావోయిస్టుల కారిడార్ కుప్పకూలింది. దానికి తోడు ఒడిషా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్‌లలో ఆపరేషన్ గ్రీన్ హంట్ కారణంగా మావోయిస్టులు చెదిరి పోయారు. నేపాల్‌లో కొత్తగా గెల్చిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కూటమి నాయకుడు ఓలి త్వరలో ప్రధాన మంత్రిగా ప్రమాణం చేయనున్నారు. మావోయిస్టుల ప్రాబల్యం వల్ల ఆయన ప్రభుత్వం చైనాతో సన్నిహిత సంబంధాలను కోరే అవకాశాలు ఉన్నాయి. ఆయన ప్రధానమంత్రి పదవిని చేపట్టగానే చేసిన తొలి ప్రకటనలో భారత్‌తో సత్సంబంధాలే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఆయన విదేశీ పర్యటన చైనాతో ప్రారంభం కావడంతో ఆయన మాట తప్పుతారేమోనని అంతా అనుకున్నారు. ఆయన మాటకు కట్టుబడ్డారు. ఆయన తర్వాత అధికారాన్ని చేపట్టిన ఖడ్గప్రసాద్ శర్మ ఓలి చైనా, భారత్ రెండూ సమానమే అంటూనే చైనా వైపు మొగ్గు చూపారు. ఆయన హయాంలో మాదేశీలు నిరవధిక ఆందోళన సాగించడం, దానిఫలితంగా నిత్యావసర వస్తువులు, చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ఆయనకు తాయిలాలు ఆశ జూపి చైనీస్ నాయకులు తమ వైపునకు తిప్పుకున్నారు. ఆయిల్, నిత్యావసర వస్తువుల సరఫరా యథాతథంగా సాగేందుకు సహకరించిన చైనా నేపాల్‌ని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి బీజాలు వేసింది. ఇరుగు పొరుగు దేశాల నుంచి ఎంత వ్యతిరేకత వచ్చినా, చైనా వన్ బోర్డర్, వన్ రోడ్డు (మహామార్గం) నిర్మాణం విషయంలో అప్రతిహతంగా ముందుకు సాగడానికి ప్రధాన కారణం నేపాల్ మార్గం సుగమం కావడం, ఆక్రమిత కాశ్మీర్‌లో అనధికార నిర్మాణాలకు పాకిస్తాన్ సహకరించడమే ప్రధాన కారణం. ఈ బృహత్ ప్రాజెక్టుపై బీజింగ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సుకు నేపాల్, శ్రీలంక ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రెండు దేశాల్లో మౌలిక రంగ ప్రాజెక్టులకు సాయమందించడం పేరిట వాటి సార్వభౌమాధికారానికి గండికొట్టడానికి చైనా ప్రయత్నిస్తోంది. ఈ విషయాన్ని నేపాల్ ముందుగానే తెలుసుకోగా, శ్రీలంక కళ్ళు తెరిచేసరికి బాగా ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ రెండు రోజుల నేపాల్ పర్యటన విజయవంతం కావడం ఆమె దౌత్య కౌశలానికి నిదర్శనం. ప్రస్తుత ప్రధాని దేవ్‌బా, నేపాల్ అధ్యక్షురాలు బింధ్యాదేవి, ప్రధాని పదవి చేపట్టనున్న ఓలి తదితరులను కలుసుకున్నారు. ప్రస్తుత ప్రధాని దేవ్‌బా, కొత్త ప్రధాని ఖడ్గప్రసాద్ శర్మ వేర్వేరు పార్టీలకు చెందిన వారైనప్పటికీ, భారత్‌తో దౌత్య, వాణిజ్య సంబంధాలను మెరుగు పర్చుకుంటామని ప్రకటించడం గమనార్హం. అంటే నేపాల్‌లో మితవాద, అతివాద పార్టీల ప్రభుత్వాల్లో ఏది అధికారంలో ఉన్నా భారత్‌తో సాన్నిహిత్యం కలిగి ఉంటామని ప్రకటించడం వెనుక నేపాల్ అవసరాల కోసమేనన్న విషయం మరువరాదు. నేపాల్‌లో భారతీయ కంపెనీలు, వాణిజ్య సంస్థల ఎఫ్‌డిఐలు అధిక మొత్తంలో ఉన్నాయి. మరో రెండు బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు భారత్ నుంచి రానున్నాయి. సైద్ధాంతిక, సాంస్కృతిక బంధం కన్నా, వాణిజ్య బంధం చాలా గొప్పదని నేపాల్ రుజువు చేస్తోంది. నేపాల్‌లో రాజ్యాంగ రూపకల్పనలో ఏర్పడిన సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనడంలో భారత్ సహకరించింది. మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి నేతృతంలో వెళ్ళిన ప్రతినిధి వర్గం పరిష్కరించింది. నేపాల్‌కి భారత్ సహజమైన మిత్ర దేశం. చైనా మాత్రం తన అవసరాల కోసం నేపాల్‌ని మిత్రదేశంగా పరిగణిస్తోంది. నిజానికి నేపాల్, శ్రీలంక చైనాతో చేసేది అవకాశవాద మైత్రి. భారత్‌తో మైత్రి దీర్ఘకాలికమైనది. భారత్,నేపాల్ మధ్య దౌత్య సంబంధాల పటిష్టతకు నేపాల్ మాజీ ప్రధాని గిరిజా ప్రసాద్ కొయిరాలా బలమైన పునాదులు వేశారు. ఆయన హయాంలో నేపాల్‌తో పెద్దసమస్యలు ఏమీ ఉండేవి కావు, మతపరంగా చూస్తే నేపాల్ హిందూ రాజ్యం కావడం వల్ల హైందవ క్షేత్రాల సందర్శనకు పర్యాటకులు ఇటూ, అటూ రాకపోకలు సాగించడం వల్ల కూడా ఇరుదేశాల మధ్య బంధం మరింత పటిష్టమైంది. నేపాల్‌లో కొత్త ప్రధాని ఖడ్గప్రసాద్ ఓలి ప్రమాణం చేసిన తర్వాత పరిస్థితుల్లో మార్పులు రావచ్చునన్న ఉద్దేశంతో సుష్మా స్వరాజ్ ముందే ఆ దేశంలో పర్యటించి రావడం భారత విదేశాంగ విధాన దూరదృష్టికి నిదర్శనం. చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయడమే. గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఆసియాన్ దేశాల అధినేతలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం కూడా చైనా దూకుడుకు ముకుతాడు వేయడంలో భాగమే. ఇరుగు పొరుగు దేశాలనూ, ఆసియాన్ దేశాలనూ చైనా నుంచి దూరం చేసేందుకు మోడీ అనుసరించిన వ్యూహం ఫలించినట్టే.

మంచి మాట: సైన్స్‌లో కొత్తవాటికి, సాహిత్యంలో పాత వాటికి ప్రాధాన్యత ఎక్కువ. -గోథే

కమ్యూనిస్టుల కార్యాచరణ?

దేశంలోనూ, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో కమ్యూనిస్టులు ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నో రాజకీయ, సామాజిక ఉద్యమాలు నిర్వహించి, తాడిత, పీడిత, నిరుపేదలు, బాధితులు పక్షాన నిలిచి సిద్ధాంతానికి కట్టుబడి నిబద్ధతతో పనిచేసే కమ్యూనిస్టులు నవ్యాంధ్ర శాసనసభలో స్థానం సంపాదించుకోలేకపోవడం బాధాకరం. దేశ రాజకీయాల్లో ఒకప్పుడు అన్ని అంశాల్లో కీలక పాత్ర పోషించారు. వామ పక్ష ఉద్యమాల వల్లే భూసం స్కరణలు, భూసేకరణ వంటి అతి ముఖ్యమైన చట్టాలు వచ్చాయి. ఎంతో ఉద్యమ చరిత్ర కలిగిన జాతీయ పార్టీలైన కమ్యూనిస్టులు 2014 ఎన్నికల్లో 543 లోక్‌సభ స్థానాలకు కనీసం వంద స్థానాల్లో కూడా పోటీ చేయలేని స్థితి. సీపీఎం 9, సీపీఐ 1 స్థానంలో మాత్రమే గెలవగలిగారంటే దేశంలో వారి స్థానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఉభయ కమ్యూనిస్టులకూ 2 శాతం సీట్లు గానీ. 4 శాతం ఓట్లుగానీ రాలేదు. ప్రజా పోరాటాల్లో, జాతీయ ప్రాధాన్యత గల అంశాల్లో, సిద్ధాం తపరమైన చర్చల్లో ముందుండి సమసమాజ నిర్మాణానికి పాటుపడుతూ కులరహిత సమాజం కోసం ప్రజల్లో చైతన్యం కలిగించే ఉభయ కమ్యూనిస్టులు 1952 సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లో అంతకంతకూ కుచించుకుపోవడానికి కారణాలేంటో ఆలోచించారా? 25 ఏళ్లు ఏకఛత్రాధిపత్యం వహించిన బెంగాల్‌లో ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించారా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 34 స్థానాలు గెలుచుకొని ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నారు? బిజెపిని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించడం, కాంగ్రెస్‌ను ఓడించి బిజెపిని గెలిపించడమే వామ పక్ష విధానంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. వామ పక్షా లు బలపడేదెప్పుడు? ఆ ఆలోచనలు ఏమైనా చేస్తున్నారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

కొంతమంది కమ్యూనిస్టుల విభజన జరగకపోతే దేశంలో కమ్యూనిజం బలంగా ఉండేదని వాదిస్తుంటే, మరి కొందరు ఆనాడు కమ్యూనిస్టుల విభజన జరగకపోతే దేశంలో ఈరోజు కమ్యూనిజమే ఉండేది కాదని వాదిస్తున్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా ఫలితాలు సాధించవచ్చన్న విషయం వీరికి తెలియంది కాదు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అంటారు. వీరు మాత్రం ఏకంకారు. పారిశ్రామిక విప్లవంతో బలపడిన కమ్యూనిస్టులు, కంప్యూటర్ విప్లవంతో బలహీనపడ్డారు. దానికి తోడు విభేదాలతో కొన్ని ప్రాంతాల్లో ఉనికిని కోల్పో యారు. ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు, కార్పోరేట్ శక్తులు బలపడటంతో వారి పంథాను కూడా మార్చుకో వలసిన అవసరం ఏర్పడింది. చట్టసభలలో గానీ, బయట గానీ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని, నిలదీస్తారని, విధాన పరమైన అంశాలను శాస్త్రీయంగా చర్చిస్తారని పేరుండేది. విషయ పరిజ్ఞానం, వాదనాపటిమ గల నేతలుండేవారు. ఎవరి పొత్తుతో గెలిచినా ఎక్కువ సందర్భాలలో వారి సిద్ధాంతాలకు కట్టుబడే నిలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకొని ఉభయ కమ్యూనిస్టులు 34 శాసనసభా స్థానాలు గెలుచుకున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాల్లో పెందుర్తి, చింతపల్లి, ఆచంట, పెనుగొండ, విజయవాడ పశ్చిమ, నిడుమోలు, మంగళగిరి, తాడికొండ, సత్తెనపల్లి, సంతనూతలపాడు, ఆలూరు, అనంతపురం, కర్నూలు మొత్తం 13 స్థానాల్లో విజయం సాధించారు. సీపీఐ 6 స్థానాలను, సీపీఎం 7 స్థానాలను గెలుచుకున్నాయి. అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ఆహ్వానించినా తిరస్కరించిన చరిత్ర వారిది. నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం. అధికార పక్షానికి మిత్రులుగా ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలిచి పోరాడారు. ఉనికి చాటుకోవడానికి, శాసనసభ స్థానాలు సంపాదించు కోవడానికి అది ఉపయోగపడుతుంది. పొత్తు పెట్టుకున్నంత మాత్రాన సిద్ధాంతాలను వదులుకోవలసిన, ఆలోచనలను చంపుకోవలసిన అవసరంలేదు. గతంలో టీడీపీతో పొత్తే అందుకు నిదర్శనం. చట్టసభలలో తమ వాణి వినిపించడానికి అవకాశం ఏర్పడుతుంది. అసలులేని దానికంటే కొంతలో కొంత అది మేలేకదా అన్నది మరికొందరి వాదన. నవ్యాంధ్రలో కమ్యునిస్టులు లేని శాసనసభ ఏర్పడటం చాలా మందికి బాధ కలిగించింది. ఉభయ కమ్యూనిస్టులు లేని సభలు ఎలా జరుగుతున్నాయో అందరూ చూస్తూనే ఉన్నారు. వాళ్లు లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అనేకమంది అంటున్నారు.



ప్రజలలో పట్టు సంపాదించారు. ఆ పార్టీలలో, నాయకులలో పోరాట పటిమ తగ్గడం, రాజకీయ, ఆర్థిక, సామాజిక తదితర అంశాల్లో, ప్రజల ఆలోచనా విధానంలో మార్పులు రావడం, కులంపునాదులు గట్టిపడటం లాంటి కారణాల వల్ల కాలక్రమంలో రాష్ట్రంలోని కమ్యూనిస్టు కంచుకోటలన్నీ బద్దలయ్యాయి. కులం ప్రభావం ఈ పార్టీలపైన కూడా బలీయంగా పడిం దిన్న విమర్శలు వినవస్తున్నాయి. ఆ జాడ్యాన్ని వదిలించుకొని దళితులను, బలహీనవర్గాల వారిని రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించవలసిన అవసరం ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం విడిపోవాలని సీపీఐ, కలసి ఉండాలని సీపీఎం స్పష్టంగా చెప్పినా ఏపీలో సీపీఎం కూడా ఒక్క స్థానం గెలుచులేకపోవడం విచిత్రమైన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏదైనా బలమైన జాతీయ లేదా ప్రాంతీయ పార్టీలతో పొత్తుపెట్టుకొని చట్ట సభలలో స్థానం సంపాదించడంతోపాటు బలపడటంలో తప్పులేదన్నది కొందరి భావన. రాజకీయాల్లో ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథకాలకంటే వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత పెరిగిపోయిందన్న విమర్శ సర్వత్రా వినవస్తోంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో పట్టుదలకు పోకుండా విభేదాలకు స్వస్తి చెప్పి ఉభయ కమ్యూనిస్టులూ విలీనం లేక పొత్తు ద్వారా నైనా ఐక్యతను చాటిచెప్పవలసిన అవసరం ఏర్పడింది. రాష్ట్రాలలో అధికారం చేపట్టినా, ఈ దేశంలో జాతీయ స్థాయి లో కమ్యునిస్టులు రాజ్యాధికారం చేపట్టడం సాధ్యం కాదు. అయినా బాధ్యత గల ప్రతిపక్షం పాత్ర పోషించవలసిన అవసరం మాత్రం ఉంది. రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం కృషి చేసే ఉభయకమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలిచి చట్టసభలలో తమ ఉనికిని చాటుకోవడానికి పొత్తు లేక ఐక్యత గురించి ఆలోచించవలసిన అవసరం మాత్రం ఉంది.

-ఎస్.భరత్, జర్నలిస్ట్. 8520920446

చరిత్రలో ఈరోజు

1935: టర్కీ ఎన్నికల్లో మొదటిసారి మహిళలకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

1937 : జపాన్‌లో తొలి జపనీస్-యూఎస్ మహిళా లాయర్‌గా కె. ఎలిజబెత్.

1948 : రేడియో కంట్రోల్‌తో మొదటి విమానం ప్రయాణం.

1979 : పాకిస్థాన్ ప్రధాన మంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోకు ఉరి శిక్ష ఖరారు చేసిన లాహోర్ సుప్రీం కోర్టు.

పాఠకీయం

విద్యారంగం చులకన అయింది!

ఈ చదువులు వానాకాలం చదువులు, పెద్దల సూక్తి అక్షర సత్యం అయింది. చదువుల పట్ల వెనకటి ఆత్మవిశ్వాసం పరీక్షలు ఓ గురుతరభావం లేదు! నిజాయితీగా కష్టపడి చదివి వందమందిలో ఇద్దరు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేవారు! కాని ఇప్పుడు 99 మంది ఉత్తమ శ్రేణిలో ఫలితాలు రావడం గమనార్హం! దీనిని బట్టి చూస్తే మార్కులు రావడం వక్రలేమి పాటించటం వలన జరుగుతోందని అభిప్రాయం! ఏది ఏమైనా సర్టిఫికెట్ ఏవిధంగా నైనా పొంది పునాది లేని చదువుకు నేటి విద్యావిధానం పెద్దపీట వేస్తోంది.

-కోవూరు వెంకటేశ్వర ప్రసాదరావు
కందుకూరు, ప్రకాశం జిల్లా

మద్యం మత్తులో ప్రమాదాలు

మద్యం మత్తులో ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్నాయే కానీ తగ్గడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నా ఫలితం శూన్యం. గత సంవత్సరం పెద్ద అంబర్‌పేట వద్ద, ఈసారి జూబ్లీహిల్స్ వద్ద మద్యం మత్తులో కారు నడిపి మహిళల ప్రాణాలు తీశారు. అయితే ప్రమాదం జరిగిన కొత్తలో అధికారులు అప్రమత్తమై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ముమ్మరం చేయడం, కాలక్రమేణా అవి తగ్గించడం మామూలైంది. పల్లె, పట్నం అంతటా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలి. పట్టుబడ్డ వారి డ్రైవింగ్ లైసెన్సును శాశ్వతంగా నిషేధించాలి. సినిమాల లోను, టివి సీరియళ్ళలోను మద్యం సేవించే సన్నివేశాలను తొలగించాలి.

-సిరికొండ శ్రీనివాసరావు, వనస్థలిపురం

కవిత్వ పాండిత్యాల కలయిక భూమయ్య

ఆయన కవి. మామూలు కవి కాదు. ప్రయోగాలు చేసిన కవి. ఆ ప్రయోగాలు కూడా ఏవో టక్కుటమారాలు కావు. రసవంత కవితా ప్రయోగాలు. పౌరాణిక పాత్రల ఆంతరంగిక అనుభూతుల, వ్యథల మథనాలు చేసి మరీ కావ్యాలు రాశారు. ఆయన జ్వలిత కౌసల్య, త్రిజట, ప్రవర నిర్వేదం కావ్యాలు దేనికవే స్వయం ప్రకాశకాలు. ప్రాచీన ఆలంకారికులు - వస్తు, ధ్వని, రసాలకు ఏ విధమైన ప్రాధాన్యాలు ఇవ్వాలన్నారో వాటికి అనుగుణ రచనలు చేసిన విద్వత్కవి. తెలుగు సాహితీ విమర్శలో భూమయ్య మార్గం అనేది విమర్శకులు ఆమోదం తెలిపిన మార్గం అంటూ ఒకటి వుంది. శిష్యుల ఔన్నత్యాలు చూసిన కళ్ళ వెలుగులు తనలో ప్రతిఫలించిన వ్యక్తిత్వం ఆయనది. విశ్వనాథ వారే మెచ్చిన రసజ్ఞత ఆయనది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒక స్వయం ప్రకాశక పద్య నిర్మాణ శైలిగల విశిష్టకవి. కాకతీయ తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా - తాను గ్రహించిన కావ్యాల మర్మాలూ, లోతులు తన విద్యార్థులకు ఇష్టపూర్వకంగా పంచిన పండితులు. ఆంధ్రప్రదేశ్ పాఠ్య నిర్ణాయక సంఘ అధ్యక్షునిగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి కులపతిగా - ఇలా మరికొన్ని పదవులకు ఆయన వన్నె తెచ్చారు. ఆయన కలుపుగోలుతనం ధనవంతుడు. అజో విభో వారి నెలనెలా నందివర్ధన సమ్మానితుడాయన. ఆయన రచనల లిస్టులో నేను ది బెస్టు, నేను ది బెస్టని ఎన్నో ముందుకు వస్తూంటాయి. ఇటీవల రెండు రాష్ట్రాలు కోల్పోయిన నిండుతనం గల గొప్ప కవి సి.నా.రె. పై ఆయన జీవిత కవిత్వాలను స్మరిస్తూ రాసిన కావ్యం ఎనలేని పేరు తీసుకువస్తోంది. మధునాపంతుల వారి ఆంధ్ర పురాణంపై వారు రాసిన విమర్శ గ్రంథం కాని, నాయని సుబ్బారావు కృతులపై ఆయన రాసిన విమర్శ గ్రంథాలు కాని లోతులు గ్రహిస్తూ మనం చదివితే, ఆ కవుల లోతులతో పాటు ఈయన ఆలోచనల లోతులూ మనకు ఆకళింపు అవుతాయి. ఎన్ని పార్శ్వాల నుండి పరిశోధనలు చేసినా, ఇంకా విశేషాలు శేషంగా మిగిలేవి వుండే మహాకవి పాల్కురికి సోమనాథుడిపై ఇటీవల వచ్చిన ఈయన గ్రంథం ఈ భూమయ్య కీర్తి కిరీటంలో ఒక కలికితురాయిగా చెప్పవచ్చు. ప్రాచీన సాహిత్యంలో మేరు శిఖరాలను దర్శించుకుంటూ నిత్యం సరస్వతీ ఆలయాన రచనల ధూపదీప నైవేద్యాలతో పలుకుతల్లిని పూజించుకునే ఈయనకు నోరి నరసింహశాస్త్రి పురస్కారం రావడం అన్ని విధాలా తగినది. చారిత్రక నవలల చలన చిత్రాల్ని చూపించి ప్రాచీన కల స్వర్ణకాంతుల్ని మనకు చూపిన ఒక కాలపు వెలుగు, పండిత పండితుడు, పత్రికా రచయిత, విమర్శకుడు కొండొకచో దూకుడు సినిమా చూపించే విమర్శకుడు వ్యాస భారతీయుడు బహుగ్రంథకర్త నోరి నరసింహశాస్త్రి పురస్కారాన్ని శ్రీ భూమయ్య అందుకోనుండడం ఆనందకరం. నేను ఉపనిషన్మార్గ కవివి అని సవినయంగా ప్రకటించుకున్న అనుమాండ్ల భూమయ్య - ఆధ్యాత్మిక భావప్రణీతుడు, ధార్మిక మార్గ రచయిత నోరి వారి పురస్కారానికి అర్హులు అక్షరాలా - అక్షర కావ్య రచనల ద్వారా.

అపరోక్షాను భూతి పేరిట శంకర భావ పరంపరలను ప్రజలకు అందే గేయ మార్గంలో - గేయామృత స్రవంతిగా అందించిన అనుమాండ్ల అభినందనీయులు. అన్నిటిని ఆత్మగా అరయ గలిగిన యంత/ అణుమాత్ర మితరులను అన్యులుగా కనలేడు అదే శంకర ప్రవచన కవితా వాక్యాలు భూమయ్య మార్గవాక్యాలు కూడా. ఇది అనుమాండ్ల వారికి పురస్కార స్వాగతకాలం కావాలని ఆశిద్దాం.

-సన్నిధానం నరసింహ శర్మ
9292055531



(విద్వత్కవి అనుమాండ్ల భూమయ్యకు ఫిబ్రవరి 6న నోరి నరసింహ శాస్త్రి పురస్కారం ప్రదాన సందర్భంగా)

ఐదు జైళ్లు మూత



- తెలంగాణ జైళ్లశాఖ నిర్ణయం
- ఖైదీల సంఖ్య తగ్గడమే కారణం
- ఫలితాలిస్తున్న సంస్కరణలు : డీజీ వీకే సింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖైదీల సంఖ్య తగ్గడంతో రాష్ట్రంలోని అయిదు జైళ్ళను మూసి వేయాలని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ నిర్ణయం తీసుకుంది. నేరాల సంఖ్య తగ్గడంతో జైలుకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందని కొంత కాలంగా చెబుతున్న జైళ్ళ శాఖ అధికారులు నిర్వహణ ఖర్చును తగ్గించుకునేందుకు ఖైదీలు అతి తక్కువగా ఉన్న జైళ్ళను మూసి వేయాలన్న నిర్ణయానికి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం జైళ్ళ శాఖ ఆధ్వర్యంలో 35 జైళ్ళున్నాయి. ఇందులో అయిదు జైళ్ళను తక్షణం మూసివేస్తున్నట్లు ఆ శాఖ డిజి వికె సింగ్ తెలిపారు. పూర్వపు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్, వరంగల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల, ఖమ్మం జిల్లాలోని మధిర సబ్ జైళ్ళను మూసి వేస్తున్నట్లు డిజి పేర్కొన్నారు. ఆర్మూర్ సబ్ జైల్‌లో 10 మంది ఖైదీలుండేందుకు వసతి సౌకర్యాలున్నాయి. కానీ ఈ జైలులో కేవలం ఇద్దరు ఖైదీలు మాత్రమే ఉన్నారు. అదే విధంగా బోధన్ సబ్ జైలులో 17 మందికి వసతి సౌకర్యాలుంటే ఇద్దరున్నారు. నర్సంపేట సబ్‌జైలులో 30 మందికి గానూ కేవలం ఏడుగురు, పరకాల సబ్‌జైలులో 30 మందికి గానూ ఇద్దరు, మధిర సబ్ జైలులో 20 మందికి గానూ 10 మంది ఖైదీలున్నారని డిజి పేర్కొన్నారు. నిర్ణీత సంఖ్య కంటే ఖైదీల సంఖ్య తగ్గినప్పటికీ నిర్వహణ వ్యయం తగ్గించేందుకు వీలు లేకపోవడంతో అధికారులు మూసివేత నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మూసివేతకు గురైన జైళ్ళతో పాటు మరికొన్ని జైళ్ళలో ఖైదీల సంఖ్య తగ్గిందని, ఇందులో మరో మూడు జైళ్ళను ఈ ఏడాది చివరిలోగా షట్‌డౌన్ చేయనున్నామని అధికారులు పేర్కొన్నారు. జైళ్ళలో ఖైదీల సంఖ్య తగ్గేందుకు కారణం గడచిన మూడేళ్ళుగా తాము జైళ్ళ శాఖలో చేపట్టిన సంస్కరణలే కారణమని అంటున్నారు. నేర రహిత తెలంగాణ కోసం గడచిన మూడేళ్ళుగా జైళ్ళ శాఖలో పలు సంస్కరణలను చేపట్టామని, జైలుకు వచ్చిన వారిలో మార్పు కోసం పలు కార్యక్రమాలను నిర్వహించడం వల్లే ఖైదీల సంఖ్య తగ్గి అయిదు జైళ్ళను మూసి వేసేందుకు మార్గం సుగమమైందని అధికారులు చెబుతున్నారు. తాము చేపట్టిన కార్యక్రమాల వల్ల గడచిన మూడేళ్ళుగా జైలుకు వచ్చే ఖైదీల సంఖ్య తగ్గుతోందని, రాష్ట్రంలో ఉన్న జైళ్ళలో 6,848 ఖైదీలు ఉండేందుకు సౌకర్యాలుండగా, ఈ ఏడాది జనవరి 27 నాటికల్లా 5,348 మంది ఖైదీలున్నారని, ఇందులో 4953 మంది పురుషులు, 395 మంది మహిళలున్నారన్నారు. మూడేళ్ళ క్రితం ఈ సంఖ్య 6,012 మంది ఉన్నారని, ఇందులో పురుష ఖైదీలు 5567, మహిళా ఖైదీలు 445 మంది అని డిజి గణాంకాలను తెలిపారు. వచ్చే ఐదేళ్ళలో 50 శాతం నేరాలను తగ్గించాలన్న టార్గెట్‌ను పెట్టుకున్నామని, ఇందుకోసం ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, బహుళజాతి కంపెనీల సహకారంతో ముందుకు వెళ్తామని, ఏటా 10 శాతం నేరాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం జైళ్ళతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. నేరాలను తగ్గించేందుకు మాజీ ఖైదీలకు, ఒంటరి మహిళలకు, అనాధలకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నామన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 100 పెట్రోల్ బంక్‌లను నెలకొల్పుతున్నామని తెలిపారు. ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాల కోసం దాదాపు వేయి అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ ఏడాదిలోనే మూడు వేల మందికి ఉపాధి కల్పించబోతున్నట్లు వెల్లడించారు.

అద్దెకు జైళ్లు

నేరాల సంఖ్య తగ్గడంతో జైలుకు వచ్చే ఖైదీల సంఖ్య తగ్గుముఖం పట్టినందున రాష్ట్రంలోని జైళ్ళను ఇతర రాష్ట్రా లకు అద్దెకు ఇచ్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వానికి పంపించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రా లలోని జైళ్ళలో పరిమితికి మించి ఖైదీలు ఉంటున్నారు. ఫలితంగా కొన్ని సందర్భాలలో ఆ రాష్ట్రా ల జైళ్ళ శాఖ అధికారులు సిబ్బంది ఇబ్బందులకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. కోర్టులలో నేరం రుజువై జీవిత ఖైదీ, దీర్ఘకాల జైలు శిక్షలకు గురైన వారిని తెలంగాణ రాష్ట్ర జైళ్ళలో ఉంచేందుకు వీలు కలుగుతుంది. జైళ్ళను అద్దెకిచ్చే ప్రతిపాదనలను సిద్ధం చేసిన తెలంగాణ జైళ్ళ శాఖ ప్రభుత్వానికి సమర్పించింది. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉందని డిజి వికె సింగ్ చెప్పారు.

ఆర్టీసీ ఎండీ రమణారావుకు స్ఫూర్తి పురస్కారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావును సేవ్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు స్ఫూర్తి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అతి తక్కువ ప్రమాదాల రేటు సాధించడం, ఇంధన పొదుపు, వాహన కాలుష్య నివారణ, బయో డీజిల్ వాడకం, సీఎన్‌జీని వినియోగంలోకి తేవడం లాంటి చర్యలకు గాను సేవ్‌లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు రమణారావుకు స్ఫూర్తి పురస్కారం ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. శ్రీధర్, సలహాదారు కె. విజయ్ తదితరులు పాల్గొన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ మారుపేరుగా గుర్తిం చబడిందని శ్రీధర్ అన్నారు. ప్రమా దాలను తగ్గించడానికి తీసుకున్న చర్యలు అభినందనీయం అని కొని యాడారు.

ఇంధన పొదుపు సాధిం చడంలో జాతీయ స్థాయిలో ఆర్టీసీ అగ్రగామిగా ఉందన్నారు. వాహన కాలుష్యం నివారిం చడానికి బయోడీజిల్‌ను విని యోగంలోకి తేవడంలో కూడా ఆర్టీసీ ఇతర రవాణా సంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. తనకు ప్రధానం చేసిన స్ఫూర్తి పురస్కారం కార్మికులు, సిబ్బందికి చెందు తుం దని రమణారావు పేర్కొ న్నారు. అందరి కృషి ఫలితంగానే ఆర్టీసీ జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంటుం దన్నారు.

9న ఆర్థిక సంఘం రాక

- దక్షిణాది రాష్ట్రాలతో సమావేశం
- 10న కాళేశ్వరం సందర్శన

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఈ నెల 9 న 15 వ ఆర్థిక సంఘం హైదరాబాద్ రానుంది. మూడు రోజుల పాటు 11 వరకు సంఘం ఇక్కడే బస చేస్తుంది. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రా ల ఆర్థిక , ప్రణాళిక శాఖాధికారులతో బృందం భేటీ కానుంది. ఆర్థిక సంఘం ఛైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నంద కిషోర్ సింగ్ (ఎన్‌కె సింగ్)సభ్యులు శక్తికాంతదాస్, అనూప్‌సింగ్, రమేష్‌చంద్, అశోక్‌లాహిరీ బృందం అధికారులు,అనధికారులతో చర్చలు జరిపి, క్షేత్ర స్థాయి పరిస్థితులను కూడా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ సంఘం చేసే సిఫార్సులు 2020 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయి. ఆర్థిక సంఘం ఏర్పాటైన తర్వాత తొలి సమావేశం 2017 డిసెంబర్ 4 న ఢిల్లీలో జరిగింది. తదుపరి రెండో సమావేశానికి వేదికగా హైదరాబాద్‌ను ఎంచుకోవడం విశేషం. తమ పర్యటనలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్రా లకు చెందిన అధికారులతో సమావేశమవుతారు. 10 న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తారు.ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించిన నేపథ్యంలో ఆర్థిక సంఘం బృందం కాళేశ్వరం పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రా లకు వస్తున్న రాబడులు, వ్యయాలు, ఆర్థిక స్థిరత్వం,నిధుల వినియోగం, కేంద్రం పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజితపథకాల అమలు, నిధుల విడుదల, గ్రాంట్ ఇన్ ఎయిడ్ తదితర అంశాలను బృందం చర్చిస్తుంది. రాష్ట్ర అవసరాలను సంఘం దృష్టికి తెచ్చేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషీ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ ఇతర అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానంగా మిషన్ భగీరత, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరంకు జాతీయ హోదా ఇతర అంశాలను గూర్చి సంఘానికి వివరించేందుకు అధి కారులు ప్రయత్నిస్తున్నారు. వెనుకబడిన జిల్లాలను గుర్తించాలని కూడా ప్రభుత్వం వివరించనుంది. 2018 -19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వార్షిక బడ్జెట్‌లో దాదాపు రూ. 40,000 కోట్ల ప్రతిపాదనలను కేంద్రానికి పంపిం చినప్పటికీ నిధుల కేటాయింపు వల్ల జరిగే అన్యాయాన్ని కూడా ప్రభు త్వం నివేదించనుంది. మిషన్ భగీరథకు రూ. 19,205 కోట్లు, మిషన కాకతీయకు రూ. 5000 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

బీఎస్ఎన్ఎల్ టవర్ పేల్చివేత
సరిహద్దుల్లో చెలరేగిన మావోయిస్టులు



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : వరుస సంఘటనలతో మావోయిస్టులు చెలరేగారు.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో విధ్వంసాలకు పాల్పడ్డారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణిచివేతకు వ్యతిరేకంగా సోమవారం దండకారణ్యంలో మావోయిస్టుల పిలుపు మేరకు బంద్ పాటించారు.. భూపాలపల్లి జయశంకర్ జిల్లా, వెంకటాపురం మండలం ఎదిర గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను మందు పాతరలతో పేల్చివేశారు. రెండు రోజులుగా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కొండగావ్, దంతెవాడ తదితర జిల్లాల్లో వాహనాలకు తగులబెట్టి రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికి వేసి అలజడి సృష్టించారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల భయం గుప్పిట్లో బిక్కుబిక్కు మంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సోమవారం మావోయిస్టులు బంద్ కు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో కరపత్రాలు విడుదలైన విషయం తెలిసిందే.

ఆసుపత్రి నుంచి బాలకృష్ణ డిశ్చార్జి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ నటుడు, తెలు గుదెశంపార్టీ శాసనసభ్యుడు నంద మూరి బాలకృష్ణ కుడి భుజానికి శస్త్ర చికిత్స విజయవంతమైంది. హైద రాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ దీప్తిన్ నందన్‌రెడ్డి, డాక్టర్ ఆశీష్ బాబుల్కార్ నేతృత్వంలోని వైద్యబృందం బాలకృష్ణకు శస్త్ర చికిత్స నిర్వహించారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన సర్జరీ విజయవంతమైందని, ఆరు వారాలపాటు విశ్రాంతి తీసు కోవాలని వైద్యులు సూచించారు. గౌతమీపుత్ర శాతకర్ణి సినిమా షూటింగ్ సందర్భంగా బాలకృష్ణ గాయపడడంతో శస్త్ర చికిత్స నిర్వహించి డిశ్చార్జి చేశారు.

రైల్వే ప్రాజెక్టులకు రూ. 1850 కోట్లు?
నేడు విడుదల కానున్న పింక్ బుక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే తెలంగాణ ప్రాంతంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి 2018 -19 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 1850 కోట్ల వరకు కేటాయించినట్లు తెలిసింది. తెలంగాణలోని వివిధ ప్రాజెక్టులకు గత సంవత్సరం రూ. 1729 కోట్లు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 121 కోట్లు అదనంగా కేటాయించినట్టు తెలిసింది. కేటాయింపులకు సంబంధించి పింక్ బుక్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మంగళవారం విడుదల చేసే అవకాశం ఉంది. ఇందులో ప్రాజెక్టుల వారిగా కేటాయింపులను పొందుపర్చడం జరుగుతుంది. గత సంవత్సరానికంటే కూడా అదనపు నిధులను దక్షిణ మధ్య రైల్వే ఆశించింది. ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలు, రైల్వే అధికారుల నివేదికలను పరిశీలించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రాజెక్టుల కంటే కూడా పనులు కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసి వినియోగంలోకి తేవడానికే అత్యంత ప్రాధాన్యతను ఇచ్చినట్టుగా తెలిసింది. గత సంవత్సరం తెలుగు రాష్ట్రాలకు సుమారు 20 కొత్త ప్రాజెక్టులను ప్రకటించారు. వాటిని అమలు జరపడానికి దశల వారిగా నిధులు మంజూరు చేశారు. కొన్ని ప్రాజెక్టులకు రాష్ట్రాల వాటా అందకపోయినప్పటికీ రైల్వే కేటాయింపులతోనే పనులు కొనసాగించారు. ఎంఎంటిఎస్‌కు తెలంగాణ ప్రభుత్వం తన వాటా మొత్తాన్ని విడుదల చేయనప్పటికీ పనులు ఆగలేదని తెలిసింది. గత సంవత్సరం ప్రతిపాదిత ప్రాజెక్టుల్లో అత్యధిక ప్రాజెక్టుల పనులను ప్రారంభించారు. వాటి కొనసాగింపు ప్రధానం అని కేంద్రం భావించింది. రాజకీయ వత్తిడితో ప్రాజెక్టులను ప్రకటించడం కంటే కూడా ప్రజా అవసరాలు, సరకు రవాణా ప్రాధాన్యత, నిర్వహణలో నష్టదాయకం కాని ప్రాజెక్టులపైననే రైల్వే అధికారులు దృష్టి కేంద్రీకరించినట్టు తెలిసింది. 2017 -18 ఆర్థికసంవత్సరంలో మంజూరు చేసిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి 2018 -19 బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిట్లు తెలిసింది. మునీరాబాద్ - మహబూబ్‌నగర్, మనోహరాబాద్ - కొత్తపల్లి, నడికుడి - శ్రీకాళహస్తి, కోటిపల్లి - నర్సాపూర్, అక్కన్నపేట - మెదక్, భద్రాచలం - సత్తుపల్లి, ముద్ఖేడ్ - ప్రభాణీ ట్రాక్ డబ్లింగ్, గుంటూరు - గుంతకల్ ట్రాక్ డబ్లింగ్, గుంతకల్ - కల్లూరు డబ్లింగ్, గుంటూరు - తెనాలి డబ్లింగ్, సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ ట్రాక్ డబ్లింగ్, విజయవాడ - భీమవరం - నిడదవోలు ట్రాక్ డబ్లింగ్, గుత్తీ - ధర్మవరం ట్రాక్ డబ్లింగ్, ఖాజీపేట - బల్లార్షా మూడవ లైన్, కాజీపేట - విజయవాడ మూడవ లైన్, మాచర్ల - పెద్దంపల్లి మూడవ లైన్, ఘట్‌కేసార్ - యాదాద్రి ఎంఎంటిఎస్ పొడిగింపు, చర్లపల్లి టర్మినల్ తదితర పనులను మరింత వేగంగా కొనసాగించడానికి, కొన్ని పనులను పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్టు తెలిసింది. కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్రం పరిశీలనలోకి తీసుకోలేదని, గత సంవత్సరం ప్రకటించిన కొత్తలైన్లసర్వే, ఉన్న మార్గాల డబ్లింగ్, విద్యుదీకరణ, రైలు మార్గాల పొడిగింపు పైననే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టుగా ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికుల సౌక ర్యాలను మెరుగుపర్చడం, ప్రజా రవాణాతో పాటుగా సరకు రవాణాను పెంచేందుకు దోహదపడే విధంగా నిధులు సమకూర్చినట్టుగా తెలిసింది.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

వడ్డీరేట్లలో మార్పు ఉండదు

న్యూఢిల్లీ : పెరుగుతున్న ముడి చమురు ధరలతో పాటు ద్రవ్యోల్బణం క్రమంగా పైపైకి ఎగబాకుతుండటంతో బుధవారం నాడు జరిగే రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లలో కొత ఉండకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరుగు రుసభ్యుల ఆర్‌బీఐ మానిటరీ కమిటి ఈ నెల 6,7 తేదీల్లో సమావేశం కానుంది. అయితే బుధవారం నాడు వడ్డీరేట్ల విష యం వెల్లడవుతుంది. డిసెంబర్‌లో జరిగిన పరపతి సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్ల పెంపుజోలికిపోలేదు. ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం 6.7 శాతంగా నమోదవుతుందన్న అంచనాతో వడ్డీరేట్లను పెంచలేదు. చివరగా ఆగస్టులో రెపోరేటును 0.25 శాతం తగ్గించి వడ్డీరేటును ఆరు శాతానికి సవరించింది. బ్యాంకింగ్ నిపుణులు మాత్రం వరుసగా మూడోసారి ఆర్‌బీఐ వడ్డీరేట్ల పెంపు జోలికి పోదని భావిస్తున్నారు. ఈ ఆర్థికసంవత్సరం రెండవ సగభాగం నుంచి వృద్ధిరేటు పుంజుకోవడంతో, వృద్ధిరేటుపుంజుకోవడానికి ఆర్ బీఐ వడ్డీరేట్లు తగ్గిస్తుందని నిపుణులు అంచనా వేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోత జోలికిపోవచ్చునని యూనియన్ బ్యాం కు మేనే జింగ్ డైరెక్టర్ సీఈవో రాజ్‌కిరణ్ రాయ్ జీ అన్నారు. దీనికి బదులు రాబోయే రోజుల్లో వడ్డీరేట్లలో పెంపు ఉంటుందని వారు అభి ప్రాయపడుతున్నారు. మొత్తానికి వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంచే అవకాశాలే ఎక్కు వగా ఉన్నాయని సీనియర్ ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

పన్ను వ్యత్యాసాలకు స్వస్తి



కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినందు వల్ల పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసం తగ్గముఖం పడుతున్నదని, ఇక పన్ను ఎగ్గొట్టడం అంత సులభం కాదని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అదియా చెప్పారు. జీఎస్టి అమల్లోకి వచ్చినందు వల్ల ప్రారంభంలో కొంత రెవెన్యూని ప్రభుత్వం కోల్పోవాల్సి వచ్చిందని, అయితే ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా కుదుట పడుతున్నాయన్నారు. మన దేశంలో కేవలం ఉద్యోగులు మాత్రమే న్యాయంగా పన్ను చెల్లిస్తున్నారని, కార్పొరేట్లు వారిని ఆదర్శంగా తీసుకొని న్యాయంగా పన్ను చెల్లించాలని కోరారు.

న్యూఢిల్లీ : తాజాగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినందు వల్ల పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసం తగ్గముఖం పడుతున్నదని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అదియా చెప్పారు. కార్పొరేట్ల ముందస్తు పన్ను చెల్లింపులను చూస్తే ఇది అర్థమవుతుందని వారి బ్యాలెన్స్ షీట్లు బలంగా ఉన్నాయని అన్నారు. జీఎస్టి అమల్లోకి వచ్చినందు వల్ల ప్రారంభంలో కొంత రెవెన్యూని ప్రభుత్వం కోల్పోవాల్సి వచ్చిందని, అయితే ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా కుదుటపడుతున్నాయన్నారు.

న్యాయంగా పన్ను చెల్లించేది ఉద్యోగులేనా

మన సమాజంలో కేవలం ఉద్యోగులు, కార్పొరేట్‌కు చెందిన కొన్ని వర్గాలు మాత్రమే పన్ను చెల్లిస్తున్నాయని ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ అదియా సోమవారం నాడు చెప్పారు. తాజాగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినందు వల్ల త్వరలోనే ఈ వ్యత్యాసం సమసిపోతుందని ఆయన భరోసా వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఎప్పుడెప్పుడు జీఎస్టీ వస్తుందా అని చర్చించుకునే వారు. ఇప్పుడిక జీఎస్టీ అమల్లోకి వచ్చినందు వల్ల దీనిపై ఎక్కడా చర్చలు కొనసాగడం లేదు. అయితే మూడవ వాయిదా కార్పొరేట్ అడ్వాన్స్ టాక్స్ చూసినప్పుడు ... కంపెనీల బ్యాలెన్స్‌షీట్లు మెరుగుపడుతున్నట్లు కనిపించాయని అదియా అన్నారు. జీఎస్టి వల్ల కార్పొరేట్ల బ్యాలెన్స్‌సీట్లు కాస్త డీలాపడ్డ మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. జీఎస్టి అమలు వల్ల ప్రభుత్వం రెవెన్యూ నష్టపోయింది. అయితే ఈ రెవెన్యూ ఎవరో ఒకరి బ్యాలెన్స్‌షీట్లలో చేరి ఉంటుందని ఆయన అన్నారు. జీఎస్టి అమల్లోకి తెచ్చినందు వల్ల ప్రారంభంలో ప్రభుత్వం కూడా కొంత రెవెన్యూ త్యాగం చేయాలని నిర్ణయించుకుందన్నారు. అయితే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత సంఘటితరంగాలు మాత్రమే లాభాలను ఆర్జిస్తున్నాయని బడ్జెట్ అనంతర సీఐఐ సదస్సులో ఆదియా మాట్లాడుతూ అన్నారు. దేశంలోని మొత్తం 6-7 లక్షల కంపెనీ ల్లో 50 శాతం కంపెనీలు ఐటి రిటర్న్స్ ఫైలింగ్ చేస్తున్నాయని, ఈ కంపెనీలు జీరో లేదా నెగెటివ్ ఇన్‌కం (ఆదాయం) చూపిస్తున్నాయని. దీని బట్టి చూస్తే వారు పన్ను కట్టాల్సిన పనిలేదు. ఇప్పటి వరకు ఇది గతం.. ఇక నుంచి అంటే జీఎస్టి అమల్లోకి వచ్చింది కాబట్టి కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చి కంపెనీ చూపించేటర్నోవర్‌తో పాటు డీలర్ల టర్నోవర్ ఎంత అని లెక్కలు సరిచూసుకుంటామని అన్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటే ఏ వ్యాపారి తన కొనుగోళ్లు తక్కువ చేసే చూపించే అవకాశాలు ఉండవు. అలాగే అమ్మకాలు టర్నోవర్ కూడా తగ్గించే చూపించే అవకాశాలు ఎక్కడుంటాయని ఆదియా ప్రశ్నించారు. కాబట్టి జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత డీలర్ తన టర్నోవర్‌ను తక్కువ చేసి చూపించే అవకాశాలు లేవు. జీఎస్టి రిటర్న్ ఫైలింగ్‌తో పాటు ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో ఇదే లెక్క చూపించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.కార్పొరేట్ టాక్స్ రేట్లలో సవరణ జరిగి ఉంటే వ్యక్తిగత ఆదాయపుపన్ను వసూళ్లు పెరిగేవని ఆదియా అన్నారు. ఇతర దేశాల్లో ప్రభుత్వాలకు కార్పొరేట్ ఆదాయపు పన్ను కంటే వ్యక్తిగత ఆదాయపు పన్ను ఎక్కువగా వస్తుందని చెప్పారు. కాగా భారత్ విషయానికి వస్తే ఇక్కడ వ్యక్తిగత ఆదాయపు పన్ను ఇంకా చాలా పెరగాలన్నారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు పెరిగితే క్రమంగా కార్పొరేట్ పన్ను తగ్గించవచ్చునని ఆయన అన్నారు. ప్రస్తుతం రూ.500 కోట్ల టర్నోవర్‌పై కార్పొరేట్లు కేవలం 24 శాతం చెల్లిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కంపెనీలు కొత్త తయారీసంస్థలను ఏర్పాటు చేస్తే కార్పొరేట్ టాక్స్‌లో రాయితీలు ఇస్తున్నామన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగిందన్నారు. కొత్త ఈ-వే బిల్లును అమల్లోకి తెచ్చిన తర్వాత పరోక్ష పన్నులు ఎగవేత తగ్గిందన్నారు. నిజాయితీగా వ్యవహరించే వారికి జీఎస్టిలో లబ్ది చేకూరుతుందన్నారు. చిన్న తరహా తయారీరంగానికి చెందిన వ్యాపారులు ఇప్పటికీ పన్ను పరిధిలో లేరన్నారు. వీరంతా జీఎస్టి లబ్దిని పొందుతున్నారని ఆదియా పేర్కొన్నారు. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత కొత్త టెక్నాలజీ ద్వారా ఈ-వేబిల్లు, ఇన్‌వాయిస్‌తో సరిపోల్చి చూస్తారని.. ఇక్కడే నిజాయితీ ట్రేడర్ ఎవరూ .. నిజాయితీలేని ట్రేడర్ ఎవరూ అనేది తెలిపోతుందన్నారు. నిజాయితీగా వ్యాపారం చేసే వారికి జీఎస్టితో లబ్ది చేకూరుతుందన్నారు. ఇప్పటికే నిజాయితీ పరులైన వ్యాపారులు ఈ-వేబిల్లును తీసుకురావాలని కోరుతున్నారని చెప్పారు. ఎందుకు తమను మీరు ఈ-వేబిల్లుపై బలవంత పెడుతున్నారని వారిని ప్రశ్నిస్తే.. చాలా మంది వ్యాపారులు ఈ వేబిల్లు వ్యవస్థ లేనందు వల్ల పన్ను ఎగ్గొడుతున్నారని చెప్పారని ఆదియా వివరించారు. చాలా మంది వ్యాపారులు పన్ను ఎగ్గొట్టి సరకును దేశంలోని మారుమూల ప్రాంతాలకు తరలిస్తుంటారు. దీంతో ప్రభుత్వం ఈ వేబిల్లును తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని .. ఈ పద్ధతి మారాలని ఆయన స్పష్టం చేశారు.

పెద్దనోట్ల రద్దు తర్వాత ఐటి నోటీసుల గురించి ప్రస్తావిస్తూ.. నవంబర్ 8, 2016 తర్వాత పెద్దమొత్తంలో బ్యాంకుల్లో డిపాజిట్లు చేశారని.. వాస్తవానికి వారు ఐటి రిటర్న్స్ ఫైలింగ్‌లో ఆదాయాలు చాలా తక్కువగా చూపించారన్నారు. వారిలో చాలా మంది ఐటిరిటర్న్స్ ఫైల్ చేయలేదన్నారు. వచ్చే రెండు మూడు సంవత్సరాల్లో ఈ నోటీసులపై చర్యలు ఉంటాయన్నారు. రాబోయే సంవత్సరం లేదా ఆపై వచ్చే సంవత్సరం నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో పన్నుల ద్వారా రాబడి వస్తుందని ఆదియా ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐటి చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దు
పారిశ్రామికవేత్తలతో సీబీడీటీ

ఆదాయపుపన్ను చట్టంలోని లొసుగులను దుర్వినియోగం చేసి పన్ను ఎగ్గొట్టరాదని సీబీడీటీ చీఫ్ సుశీల్‌చంద్ర పరిశ్రమవర్గాలను కోరారు. ఇప్పటికే పెద్ద కంపెనీలకు పెద్దమొత్తంలో పన్ను రాయితీలు ఇస్తున్నామని, వాస్తవంగా చూస్తే వివిధ రకాల పన్ను మినహాయింపులతో కలిపి కంపెనీలు 26 శాతం మాత్రమే పన్ను చెల్లిస్తున్నారని అన్నారు. కంపెనీలు బాధ్యతగా వ్యహరించి పన్ను చెల్లించాలని.. ఉద్యోగులు న్యాయంగా పన్ను చెల్లించి దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారన్నారు. బడ్జెట్‌లో ఆర్థికమంత్రి రూ.250కోట్ల టర్నోవర్‌పై కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం పలు కార్పొరేట్లకు క్రమంగా పన్ను రేట్లు తగ్గిస్తూ వస్తున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో 7,000 కార్పొరేట్ హౌజ్‌లు మాత్రమే 30 శాతం పన్ను చెల్లిస్తున్నాయని చంద్ర అన్నారు. రూ.250 కోట్ల టర్నోవర్ కంపెనీలపై 25 శాతం పన్ను విధించడంతో ప్రభుత్వం ఖజనాకు రూ.60వేల కోట్లు నష్టం వాటిల్లుతోందని ఆయన సీఐఐ ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ అన్నారు.

టాప్‌గేర్‌లో టాటా మోటర్స్ లాభం

• క్యూ3లో రూ. 1215కోట్లు
• ఆదుకున్న జాగ్వార్ ల్యాండ్ రోవర్ అమ్మకాలు

ముంబై : టాటామోటార్స్ గ్రూపు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం 11 రెట్లు పెరిగి రూ.1,215 కోట్లు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.111.6 కోట్లు మాత్రమే. రెవెన్యూ విషయానికి వస్తే 16.1శాతం వృద్ధితో రూ.74,156 కోట్లకు చేరిందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన చూస్తే నష్టాల నుంచి క్రమంగా లాభాలబాట పట్టింది. క్యూ3 నికరలాభం రూ.1863.65 కోట్లకు చేరగా.. రెవెన్యూ 59శాతం వృద్ధితో రూ.16,102 కోట్లకు ఎగబాకింది. ఏడాది క్రితం రూ.1,052.13 కోట్లు నష్టం ప్రకటించగా.. అంతకు ముందు సెప్టెంబర్‌లో రూ.295.30 కోట్లు నష్టాన్ని ప్రకటించిందని బీఎస్ఈకి సమాచారం అందించింది. జెఎల్‌ఆర్ రెవెన్యూ 4.3శాతం పెరిగి 630 కోట్లపౌండ్లకు చేరింది. జెఎల్‌ఆర్ నిర్వహణా లాభాల మార్జి న్ 160 పాయింట్లు పెరిగి 10.9 శాతానికి ఎగబాకింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన చూస్తే టాటామోటార్స్ ప్యాసింజర్, వాణిజ్య వాహనాల వ్యాపారం బాగా పుంజుకుంది. ఏడాది ప్రాతిపదికన చూస్తే రెవెన్యూ 57.38 శాతం పెరిగి రూ.16,101.6 కోట్లకు చేరింది. వాల్యూమ్స్ బాగా పుంజుకోవడంతో రెవెన్యూ కూడా పెరిగింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన వాల్యూమ్స్ 29 శాతం పెరిగి 132,000 యూనిట్లు విక్రయించింది వాణిజ్య వాహనాల వాల్యూమ్స్ 34.4 శాతం పెరిగితే.. ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 17.5 శాతం పెరిగింది. బీఎస్ఈలో దీని షేరు 3.12 శాతం పెరిగి రూ.396.05 వద్ద ముగిసింది.

ఐఎఫ్‌సీఐ నష్టం రూ. 177కోట్లు

న్యూఢిల్లీ : మౌలికరంగానికిచెందిన కంపెనీలకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే ఐఎఫ్‌సీఐ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికరనష్టం రూ.176.87 కోట్లు నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నష్టం రూ.45.17 కోట్లు మాత్రమే.అయితే ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.655.53 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.635.55 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆర్థిక వ్యవస్థ మందగించడంతో మొండిబకాయిలు పెరిగిపోయాయని, ముఖ్యంగా మౌలికరంగంతో పాటు ఉక్కురంగాలపై ఎక్కువగా ఉందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 2.17 శాతం క్షీణించి రూ.24.80 వద్ద ముగిసింది

రూ.300కోట్ల సేకరణ ఎన్ఏసీఎల్ వాటాదారుల ఆమోదం

హైదరాబాద్ : ఎన్ఏసీఎల్ వాటాదారులు మార్కెట్ నుంచి రూ.300కోట్లు సేకరించడానికి శనివారం నాడు జరిగిన అసాధారణ సమావేశంలో అమోదం తెలిపారు. అదే సమయంలో కంపెనీ బోర్డు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు వెల్లడించింది. క్యూ3లో రెవెన్యూ రూ.194.97కోట్లు సాధిస్తే.. తొమ్మది నెలల కాలానికి రూ.666.32 కోట్లు సాధించిందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. క్యూ3లో 19 శాతం వృద్ధిని నమోదు చేస్తే.. తొమ్మది నెలల కాలంలో 19 శాతం వృద్ధిని సాధించిందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది.

కొల్గెట్‌పాల్మోలివ్ లాభం రూ.170.65 కోట్లు



న్యూఢిల్లీ : ఎఫ్ఎంసీజీ దిగ్గజం కొల్గేట్ పాల్మోలివ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 33.50 శాతం వృద్ధితో రూ.170.65 కోట్లు ఆర్జిం చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 127.82 కోట్లని బీఎస్ఈకి సమా చారం అందించింది. వాల్యూమ్స్ పెరగడంతో లాభాలు కూడా పెరగాయని పేర్కొంది. ఆదాయం విషయానికి వస్తే 4.01 శాతంతో రూ.1,042.36 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,002.12 కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 0.53 శాతం పెరిగి రూ.1120.95 వద్ద ముగిసింది.

బాష్ లాభం రూ. 281కోట్లు

న్యూఢిల్లీ : ఆటో విడిభాగాలు తయారు చేసే కంపెనీ బాష్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 28.78 శాతం వృద్ధితో రూ.281 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.218.19 కోట్లు నమోదు చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆదాయం విషయానికి వస్తేరూ.3,174.18కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.3,027.15 కోట్లని తెలిపింది. కాగా క్యూ3లో మొత్తం ఆదాయం రూ.3,174.18కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3,027.15కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 3.29 శాతం పెరిగి రూ.19,980 వద్ద ముగిసింది.

భారతి టెలికంలో సింగ్‌టెల్ పెట్టుబడులు

• రూ. 2,649కోట్లు

న్యూఢిల్లీ : సింగపూర్‌కు చెందిన టెలి కం ఆపరేటర్ సింగ్‌టల్ భా రతి టెలికంలో రూ.2, 649 కోట్లు పెట్టుబడులు పెట్టి 48.9 శాతం వాటాలను చేజిక్కించుకుంది. ఎయిర్‌టెల్ లిమిటెడ్ ఒక ప్రకటనలో సిం గపూర్ టెలిక మ్యూనికేషన్స్ లిమిటెడ్ (సిం గ్‌టెల్) భారతి టెలికం లిమిటెడ్ (భారతి టె లికం)లో రూ.2,649 కోట్లు పెట్టుబడులు పెడుతోందని.. ప్రమోటర్ కంపెనీ ఎయిర్‌టెల్ ప్రిఫెరెన్షియల్ షేర్లను కేటాయిస్తుందని భారతి ఎయిర్‌టెల్ ఒక ప్రకట నలో వెల్లడించింది. అయితే ఈ లావాదేవీలకు ముందు వాటాదారుల అనుమ తులు తీసుకుంటుందని తెలిపింది. సేకరించిన నిధులతో రుణభారాన్ని తగ్గించుకుంటుందని ప్రకటనలో వివరించింది. తాజా పెట్టుబడులతో సింగ్‌టెల్ వాటా భారతీ టెలికంలో 48.90 శాతానికి చేరుకుంటుంది. ప్రస్తుతం 17.17 శాతం వాటా ఉంది. భారతి టెలికంలో భారతి ఎంటర్‌ప్రైజెస్‌కు 50 శాతం వాటా ఉంది. ఎయిర్‌టెల్‌కు సింగ్‌టెల్‌తో రెండు దశాబ్దాల నుంచి బలమైన సంబం ధాలు న్నాయి. కాగా రాను రాను ఈ సంబంధాలు మరింత ధృడప డుతున్నాయని భారతి టెలికం మేనేజింగ్ డైరెక్టర్ దెవన్ ఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు.

టీవీఎస్ మోటర్ 125సీసీ స్కూటర్ ఎన్‌టార్క్ రూ.58.750



చెన్నై : టీవీఎస్ మోటార్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాల పోర్టుపోలియోను విస్తరించుకుంటూపోతోంది. తాజా గా 125 సీసీ స్కూటర్ సెగ్మెంట్‌లో ఎంట్రీ ఇచ్చింది. కొత్తగా ఎన్‌టార్క్ పేరుతో స్కూటర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.58,750 ఎక్స్ షోరూం న్యూఢిల్లీ, కాగా టీవీఎస్ మోటార్ ఇప్పటికే మార్కెట్లో వివిధ రకాల ప్రొడక్టులను అందుబాటులో ఉంచింది. వాటిలో స్కూటీ పెప్, స్కూటర్ టీవీఎస్ జూ పిటర్, వుయ్‌గోలున్నాయి. కంపెనీ అధికారుల సమాచారం ప్రకారం దేశీ య స్కూటర్ మార్కెట్ ఏడాదికి 17.4 శాతం చొప్పున గత ఆరు సంవ త్సరాల నుంచి వృద్ధి చెందుతోంద న్నారు. కొత్త స్కూటర్‌ను 18-24 సం వత్సరాల యువతను దృష్టిలో ఉం చుకొని మార్కెట్లో విడుదల చేశామని టీవీఎస్ మోటార్ ప్రెసిడెంట్, సీఈవో కెఎన్ రాధాకృష్ణన్ ఇక్కడ మీడి యాతో చెప్పారు. వారంలోగా దేశం లోని డీలర్ల వద్ద కొత్త స్కూటర్ లభిసాయన్నిారు. ఏడాదిలో రెండు లక్షల యూనిట్లను విక్రయి స్తామన్న ఆశాభా వాన్ని వ్యక్తం చేశారు. స్కూటర్ మార్కెట్లో 17 శాతం వాటా ను దక్కించుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి వస్త్ర ట్రేడ్ ఫెయిర్

• హైటెక్స్‌లో 9 వరకు దక్షిణాది ప్రాంతీయ ఫెయిర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని ప్రముఖ వస్త్ర ఉత్పత్తిదారులు, వ్యాపారుల బృందానికి చెందిన అపెరల్ మాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఐ) మంగళవారం నుంచి దక్షిణాది ప్రాంతీయ ట్రేడ్ ఫెయిర్‌ను నిర్వహించనుంది. హైటెక్స్‌లో నిర్వహించే 13వ ట్రేడ్ ఫెయిర్ 6 నుంచి 9వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఏఎంఐ మొదటిసారిగా నిర్వహి స్తున్న ప్రాంతీయ ప్రదర్శనలో కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన రిటైలర్లు, ఎంబివోలు, ఉత్పత్తి దారులు, చైన్‌స్టోర్స్ పాల్గొంటున్నాయని ఏఎంఐ సీఈవో నిఖిల్ పురియా చెప్పారు. ఈ ప్రదర్శనలో ఏథోస్, గివంకీ, ఎరా, ఫైనల్ ఛాయిస్, దివ్య డిజైన్ తదితర ప్రముఖ బ్రాండ్ సంస్థలు పాల్గొంటాయని ఆయన తెలిపారు.తమ అసోసియేషన్ ప్రాంతీయ స్థాయిలో మొదటిసారి ప్రదర్శన నిర్వహిస్తుందని, ఈ ప్రదర్శనలో 50 కోట్ల ఆర్డర్‌ను చేపట్టాలని ఆశిస్తున్నామని అన్నారు. ముంబైకు చెందిన అత్యుత్తమ ఫ్యాషన్ ఎంపికలను రిటైలర్లందరికీ ఒకే వేదిక ద్వారా అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రదర్శన నిర్వ హిస్తున్నట్లు చెప్పారు.ఉత్పత్తిదారులు, రిటైలర్లు, ఏజెం ట్లు, సరఫరాదారుల మధ్య వారధిగా పనిచేస్తూ ఒక బల మైన సమూహాన్ని నిర్మించడమే ఏఎంఐ లక్ష్యమని ఆయ న చెప్పారు. గత రెండేళ్లలో చెన్నైలో, కొచ్చిలో ఆరు చొప్పున ట్రేడ్ ఫెయిర్లు నిర్వహించామని నిఖిల్ చెప్పారు.

సోనాలిక్ ట్రాక్టర్ అమ్మకాల్లో 40 శాతం వృద్ధి

హైదరాబాద్ : దేశీయ మార్కెట్లో సోనాలికా ట్రాక్టర్స్ జనవరిలో 6,039 యూనిట్లు విక్రయించగా... క్రితం ఏడాది ఇదే నెలలో 4,172 యూనిట్లు విక్రయించింది. అమ్మ కాల్లో 45 శాతం వృద్ధిని నమోదు చేసింది. వీటిలోనే 735 యూనిట్లు ఎగుమతి చేసింది. బడ్జెట్ రైతులకు అనుకూలంగా ఉన్నందు వల్ల ఈ ఏడాది అమ్మకాలు మరింత జోరందుకుంటాయని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణ్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు.


4కోట్ల మందికి పైగా కార్డు రూపే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నేషనల్‌పేమెంట్స్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) అంది స్తున్న కార్డు రూపే, దేశంలో ఇప్పటి వరకూ 4.35 కోట్ల మందికి డెబిట్ కార్డులను అందజేసింది. ఇప్పుడు తమ అభిమాన షాపింగ్ కేంద్రా లలో చేసే ఖర్చుపై ఆఫర్లు, రాయి తీలను కార్డు హోల్డర్లకు అంది స్తోంది. డైనింగ్, ట్రావెల్, జ్యు వెలరీ, షాపింగ్ తదితర విభా గా లలో రూపే కార్డు ఈ ఆఫ ర్లను అందిస్తోంది. ప్రస్తుతం దేశీ యంగా 350 ఆఫర్లు, అంతర్జాతీ యంగా 1250కుపైగా ఆఫర్లు రూపే ప్లాట్ ఫామ్‌పై అందుబాటులో ఉన్నా యి. ఈ ఆఫర్లు రూపే క్లాసిక్, ప్లా టినం వేరియంట్లలో లభిస్తాయి. విస్తృతశ్రేణి వేరియంట్స్ అయిన డె బిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ వంటి వాటి ద్వారా రూపే ఇప్పుడు ప్రతి వినియో గదారునికి ప్రాధాన్యత కార్డుగా నిలు స్తుంది.

రూపే ప్లాటి నం కార్డు ద్వారా కార్డు హోల్డర్ ప్రతిసారీ తమ యుటి లిటీ బిల్లు చెల్లింపులపై నగదు ఆదా చేసుకునే అవకాశాన్ని క్యాష్‌బ్యాక్ ఆఫర్ల ద్వారా అంది స్తుంది. వీటితో పాటు కార్డు హోల్డ ర్లకు కాంప్లిమెం టరీగా ప్రమాద బీమా కవరే జిని సై తం అందిస్తోంది. ఈ కార్డును ఆన్ లైన్ షాపింగ్ లేదా స్టోర్స్‌లో కొను గోళ్ళ కోసం ఉపయో గించ డంతో పాటుగా ప్రయోజనాలున్నాయి.

వెంటాడుతున్న బడ్జెట్ కష్టాలు

• 310 పాయింట్లు పతనం • గ్లోబల్ మార్కెట్లది అదేసీన్



ముంబై : దేశీయ మార్కెట్లకు జైట్లీ సెగ తగిలింది. బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధనంపై 10 శాతం పన్ను విధించడం స్టాక్ మార్కెట్లకు రుచించలేదు. దీంతో శుక్రవారం నాడు భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లలో అదే సీన్ సోమవారం రీపీట్ అయ్యింది. మొత్తానికి మార్కెట్లు ముగిసే నాటికి సెన్సెక్స్ 310 పాయింట్లు నష్టపోయింది. మూడు వారాల కనిష్ఠానికి దిగివచ్చింది. నిఫ్టీ కూడా 94 పాయింట్లు క్షీణించింది. మొత్తానికి జైట్లీ చలవతో మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా బ్యాంకింగ్, క్యాపిటల్‌గూడ్స్, ఐటి రంగానికిచెందిన షేర్లపై ఇది ఎక్కువగా కనిపించింది. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లో కూడా ట్రేడింగ్ బలహీనం కావడంతో దాని సెంటిమెంట్ కూడా దేశీయ మార్కెట్లపై కనిపించింది. వరుసగా స్టాక్ మార్కెట్లు నష్టపోవడం ఇది ఐదవ సెషన్. మదుపరుల సంపద భారీగా కరిగిపోయింది. కేంద్రబడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధనంపై 10 శాతం లేవీ విధించడంతో పాటు ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.5 శాతానికి పెంచుకొవడం మార్కెట్లకు రుచించలేదు. ఫిబ్రవరి 1 నుంచి అంటే కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సెన్సెక్స్ గత మూడు ట్రేడింగ్‌సెషన్‌లలో 1208 పాయింట్లు ... నిఫ్టీ 361 పాయింట్ల వరకు నష్టపోయింది.ఇక్కడి నుంచి ఇన్వెస్టర్లు ఈ వారంలో జరిగే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష కోసం ఎదురు చూస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో ఆర్‌బీఐ రెపోరేటు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు యూరోపియన్ షేర్లు కూడా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇదిలా ఉండగా దేశీయ మార్కెట్లు వరుసగానష్టాలతో ముగియడంతో ప్రభుత్వం స్పందించింది. గ్లోబల్ మార్కెట్ల పరిణామాల వల్ల స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయని సమర్థించుకుంది. వరుసగా గత నాలుగు ట్రేడింగ్ సెషన్‌లలో బీఎస్ఈ 1216.50 పాయింట్ల వరకు నష్టపోయింది. నిఫ్టీ 94.05 పాయింట్లతో 10,666.55 వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేశారు. శుక్రవారం నాడు రూ.950 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే దేశీయ ఇన్వెస్టర్లు రూ.508.78 కోట్ల షేర్లు విక్రయించారు. బ్రెంట్ క్రూడాయిల్ పీపా 70 డాలర్లు పలికింది. ఇకషేర్ల విషయానికి వస్తే అత్యధికంగా నష్టపోయింది హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, తర్వాత స్థానాలు ఎల్అండ్‌టి, కొటక్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, బజాజ్‌ఆటో, అదానీపోర్ట్స్, ఓఎన్‌జీసీ, ఎస్‌బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, టీసీఎస్, విప్రో, హిందుస్తాన్ యూనీలీవర్, ఎంఅండ్‌ఎం, ఏషియన్ పెయింట్, టాటాస్టీల్, ఇన్ఫోసిస్‌లు 4.06 శాతం వరకు నష్టపోయాయి.

నష్టాలను తట్టుకొని లాభాలతో దూసుకుపోయిన షేర్ల విషయానికి వస్తే భారతి ఎయిర్‌టెల్ 4.20 శాతం పెరిగింది. సింగ్‌టెల్ ఎయిర్‌టెల్‌లో భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టడమే కారణం. టాటామోటార్స్; పవర్‌గ్రిడ్, ఐటీసీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, సన్‌ఫార్మా, హీరోమోటోకార్ప్, ఎన్‌టీపీసీ, డాక్టర్ రెడ్డీస్, రిల్, ఎస్‌బీఐలు లాభాల బాటపట్టాయి.

ఆర్థిక ఇబ్బందులతో...

భార్య, పిల్లలను కడతేర్చాడు

(మొదటి పేజీ తరువాయి)



స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల వలనే భార్య, పిల్లలను చంపినట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మిన్నంటిన బంధువుల ఆర్తనాదాలు..

కట్టుకున్న భార్య, ముక్కు పచ్చలారని చిన్నారులను కిరాతకంగా హత్య చేసిన ఉదంతాన్ని తెలుసుకున్న బంధువులు, స్థానికులు పెద్దసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని రోధించారు. చిన్నపాటి ఘర్షణకే ముగ్గురి ప్రాణాలను బలితీసుకోవడం అత్యంత విషాదకరమని కంటతడి పెట్టారు. పసిపిల్లల మృతదేహాలపై బంధువులు పడి అప్పుడే నూరేళ్లు నిండాయా అన్న ఆర్తనాదాలు పలువురిని కంటతడి కురిపించాయి.

ఎయిడ్స్ సోకిందని కోడలిని గెంటేశారు

అత్తగారింటి ముందు కోడలి నిరసన.. ధర్నా

వరంగల్ జిల్లా గొల్లపల్లిలో ఘటన

భీమదేవరపల్లి, ప్రభన్యూస్: ఎయిడ్స్ సోకిందని అనుమానం వ్యక్తం చేస్తూ అత్తమామలు కోడలిని ఇంటి నుంచి బయటకు గెంటేశారు. పెళ్లి అయి ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత కోడలిపై నిందె మోపుతూ ఆమెను బజారుకీడ్చారు. ఆ కోడలుకు జరిగిన అన్యాయంపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అత్తవారి ఇంటి ముందు నిరసన తెలిపారు. ఈ సంఘటన వరంగల్ అర్బన్ జిల్లా, భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముస్తావాపూర్ శివారు గొల్లపల్లి గ్రామానికిచెందిన తనుగుల సమ్మయ్య కుమారుడు సంపత్‌తో అరుణకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ జంటకు రాజ్‌కుమార్, అక్షయ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరునెలల క్రితం కూతురు అక్షయకు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో తల్లి అరుణ వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యంచేయించుకుని ఇంటికి చేరుకున్నారు. తల్లి కూతురులకు ఆరోగ్యం సరిగాలేదని ఆసుపత్రులకు తిరుగుతున్నారని మీకు ఎయిడ్స్ సోకిందంటూ అత్తవారు కోడల్ని, మనువరాల్ని ఇంటి నుంచి బయటకు గెంటేశారు. ఆ తర్వాత తల్లి బిడ్డలు మరోసారి రక్తపరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు చేయగా ఒకచోట పాజిటీవ్, మరొకచోట నెగెటీవ్ రావడంతో తిరిగి ఇంటికి వచ్చారు. తమకు అలాంటిదేమిలేదని అత్తగారికి చెప్పే ప్రయత్నం చేయగా వారు పట్టించుకోకపోగా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవాలని హెచ్చరించారు. అత్తగారి వేధింపుల వల్ల మానసిక్షోభకు గురై తాను ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్నారని అరుణ రోధిస్తూ తెలిపింది. తనకు ఎలాంటి అనారోగ్యంలేదని, తనకు తన పిల్లలకు రక్షణ కల్పించాలని అరుణ అత్తవారి ఇంటి ముందు ప్రాధేయపడింది. సోమవారం అత్తగారి ఇంటి ముందు బైఠాయించిన అరుణ మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా వికలాంగుడైన భర్తతో కాపురం చేస్తున్నా.. తనపై ఏనాడులేని విధంగా ఈ మధ్యకాలంలో ఆరోపణలుచేస్తూ తనను మానసికంగా వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలంటూ ప్రాధేయపడింది. దీంతో గ్రామస్తులు కూడా ఆమెకు అండగా నిలిచారు. అరుణను అకారణంగా ఇంటి నుంచి గెంటివేయడంపై ఆమె తరపున బంధువులు, అత్తమామలను ప్రశ్నించారు. దీంతోవారు వచ్చిన బంధువులపై దాడికి పాల్పడ్డారు. అరుణ ఆమె కుమార్తె అక్షయలకు న్యాయం చేయాలంటూ వివిధ సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

భూముల లెక్కలు తేల్చండి

బడ్జెట్ రూపకల్పనకు ఈ లెక్కలే ముఖ్యం

జిల్లా వ్యవసాయాధికారులకు పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతిష్టాత్మకమైన పెట్టుబడి రాయితీ పథకం అమలు నేపథ్యంలో గందరగోళ పరిస్థితులకు అవకాశం లేకుండా వ్యవసాయ భూముల లెక్కలు తేల్చాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశంపై సోమవారం సచివాలయం నుచంఇ జిల్లా వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ శాఖ తేల్చిన లెక్కలకూ, వ్యవసాయశాఖ రికార్డుల్లో ఉన్న లెక్కలకు భారీ తేడాలు కనిపిస్తున్నందున సాధ్యమైనంత త్వరలోనే స్పష్టమైన లెక్కలతో నివేదిక సమర్పించాలన్నారు. రెవెన్యూశాఖతో సంప్రదించి భూప్రక్షాళన ద్వారా పొందుపరిచిన భూముల వివరాల ఆధారంగా గ్రామాల వారీగా తనిఖీలు జరిపి సేద్యంకు అనువుగాని భూముల లెక్కలు వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆ భూముల వివరాలను అనుసరించే రాబోయే వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించనున్నట్లు చెప్పారు. అలాగే రైతులకు అందించనున్న సాగుకు పెట్టుబడి కూడా ఆ సమాచారం ఆధారంగానే అందించనున్నట్లు చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారులతో భూముల సమాచారాన్ని సరిపోల్చి చూడాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా భూమి వివరాలను సరిచూసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు పరస్పర సంప్రదింపులతో ఖచ్చితమైన డేటాను అందుబాటులోకి తేవాలని అన్నారు. పంటల సరళిని అనుసరించి రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు పరిధుల వారీగా, రెవెన్యూ గ్రామాల వారీగా వానాకాలం, యాసంగి 2017-18 పంటల విస్తీర్ణాన్ని క్రోడీకరించి వెంటనే పంపించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను కేబినెట్ సబ్‌కమిటీకి అందజేయాల్సిన ఉందని చెప్పారు. రాబోయే బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున రెవెన్యూ గ్రామస్థాయి వారీగా వ్యవసాయ పరికరాల లభ్యత వివరాలను క్రోడీకరించి జిల్లా వ్యవసాయ అధికారులు ఫిబ్రవరి 12కల్లా పంపించాలని ఆదేశించారు. ఆ సమాచారం ఆధారంగానే రానున్న బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణకు కేటాయింపులు చేయడానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం సమస్యలపై

9న ప్రైవేటు యాజమాన్యాలతో మంత్రుల సమావేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి మంత్రుల బృందం రాష్ట్రంలోని ప్రైవేటు యాజమాన్యాలతో సమావేశం కానుంది. సమావేశం 9న సచివాలయంలో జరుగుతుందని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్లతారక రామారావు, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సమావేశం సచివాలయంలో నిర్వహించాలని నిర్ణయించారని సమావేశంలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల సమస్యలను చర్చించనున్నట్టు విజయభాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

అంతర్జాతీయ విత్తన భాండాగారం దిశగా విధానాలు

వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశీయ విత్తన భాండాగారం నుంచి ప్రపంచ భాండాగారం దిశగా విత్తనోత్పత్తిలో నూతన విధానాలను అవలంబిస్తున్నామని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. ఆ దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ రాష్ట్రం ఇంకా విత్తనోత్పత్తిలో ఉన్న సమస్యలను, లోటుపాట్లను చక్కదిద్ది, పరిష్కారం దిశగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

నాణ్యమైన విత్తనోత్పత్తి జరగాలనే ఉద్దేశంతో, విత్తనోత్పత్తికి పునాది లాంటి మూల విత్తనమైన బ్రీడరు సీడ్ సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. ఈ అంశంపై సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సోయాబీన్, శనగ, వేరుశనగ విత్తనాల ఉత్పత్తి, సరఫరాపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, వెయ్యి క్వింటాళ్ళ సోయాబీన్ బ్రీడరు విత్తనోత్పత్తి ఆదిలాబాద్, ముధోల్, రుద్రూరు వ్యవసాయ పరిశోధన స్థానాల్లో చేపట్టాలన్నారు. గతంలో శనగ బ్రీడరు విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకునే వాళ్ళమని, ఇకపై 500 క్వింటాళ్ళ శనగ బ్రీడరు విత్తనోత్పత్తిని రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా 4వేల క్వింటాళ్ళ వేరుశనగ బ్రీడరు విత్తనోత్పత్తి వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో చేపట్టాలని ఆదేశాలిచ్చారు. జాతీయ నూనెగింజల పరిశోధన స్థానం డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, సోయాబీన్, శనగ, వేరుశనగ విత్తనోత్పత్తిలో ఉత్పన్నమవుతున్న సమస్యలను అధిగమించి, నాణ్యమైన విత్తనోత్పత్తి జరగాలని ఆకాంక్షించారు. అందుకు పై పంటల మూట విత్తనోత్పత్తి రాష్ట్ర విత్తన క్షేత్రాలు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో వ్యవశాయశాఖ, విత్తన ధృవీకరణ సంస్థ, విత్తనాభివృద్ధి అధికారులు, వ్యవసాయ యూనివర్సిటీ, జాతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, అంతర్జాతీయ వ్యవసాయ పరిశధనా సంస్థశాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

180 కిలోల క్లోరోహైడ్రేడ్ పట్టివేత

నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్: నిజామాబాద్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన రూట్‌వాచ్‌లో క్లోరోహైడ్రేడ్ స్మగ్లర్ గంధం శ్రీనివాస్ రెడ్డి అలియాస్ సుంకం శ్రీనును అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు బ్యాగుల క్లోరో హైడ్రేడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ ఎక్సైజ్ ప్రొహిబిషన్ కమిషనర్ డేవిడ్ రవికాంత్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోర్తాడ్ మండలం సుంకెట గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ కొంతకాలంగా నిర్మల్ జిల్లాలో అక్కాపూర్ గ్రామంలో నివాసముంటున్నట్లు తెలపడంతో అక్కడ నాలుగు బ్యాగులు క్లోరో హైడ్రేడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం ఆరు బ్యాగుల్లో 180కిలోల క్లోరో హైడ్రేడ్‌ను, ఇండికా కారును స్వాధీనం చేసుకుటున్నట్లు ఆయన వివరించారు.

స్టాఫ్‌నర్స్, ఫిజియోథెరపిస్టు పోస్టుల దరఖాస్తుకు ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వైద్య, ఆరోగ్య శాఖలో స్టాఫ్‌నర్స్, ఫిజియోధెరపిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తమ బయోడేటాలో తప్పులను సరిచేసుకోవడానికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవకాశం కల్పించింది. తప్పులను సరిచేసుకోవడానికి 8 నుంచి 11 వరకు అవకాశం కల్పించినట్టు కమిషన్ డిప్యూటీ సెక్రటరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఒకసారి మాత్రమే ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని జాగ్రత్తగా తప్పులు లేకుండా దరఖాస్తు చేయాలని సూచించారు.

తెలుగు భాషాభివృద్ధికి

కొత్త కోర్సులుండాలి

- యూనివర్సిటీల అభివృద్ధికి రూ.420 కోట్లు
- 1551 ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలుగు భాష అభివృద్ధికి కొత్త కొత్త కోర్సులను రూపొందించి తెలుగు విశ్వవిద్యాలయం ఖ్యాతిని ఇనుమడింప చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలుగు విశ్వవిద్యాలయం అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనానికి రూ. 3.4 కోట్లను కేటాయించినట్టు కడియం తెలిపారు. యూనివర్సిటీ పరిపాలన భవనానికి సోమవారం ఉపముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అలేఖ్య, ఆకాశవాణి డైరక్టర్ ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు కడియం శ్రీహరి తెలిపారు. యూనివర్సిటీలను బలోపేతం చేయడం కోసం 1551 అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల ఏర్పాట్ల కోసం రూ. 420 కోట్లను కేటాయించామన్నారు. వీటిలో తెలుగు విశ్వవిద్యాలయంలో భవనాల నిర్మాణం కోసం రూ. 20 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేల్లో సీట్లను నియంత్రించేలా చర్యలు తీసుకున్నామని, తద్వారా నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత పాలకులు ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలకు అనుమతులు ఇచ్చారని, తద్వారా అవసరంకు మించి కాలేజీలు, సీట్లు ఉన్నాయని చెప్పారు. వీటి నియంత్రణకు చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. తెలంగాణలో విద్యను అభ్యసించే విద్యార్థి ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడేలాగా తయారు కావాలని సీఎం కేసీఆర్ సూచించారని, ఆ మేరకు తెలంగాణలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్టు తెలిపారు. బంగారు తెలంగాణ సాధనలో మానవ వనరుల అభివృద్ధే కీలకమని సీఎం కేసీఆర్ పదే పదే చెబుతుంటారని అందులో విద్యా శాఖ పాత్ర కీలకమైందని కడియం శ్రీహరి తెలిపారు.

ప్రవేశ పరీక్షలకు ఉర్దూలోనూ ప్రశ్నాపత్రం

సీఎం ఆదేశాలతో ఈ ఏడాది నుంచే అమలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షల్లోనూ ఇకపై ఉర్దూలోనూ ప్రశ్నాపత్రాన్ని ఇవ్వనున్నారు. రాష్ట్ర ద్వితీయ అధికార భాష అయిన ఉర్దూలోనూ అన్ని ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఉన్నత విద్యామండలిని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు అన్ని ప్రవేశ పరీక్షల్లోనూ తెలుగు, ఇంగ్లీష్‌తోపాటు ఉర్దూలోనూ ప్రశ్నాపత్రం ఉండేలా ఉన్నత విద్యా మండలి చర్యలు ప్రారంభించింది. 2018-19లో జరిగే ప్రవేశ పరీక్షల నుంచే దీనిని అమలు చేయడానికి ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోందని మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి అన్ని ప్రవేశ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్‌తోపాటు ఉర్దూలోనూ ఉండేలా చూడాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది.

ఉర్దూ అనువాదకుల కోసం వెదుకులాట

ఇప్పటి వరకు రాష్ట్రంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తున్నారు. ఎంసెట్, ఐసెట్, ఈసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్ పరీక్షలతోపాటు పీజీ సెట్‌లను కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. వీటిలో పీజీ సెట్స్ కాకుండా మిగిలిన అన్ని సెట్ల ప్రశ్నలను తెలుగు, ఇంగ్లీష్‌తోపాటు ఉర్దూలోనూ ఇవ్వనున్నారు. పీజీ సెట్ పరీక్షలను మాత్రం తెలుగు, ఇంగ్లీష్‌లో ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు తెలుగు, ఇంగ్లీష్‌లోనే ప్రశ్నలను ఇచ్చిన వారు ఇప్పుడు ఉర్దూలోనూ ప్రశ్నలను తర్జుమా చేయాల్సి వస్తున్నందున ఉర్దూ అనువాదకుల కోసం ఉన్నత విద్యా మండలి ప్రయత్నాలు ప్రారంభించింది. కేవలం ఉర్దూ అనువాదకులే కాదు, సబ్జెక్టుపై అవగాహన కూడా ఉండేవిధంగా ఉన్నవారైతే ఆయా పదాలను స్పష్టంగా అనువాదం చేసే అవకాశం ఉటుందని అటువంటి వారి కోసం ఉన్నత విద్యా మండలి అన్వేషిస్తోంది. సాధారణంగా ఇంగ్లీష్ నుంచి ఉర్దూలోకి అనువాదం చేసే వారు ఉంటారు... కానీ సబ్జెక్టులో అనుభవం ఉన్నవారే అనువాదకులు అయితే బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. అన్ని సెట్లలో సుమారు 4.50 లక్షల నుంచి 5 లక్షల మంది ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది.

దోస్తు పూర్తి బాధ్యతలు ఉన్నత విద్యామండలికే..

డిగ్రీలో ప్రవేశాలను దోస్తు ద్వారా ఆన్‌లైన్‌లో గత రెండేళ్లుగా చేపడుతున్న సంగతి తెలిసిందే. దోస్తును మొదటి సంవత్సరం కాలేజియేట్ కమిషనర్ నిర్వహించగా, గత ఏడాది ఉన్నత విద్యా మండలి అధ్వర్యంలో కాలేజియేట్ కమిషనర్ వారు సీజీజీ సహకారంతో నిర్వహించారు. అయితే గత ఏడాదిలో సీజీజీలో సీట్ల కేటాయింపులో తప్పులు దొర్లడంతో విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. దీంతో అనేక సమస్యలు వచ్చాయి. రెండు సంవత్సరాల అనుభవంతో వచ్చే ఏడాది 2018-19 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాల పూర్తి బాధ్యతను ఉన్నత విద్యా మండలే తీసుకోవాలని భావిస్తోంది. ఇదే అంశాన్ని గత శనివారం జరిగిన రిజిస్ట్రార్ల సమావేశంలో కూడా రిజిస్ట్రార్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సమస్యలు వచ్చినా వెంటనే సవరించడానికి పూర్తి బాధ్యతలు తెలంగాణ ఉన్నత విద్యా మండలే దోస్తును నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం అయింది. ఈ నేపథ్యంలో దోస్తు బాధ్యతను తామే నిర్వహిస్తామని ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ అనుమతితో తామే నిర్వహిస్తే ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడటానికి అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి అభిప్రాయ పడుతోంది.

డిగ్రీ సీట్లలోనూ మేనేజ్‌మెంట్ కోటా?

ఇప్పటి వరకు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉన్న మేనేజ్‌మెంట్ కోటా ఇక పై ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లోనూ కొనసాగించాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. గత రెండేళ్లుగా డిగ్రీ ప్రవేశాలను దోస్తు ద్వారా ఆన్‌లైన్‌లో చేపడుతున్న నేపథ్యంలో డిగ్రీలో చేరాలనుకునే వారు దోస్తు ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే కాలేజీల్లో చేరడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే కాలేజీలో చేరే అవకాశం లేదు. గత ఏడాది లక్ష వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయి... కాలేజీల్లో సీట్లు రాకపోవడంతో సుమారు 6వేల నుంచి 7వేల మంది విద్యా సంవత్సరం నష్టపోవాల్సి వచ్చింది.

ఆరేటర్ కాంటెస్ట్-2లో

నారాయణ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో నారాయణ గ్రూప్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి దిలీప్ హాజరయ్యారు. ఆయనతోపాటు నారాయణ గ్రూప్ సంస్థల డైరక్టర్ కె పునిత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తాము మాట్లాడే విధానంగా చాలా మార్పులు తీసుకొస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఒక అంశంపై సమగ్ర అవగాహనతోపాటు, ఎటువంటి తడబాటు లేకుండా ఆకట్టుకునేలా చాలా గొప్ప విషయమన్నారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడం కోసం సరికొత్త ప్రోగ్రామ్స్‌ను నిర్వహించడంలో నారాయణవిద్యాసంస్థ డైరక్టర్ కె పునిత్ తెలిపారు. ఈ ప్రోగ్రామ్ మొత్తం 3 విభాగాల్లో జరిగిందని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు రుణాలు


హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రైవేటు పాఠశాలల ఆర్థికావసరాలకు ఉపయోగపడే విధంగా ఇన్క్రెడ్ సంస్థ రుణాలను ఇవ్వనుంది. ప్రైవేటు రంగంలోని పాఠశాలలకు ఎడ్యు ప్రోగ్రెస్ లోన్స్‌ను ఇన్క్రెడ్ సంస్థ ఇవ్వనుంది. ప్రభుత్వ సహాయం పొందని ప్రైవేటు పాఠశాలలకు ఈ రుణాలను ఇవ్వనున్నట్టు ఇన్క్రెడ్ ఎస్ఎంఈ బిజినెస్ సీఈవో సారభ్ ఝూలారియా తెలిపారు. దేశంలో 1.5 మిలియన్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 22 శాతం ప్రైవేటు పాఠశాలలేనని చెప్పారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ దక్షిణ భారతదేశంలో గత 7 నెలలుగా 55 స్కూల్స్‌కి రుణాలు ఇవ్వగా వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాటా రూ. 150 కోట్లకు పైగా ఉన్నాయని తెలిపారు. ఇది సుమారు 30 శాతంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ముందు మరో రూ. 150 కోట్లు రుణం ఇవ్వనున్నట్టు తెలిపారు. 2020 మార్చి నాటికి మరో 100 స్కూల్స్‌లో ఎడ్యు ప్రోగ్రెస్ రుణాలు అందజేయడానికి ఇన్క్రెడ్ ప్రణాళికను సిద్ధం చేసుకుందని తెలిపారు. దీంతోపాటు ఉత్తర, పశ్చిమ ప్రాంత రాష్ట్రాల్లో విస్తరించటానికి పథకం రూపొందించిందని చెప్పారు.

జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు స్విస్ ప్రొఫెసర్ ఎంపిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్విట్జర్లాండ్‌లోని బాసెల్ యూనివర్సిటీకి చెందిన మాలిక్యూలర్ బయాలజిస్ట్ ప్రొఫెసర్ మైఖేల్ ఎన్.హాల్‌ను జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 22 నుంచి జరగనున్న బయో ఏసియా సదస్సులో మైఖేల్‌కు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. న్యూట్రియంట్‌తో కూడిన టివోఆర్ ప్రొటీన్స్, కణ వృద్ధిలో మెటబాలిక్ నియంత్రణలో దాని పాత్రపై ఆయన జరిపిన పరిశోధనలకుగానూ జినోమ్ వ్యాలీ అవార్డుకు ఎంపిక చేశారు. మధుమేహం, క్యాన్సర్‌లాంటి వ్యాధులతో పాటు వయసు రీత్యా వచ్చే శరీర రుగ్మతల నివారణలో మైఖేల్ చేసిన పరిశోధన టివోఆర్ నెట్‌వర్క్ దోహద పడుతుంది. జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును బయో మెడికల్ పరిశోధనల్లో అన్వేషణ చేసిన వారికోసం 2004లో ఈ అవార్డును ఏర్పాటు చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం కీలక భాగస్వామిగా నిర్వహిస్తున్న బయో ఏసియా సందర్భంగా అంతర్జాతీయ శాస్త్రవేత్త మైఖేల్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ముదావహమని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ఆయన చేసిన పరిశోధన ఎంతో ప్రశంసనీయమైన విజయమని అభివర్ణించారు.

స్టాఫ్ నర్సుల భర్తీలో 30 శాతం వెయిటేజీపై కౌంటర్ వేయండి

టీఎస్ పీఎస్సీకి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య విధానపరిషత్ లలో ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్న అభ్యర్థులకు 1196 స్టాఫ్ నర్సుల ఉద్యోగాల భర్తీలో 30 శాతం వెయిటేజీ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్ పీఎస్సీ) ను హైకోర్టు ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థులకు తేది.12.2.2018 వరకు ఎలాంటి నియామకపు ఉత్తర్వులు జారీ చేయరాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కొంగర విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 12కు వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాన్ని కె.మల్లేష్, మరో ఆరుగురు దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యం రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వాసుపత్రులు, వైద్య విధానపరిషత్ ల్లో ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్న అభ్యర్థులకు వంద పాయింట్లలో 30 పాయింట్లను వెయిటేజీ కింద కేటాయించడం వల్ల పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఆ ఉద్యోగులే పొందే అవకాశముందన్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులను 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తే, ఒప్పంద ఉద్యోగులకు 70 మార్కులకే పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. వారికి 30 మార్కులను వెయిటేజీ కింద కేటాయిస్తారు. అందువల్ల ఒప్పంద ఉద్యోగులకు 30 మార్కుల వెయిటేజీ ని తొలగించిన తర్వాత నియామక ప్రక్రియను కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు.

ఘరానా దొంగ మంత్రి శంకర్ అరెస్ట్

- 250 కేసుల్లో నిందితుడు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



హైదరాబాద్, ప్రభన్యూస్ : మంత్రి శంకర్..చోరీలు చేయడంలో పేరుమోసిన ఘనుడు. 20 ఏళ్ల వయస్సులో, చోరీల సామ్రాజ్యంలోకి అడుగుపెట్టి, 58 ఏళ్ల వయస్సు నాటికి 250 దొంగతనాలు చేసి, హాట్ టాఫిక్‌గా మారాడు. పలుమార్లు జైలుకు వెళ్లి, తిరిగి వచ్చిన వెంటనే, సమయం వృథా చేయకుండా దొంగతనాలకు పాల్పడటం మంత్రి శంకర్‌కు వెన్నతో నేర్పిన విద్య. ఇంతటి చరిత్ర కలిగిన మంత్రి శంకర్‌ను ఎట్టకేలకు సౌత్‌జోన్ పోలీసులు పట్టుకుని, కటకటాల్లోకి పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను నగర పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు సోమవారం మీడియాకు వెల్లడించారు.

నగరంలోని చిలకలగూడ నేతాజీనగర్‌కు చెందిన మంత్రి శంకర్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. అయితే డ్రైవింగ్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోదనుకున్నాడో ఏమో, దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. పక్కా ప్లాన్ ప్రకారం, పద్ధతిగా దొంగతనం చేసి, పరారీ కావడం మంత్రి శంకర్ నైజం. అనేక దొంగతనాల కేసులో, కేసులు నమోదు కావడంతో, జైలుకు వెళ్లిన మంత్రి శంకర్ అక్టోబర్ 2017న జైలు నుంచి బయటపడ్డాడు. వచ్చీ రాగానే సమయం వృథా చేయడం ఎందుకని భావించినా మంత్రి శంకర్, నవంబర్, డిసెంబర్, జనవరి నెలలోనే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 7, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో మరో 4 దొంగతనాలు చేసాడు.

దొంగతనాలు చేయడంలోనూ ప్రత్యేకమే

మంత్రి శంకర్ ఇంటిపై కన్నేసాడంటే ఇక అంతే సంగతి. కేవలం తాళం వేసిన ఇళ్లలో మాత్రమే, చోరీలకు పాల్పడుతుంటాడు. తాళం వేయని ఇళ్లల్లో అసలు చోరి చేయడు. ఎంతటి కఠినంగా ఉండే ద్వారాలనైనా సరే, కేవలం రెండు నిమిషాల్లో తన దగ్గర ఉన్న సామాగ్రితో తలుపులు తెరిచి, ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అనంతరం దోచుకున్న సొమ్ముతో, సంచిలో సర్థుకుంటాడు. అయితే ఉదయం వరకు చోరికి పాల్పడ్డ ఇంటిపైనే నిద్రించి, ఉదయం మార్నింగ్ వాక్ చేసే వారు వచ్చేంత వరకు అక్కడే ఉండి, అప్పుడు బయటకు వస్తాడు. ఎవరికి అనుమానం రాకుండా మార్నింగ్ వాకర్స్ తో పాటు వాకింగ్ చేసి పరారైతాడు. అంతేకాదు పలుమార్లు కార్లలో వెళ్లి, దొంగతనం చేస్తాడు. పలు సందర్బాల్లో కాలపత్తార్ కు చెందిన షేక్ ఉబేర్ ఖాన్, జాఫర్ ఖాన్‌తో కలిసి కూడా దొంగతనాలు చేసాడు. వీరు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సీపీ వెల్లడించారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసులను అభినందించిన సీపీ

కరుడుగట్టిన నేరస్థుడు మంత్రి శంకర్‌ను అరెస్ట్ చేసిన సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులను నగర సీపీ వీవీ శ్రీనివాసరావు అభినందించారు. ఎంతో కాలంగా పోలీసులకు సవాలుగా మారిన నేరస్థుడిని ఎంతో చాకచాక్యంగా పట్టుకున్నారని అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోనూ 4 దొంగతనాలు చేసాడని, ఇందుకోసం అతనిపై చర్యలు తీసుకునేందుకు రాచకొండ పోలీసులకు నివేదిస్తామని తెలిపారు.


నిందితుడి నుంచి 370 గ్రాముల బంగారం, రూ. 3 లక్ష 20 వేల నగదు, బజాజ్ అవేంజర్ బైక్, 15 లక్షల విలువైన తాళాలు పగులగొట్టేసామాగ్రిని సీజ్ చేసామని తెలిపారు. దోచుకున్న బంగారాన్ని త్వరలోనే పూర్థిస్థాయిలో రికవరీ చేస్తామని తెలిపారు. విలేఖరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అడిషనల్ కమిషనర్ చైతన్య కుమార్, సౌత్‌జోన్ సీఐ మధు మోహన్ రెడ్డి, ఎస్సైలు కెఎన్ ప్రసాద్ వర్మ, జి, వెంకట రామిరెడ్డి, ఎన్ శ్రీశైలం, మహ్మద్ తాకీద్దున్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.



సంగీత దర్శకుడు మణిశర్మ ఇంట్లో చోరీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ దర్శకుడు మణిశర్మ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని బీరువాలో భద్రపరచిన రూ. 4 లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్ళారు. ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న మణిశర్మ కొద్ది రోజుల క్రితం ఇంట్లోని బీరు వాలో రూ. 4 లక్షలు భద్రపరిచారు. అవసరాల నిమిత్తం ఆదివారం ఆ నగదును తీసేందుకు చూడగా కనిపించలేదు. బీరువా మొత్తం వెదికినా ఎక్కడా నగదు లేకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించారు. దీంతో మణిశర్మ మేనేజర్ సుబ్బానాయుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ డిఐ రవికుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి కారణం ఇంట్లో పని చేసే వారా లేక ఇతరులెవరైనా ఇంట్లో చొరబడి ఈ పని చేశారా అన్న విషయాలను ఆరా తీస్తున్నారు. మణిశర్మ ఇంటి పరిసరాలలోని సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు.

బిట్స్ పిలానీలో విద్యార్థి ఆత్మహత్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడ్చల్ జిల్లా బిట్స్ పిలానీ కళాశాలలో ట్రిబుల్ ఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కళాశాల హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నైకి చెందిన రాఘవ్ శాంతారామ్ (21) సోమవారం ఈ ఘటనకు పాల్పడ్డాడు. ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అవడంతో కొంత కాలంగా అన మనస్కంగా ఉంటున్నాడని, సోమవారం మధ్యాహ్నం భోజ నానంతరం తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలన్మరణం చెందాడని అధికారులు పేర్కొం టున్నారు. ఈ మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసును నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మద్యం నిబంధనల్లో స్వల్ప మార్పులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉత్పత్తిదారుల నుండి మద్యం సేకరణ కు సంబంధించిన నిబంధనల్లో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ మేరకు తెలంగాణ డిస్టిలరీ నిబంధనలను సవరించారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్ సవరణలతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు. డిస్టిలరీస్ నిబంధనల్లో వ్యక్తీకరణ 2016 -17 స్థానంలో వ్యక్తీకరణ 2017 -18 గా మార్చబడిందన్నారు.

వికారాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వికారాబాద్ లో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిరామణానికి రూ.2.65కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ కార్యదర్శి బి.వెంకటేశం సోమవారం తెలిపారు. ఎన్నపల్లి గ్రామంలో 5.06ఎకరాల స్థలంలో దీనిని నిర్మించనుండగా, దీనికి సంబంధించిన బాధ్యతలను జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

'కీచైన్' రెక్కీ

సంపన్నులే టార్గెట్‌గా నేరగాళ్ల ప్రయోగం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అందమైన కీ చైన్‌లు, చూడగానే ఆకట్టుకునే ఆకృతి, ఇతరుల దృష్టిని ఇట్టే ఆకర్షించేలా ఉన్నాయని కొనుగోలు చేస్తున్నారా బహుపరాక్, చూడగానే ఆకట్టుకుంటున్న కీ చైన్‌లని ముచ్చపడి కొనుక్కుంటే మోసపోతారు జాగ్రత్త. మోసాలలో ఆరి తేరిన కొంత మంది తమ కుయుక్తులను కీ చైన్‌ల రూపంలో ప్రజల్లోకి పంపించి ఎంచక్కా మోసాలకు పాల్పడేందుకు కుట్ర పన్నారు. ఈ విషయాన్ని ఎయిర్‌పోర్ట్ నిఘా విభాగం అధికారులు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.
అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న నేరగాళ్ళు కొంత మంది సిండికేట్‌గా తయారై అందమైన, చూడగానే ఆకట్టుకునే కీ చైన్‌లను చిన్న చిప్‌లను ఉంచి రూపొందించారు. ఈ కీ చైన్‌లను ధనవంతులు, సంపన్నులు అధికంగా ఉండే ప్రాంతాలైన ఎయిర్‌పోర్టులు, పెట్రోల్ బంక్‌లు, పిజ్జాబర్గర్ సెంటర్‌లు, కాఫీ క్లబ్బులు తదితర ప్రాంతాలలో సంచరిస్తూ విక్రయిస్తున్నారని, కొన్ని సందర్భాలలో కొనుగోలు దారులు అయిష్టత కనబరిస్తే ప్రమోషన్ పేరుతో ఉచితంగా అందిస్తున్నారని గుర్తించారు. కీచైన్‌లలో అమర్చిన చిప్‌ల ద్వారా సదరు వ్యక్తి నివాసం, బ్యాంక్ ఖాతాలు, ఆస్తులు, ఇంట్లో ఏ వస్తువులను ఎక్కడ ఉంచుతున్నారన్న విషయాన్ని ఇట్టే పసిగట్టే సాంకేతికతను పొందుపరిచారని, ఎక్కడో ఉండి ఇంట్లోని విలువైన వస్తువులను గుర్తించే నేరస్థులు అదను చూసి దోచుకునేందుకు పథకాలను సిద్ధం చేస్తున్నారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి కీ చైన్‌లను ముంబై ఎయిర్‌పోర్టు అధికారులు గుర్తించారు. కొంత మంది నుంచి స్వాధీనం చేసుకున్న కీ చైన్‌లను అక్కడి పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కీచైన్‌లను తయారు చేసే ముఠాను గుర్తించేందుకు ముంబై పోలీసులు ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ముంబైతో పాటు దేశంలోని అన్ని విమానాశ్రయాలు, రద్దీ ప్రదేశాలు, ముఖ్యంగా సంపన్నులు అధికంగా ఉండే ప్రదేశాలు, సామాన్య ప్రజలు ఎక్కువగా వెళ్ళే ప్రాంతాలపై నిఘాను పెట్టాలని హెచ్చరికలను కూడా జారీ చేశారు. అంతేకాకుండా ఘరానా మోసగాళ్ళను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలను కూడా రంగంలోకి దింపాలని అన్ని రాష్ట్రాల పోలీసులకు సూచించారు.

దిల్‌షుఖ్‌నగర్ జంట పేలుళ్ళలో

నిందితుడి గుర్తింపు

సీఐడీ అదుపులో షఫీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ళ కేసులో మరో నిందితుడు పోలీసులకు చిక్కాడు. పట్టుబడ్డ నిందితుడు షఫీని సిఐడి పోలీసులు విచారిస్తున్నారు. 2013 ఫిబ్రవరి 21 న దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో జంట పేలుళ్ళు జరిగి 21 మంది మృతి చెందగా, మరో 107 మంది గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ సంఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారణ జరిపింది. పేలుళ్ళకు పాల్పడింది ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం)కు చెందిన ఉగ్రవాదులని గుర్తించారు. అనంతరం అయిదుగురు నిందితులను కోర్టు ముందు హాజరు పరిచింది. గతంలో ఎన్ఐఎ అరెస్టు చేసిన వారిలో అసదుల్లా అక్తర్ అలియాస్ హాజీ, జియాఉర్‌రహ్మాన్ అలియాస్ వకాస్, మహ్మద్ తహసీన్ అలియాస్ హసన్, అహ్మద్ సిద్ధిఖీ జహార్ అలియాస్ యాసిన్‌భక్తల్, అజాజ్‌షేక్‌లు ఉన్నారు. వీరందరికీ ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు 2016 డిసెంబర్ చివరి వారంలో మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

పేలుళ్ళకు కీలక సూత్రదారిగా భావిస్తున్న మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భక్తల్ పేలుళ్ళు జరిగిన క్షణం నుంచి కనిపించకుండా పోయాడు.ఉన్న వారి కోసం ఎన్ఐఎ ఇంటర్‌పోల్ సహాయాన్ని కూడా కోరింది. దీంతో నిందితులపై ఇంటర్‌పోల్ నిఘాను తీవ్రం చేసింది. విశ్వసనీయంగా అందిన సమాచారంతో ఆదివారం సాయంత్రం సిఐడి పోలీసులు నగరంలో తల దాచుకున్న షఫీని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మహ్మద్ రియాజ్‌తో కలిసి షఫీ పారిపోయాడని పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న షఫీని పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడిని ఒకటి రెండు రోజులలో ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నారు.

బెజవాడ బైపాస్ రహదారికి రంగం సిద్ధం

4 ప్యాకేజీలుగా ఆరులైన్ల జాతీయ రహదారి నిర్మాణం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విజయవాడ - గుండుగొలను మధ్య ఆరో నంబర్ జాతీయ రహదారిని ఆరు వరుసలతో నిర్మించడంతో పాటు నాలుగు వరుసలతో బెజవాడ బైపాస్ రహదారి నిర్మణానికి ప్రణాళిక సిద్ధమవుతున్నట్టు రహదారుల శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. రాజ్యసభలో వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా బదులిచ్చారు. ఆరు వరుసల రహదారి, బైపాస్ రోడ్ నిర్మాణ పనులను నాలుగు ప్యాకేజీలుగా విడగొట్టి ఇంజినీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్‌స్ట్రక్షన్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ప్యాకేజీ వన్, టూకు సంబంధించి డీపీఆర్ రూపకల్పన మొదలైందని, ప్యాకేజీ 3, 4 సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ బిడ్డింగ్ దశలో ఉన్నట్టు మాండవీయ వెల్లడించారు. గతంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ ఎన్ని గడువులు పొడిగించినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఆగస్టు 2016లో ప్రాజెక్ట్‌ను రద్దు చేసినట్టు ఆయన చెప్పారు. కాంట్రాక్ట్ సంస్థ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాన్సిలేషన్ కమిటీని ఆశ్రయించడం వల్ల ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు మాండవీయ విజయసాయిరెడ్డికి ఇచ్చిన జవాబులో పేర్కొన్నారు.

మార్చిలో సగర శంఖారావం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని సగర ఉప్పర కులం వారిని బీసీ-డీ నుంచి తొలగించి గ్రూప్-ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మార్చి చివరి వారంలో సగర శంఖా రావం నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం నిర్ణయించింది. సగర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి శెన్‌చెట్టి విజయేంద్ర సగర, గౌరవాధ్యక్షులు కెపి రాంసాగర్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి సత్యం సగర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎన్ భూపేష్‌సాగర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు సంఘం రాష్ట్ర కార్యవర్గం అభినందనలు తెలిపింది. సగరులు కులవృత్తితోపాటు నిర్మాణ రంగంలో ఉన్నారని నాయకులు తెలిపారు. వెనుకబడి ఉన్న తమను బీసీ - డి గ్రూపులో చేర్చడంతో రిజర్వేషన్లను పొందలేకపోతున్నామన్నారు.



మన రెవెన్యూ దేశానికే ఆదర్శం

● ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏ రాష్ట్రంలో చేయని విధంగా రెవెన్యూ రికార్డుల సంపూర్ణ ప్రక్షాళనతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం ఎంసీహెచ్ఆర్‌డీలో తాహసిల్దార్లకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌పై తొలి బ్యాచ్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యే యంగా పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశానుసారం పరిపాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. అందులో భాగంగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేయటానికి రిజిస్ట్రేషన్ల బాధ్యతలను తహసిల్దార్లకు అప్పగించామన్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మ్యుటేషన్ చేయటానికి ఆస్కారం కలుగుతుందన్నారు. రెవెన్యూ రికార్డులలో కూడా పేరు మార్పిడి ప్రక్రియ త్వరగా జరిగి ప్రజలకు అనవసర జాప్యాలు తొలగిపోతాయన్నారు. 1930 తరువాత తొలిసారిగా భూ రికార్డుల ప్రక్షాళన కోసం నిర్విరామంగా పనిచేస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో అనేక పథకాల అమలులో రెవెన్యూ యంత్రాంగం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. ఏడాదికి రూ.40వేల కోట్లు తమ శాఖ ద్వారానే ఖర్చు చేస్తున్నామ న్నారు. రిజిస్ట్రేషన్ల అదనపు బాధ్యతలను అప్పగించడం వల్ల మరింత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ది ఇండియన్ స్టాంప్ యాక్ట్ 1899, రిజిస్ట్రేషన్ చట్టం 1980కి సంబంధించిన పుస్తకాన్ని ఉప ముఖ్యమంత్రి ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజిలు సైదిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

సింగరేణి లాభం రూ. 1100 కోట్లు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి లాభాలు సాధించే దిశగా పరుగెడుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను.. ఇప్పటిదాకా సాధించిన ఉత్పత్తి, పనితీరు ఆధారంగా రూ.1100 కోట్ల పైచిలుకు నికర లాభాన్ని ఆర్జిస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జనవరి 31నాటికి గడచిన పదిమాసాల్లో వృద్ధి రేటు 8.93 శాతంగా నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటిదాకా 483.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. 61 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకోగా, ఇప్పటికే ఒక్క బెల్లంపల్లి ఏరియానే రూ.600కోట్ల లాభాల్లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా ప్రగతిపథంలో దూసుకుపోతోంది. కంపెనీలోని ఇతర ఏరియాలు కూడా గత ఏడాది కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. వృద్ధిరేటు, ఆశాజనక పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి గణనీయ లాభాలు ఆర్జించనుంది. లాభాల్లో కార్మికులకు కూడా వాటా అందిస్తున్న విషయం విదితమే.

స్టడీ సర్కిళ్ల పేరుతో భారీ అవినీతి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : స్టడీ సర్కిళ్ల పేరుతో ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడుతోందని మాజీ ఎంపీ హనుమంతరావు అన్నారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్‌కు ఆ వర్గాలకు చెందిన వారు మంత్రిగా ఉంటే బాగుండేదని, కానీ జగదీశ్‌రెడ్డికి అప్పగించడం శోచనీయమన్నారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎస్సీల అభివృద్ధికి రూ. 11 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికి.. కేవలం రూ. 3 కోట్లే ఖర్చు చేసినట్లు ఆర్టీఐ చట్టం ద్వారా వాస్తవాలు బయటికి వచ్చినట్లు తెలిపారు. తప్పుడు బిల్లుల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు. అధికార పార్టీ నాయకులు పోలీసులను పావుగా వాడుకుని విపక్షాలపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు.

'డబుల్' భూములు కబ్జా

● పీసీసీ సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రెండు పడుక గదుల ఇళ్ల పథకం పేరుతో పేద ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెడుతోందని మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ సేవాదల్ కమిటి చైర్మన్ కనుకుల జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. ఇళ్ల పథకం కోసం సేకరించిన భూములుకూడా కబ్జాకు గురవుతున్నా.. ప్రభుత్వం తమేకేమి పట్టనట్లుగా వ్యవహారిస్తోందని మండిపడ్డారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సచివాలయానికి రాక ఏడాది అవుతుందని, ఇలా అయితే ప్రజా సమస్యల ఎలా పరిష్కారం అవుతాయో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత టీఆర్ఎస్ నేతలపై ఉందని ఆయన నిలదీశారు. ప్రతి పనికి కాంగ్రెస్ పార్టీ అడ్డొస్తుందని చెప్పి కాలం వెల్లదీస్తూ పోతే ప్రజలను సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. కేసీఆర్‌కు పేద ప్రజలు ఓటు వేసి బాధపడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తెరాస సర్కార్‌వన్నీ మాయమాటలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ ప్రచార ఆర్భాటాలతోనే కాలం గడుపుతోందని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. సంపన్న రాష్ట్రంగా చెప్పుకుంటూనే ఆసరా, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ కార్యక్రమాలకు నిధులు నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన ఆరోపించారు. రుణ మాఫీ కింద విడుదల చేసిన నిధులు వడ్డీకే సరిపోలేదని, అసలు కింద బ్యాంకులు పాస్‌పుస్తకాలు తమవద్దే ఉంచుకున్నాయని ఆయన ఆరోపించారు. రైతులను వంచించిన ప్రభుత్వం మళ్ళీ ఇప్పుడు ఎకరానికి రూ.4వేలు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటోందని రావుల మండిపడ్డారు. ఉపాధి హామీ నిధులు దారి మళ్ళించారని, ఆరోగ్యశ్రీ నిధులు నిలిపివేశారని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌లేక కళాశాలలు మూతపడతాయని, తద్వారా ప్రభుత్వంపై ఆర్థికభారం తగ్గుతుందని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నారని రావుల దుయ్యబట్టారు.

కమీషన్ల కోసమే నీటి ప్రాజెక్టులు

● టీఆర్ఎస్ సర్కార్‌పై మర్రి శశిధర్‌రెడ్డి ధ్వజం

ఆదిలాబాద్, ప్రభ న్యూస్ బ్యూరో : టీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, మితిమీరిపోతున్న అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని టీపీసీసీ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మంజూరు చేసిన ప్రాజెక్టులు రీడిజైన్‌ల పేరుతో కమీషన్‌లు దండుకుంటున్నారని అన్నారు. ఆదిలాబాద్‌లో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టాలని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తే దానిని రిడిజైన్ పేరిట రద్దు చేసి పనులు చేపడుతున్నారని. కేవలం కమీషన్‌ల కోసమే ప్రాజెక్టులు చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని ఏనాడు ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రధాన మంత్రిని కోరలేదని అన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన: రమణ

బెల్లంపల్లి టౌన్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ నియంతృత్వ పాలన కొనసాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాలు, నిరసన, దీక్షలు ఉండవని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి ఉద్యమాలు చేసే ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తివేయడంలోనే తెలుస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇప్పటికి 10వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, నిరుద్యోగులపై కనికరం లేకుండా ఇష్టానుసారంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని మండిపడ్డారు.

ఉక్కు సంకల్పం!

● డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తగ్గింపు ధరతో స్టీల్ సరఫరా చేయండి

● ఉక్కు కంపెనీల యజమానులతో మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకానికి సామాజిక బాధ్యతగా ఉక్కు కంపెనీ యజమానులు తమవంతు సహాయం చేయాలని ఐటి శాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు నాణ్యతతో కూడిన విశాలమైన రెండు పడక గదులను నిర్మిస్తుందని, ఇంతటి మహత్తర కార్యక్రమానికి సామాజిక బాధ్యతగా సిమెంట్ కంపెనీలు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. మంత్రి కేటీఆర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి సిమెంట్ కంపెనీలు మార్కెట్‌లో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా బస్తా సిమెంట్ రూ.230కే విక్రయిస్తున్నారని, ఉక్కు కంపెనీ యాజమాన్యాలు కూడా తక్కువ ధరకు ఉక్కును విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 2.60 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి 5.27 లక్షల టన్నుల ఉక్కు అవసరం అవుతుందని, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో లక్ష ఇండ్లకు 1.14 లక్షల టన్నులు, పట్టణ ప్రాంతాల్లో 60వేల ఇండ్లకు 1.04 లక్షల టన్నులు, జిహెచ్ఎంసి పరిధిలో లక్ష ఇండ్లకు 2.79 లక్షల టన్నుల ఉక్కు అవసరం ఉందని కంపెనీ యాజమాన్యాలకు మంత్రులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తుందని, ఉక్కు విక్రయించిన కంపెనీలకు ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపులు ఉంటాయని వారికి హామీ ఇచ్చారు. లాభాపేక్షతో కాకుండా సానుకూల దృక్పథంతో అందుబాటు ధరకే ఉక్కును విక్రయించాలని మంత్రులు వారిని కోరారు. దీనిపై అన్ని ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో చర్చించి ప్రభుత్వానికి తమ నిర్ణయం వెల్లడిస్తామని ఉక్కు కంపెనీల యాజమాన్యాలు తెలిపాయి. ఈ విషయంపై అధికారులతో మరోసారి భేటీ కావాలని మంత్రులు స్టీల్ కంపెనీల యాజమాన్యాలకు సూచించారు. ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో రెండు, మూడు రోజుల్లో మరోసారి సమావేశమై నిర్దిష్టమైన ధరను నిర్ణయించాలని మంత్రులు గృహ నిర్మాణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్‌ను ఆదేశించారు.

ఈ సమావేశంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టికె శ్రీదేవి, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశాంక్ గోయల్, రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్ కుమార్, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ భారతీ, గృహ నిర్మాణశాఖ చీఫ్ ఇంజనీర్ సత్యమూర్తి, జిహెచ్ఎంసి సీఈ సురేష్ కుమార్, ఆల్ ఇండియా స్టీల్ అసోసియేషన్ చైర్మన్ సురేష్ కుమార్ సింఘాల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, జిందాల్, శాలినీ స్టీల్ కంపెనీలతో పాటు ఇతర 8 స్టీల్ కంపెనీల యజమానులు పాల్గొన్నారు.

తేమ పేరుతో దగా..

● నిలదీసినందుకు కొనుగోళ్లు నిలిపేశారు

● నర్సంపేట మార్కెట్‌లో రైతుల ఆందోళన



నర్సంపేట, ప్రభన్యూస్ : ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన చేస్తుంటే ... మరోవైపు పండించిన పంటను కొనండి అని రైతులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో జరిగింది. ద్వారకపేటలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఉదయం 8 గంటల నుండే పత్తి రావటం మొదలైంది. మేడారం జాతర సెలవుల అనంతరం మార్కెట్ తెరుచుకోవటంతో పత్తి రైతులు మార్కెట్‌కు వ్యాపారస్తుల సూచన మేరకు పట్టుకొచ్చారు. ఉదయం 8 గంటలకు వచ్చిన రైతులను అడ్తి వ్యాపారులు, కొనుగోలు దారులు పత్తిని పరిశీలించి తేమశాతం తక్కువగా ఉన్నా కొని వే బిల్ వేయించుకున్నాక మాకు అవసరం లేదని కొనుగోళ్లు ఆపేశారు. రైతుల కథనం ప్రకారం అడ్తి వ్యాపారస్తుల సూచన మేరకే పత్తి తెచ్చామని, ధర తగ్గించి రెండువేలు ఇస్తామని చెప్పడంతో రైతులకు అన్యాయం చేయవద్దని ప్రశ్నించటంతో వెళ్లిపోయారని, కనీసం మార్కెట్ అధికారులు కూడా స్పందించ లేదన్నారు. ఎంతో దూరం నుండి వచ్చిన రైతులం ఉన్నాం. కొన్ని సంవత్సరాలుగా పత్తి పంటలను పండిస్తున్నాం. ఎప్పుడు తెచ్చిన మాదిరిగానే పత్తిని మార్కెట్‌కు తెచ్చామన్నారు.

వ్యాపారస్తులంతా సిండికేట్‌గా ఏర్పడి రైతును నిలువుగా ముంచేందుకు కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటం వారికే చెల్లిందన్నారు. సీఐ దేవేందర్ రెడ్డి మార్కెట్‌కు వచ్చి రైతులతో మాట్లాడుతూ పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే వ్యాపారస్తులు కొనటానికి ముందుకు రారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని అప్పుడు మద్దతు ధర దొరుకుతుందని, దీనిని రైతులు దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. సీఐ దేవేందర్ రెడ్డి సూచనల మేరకు రైతులు ఆందోళనలు విరమించారు. సీఐ అడ్తి వ్యాపారులతో చర్చించి పత్తి రైతులకు అన్యాయం జరుగకుండా కొనుగోలు చేయాలని సూచించారు. సీఐ సూచనల మేరకు అడ్తి వ్యాపారులు కొనుగోలు మొదలుపెట్టారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

● పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్

వనపర్తి, ప్రభ న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరంకుశ పాలన సాగుతుందని పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి, వనపర్తి ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా గర్జన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు గౌరవం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. కేబినెట్‌లో మహిళలకు స్థానం కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాలలో తక్కువ ప్రాధాన్యత ఇచ్చి, మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అధికారం చేపట్టిన మరుసటి రోజు నుండే మహిళా సంఘాలకు అనేక రాయితీలు కల్పిస్తామని అన్నారు.



మహిళలకు అధిక ప్రాధాన్యత: కుంతియా

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ కుంతియా అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు తీరని అన్యాయం చేయడం జరిగిందని ఆయనన్నారు. ఏఐసీసీ మహిళ విభాగం అధ్యక్షురాలు సుస్మితాదేవ్ మాట్లాడుతూ.. 2019లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని, ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ అవుతారని ఆమె అన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి వారికి న్యాయం జరిగేందుకు పర్యటనలు చేస్తున్నామని ఆమె అన్నారు. మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఏ పథకం ప్రవేశపెట్టిన ఆ పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు డి.కె.అరుణ, సంపత్ కుమార్, గీతారెడ్డి, సీనియర్ నాయకులు మల్లు రవి, మధుయాస్కి గౌడ్, కాంగ్రెస్ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారదతో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నూతన జిల్లాలకు డీసీసీ నియామకాలేవీ?

● పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జిల నియామకానికి నిర్ణయం

● గ్రేటర్ కాంగ్రెస్ పదవికోసం మాజీ మంత్రి తనయుడి ప్రయత్నం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడి ఏడాదిన్నర కాలం అవుతున్నా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం నూతన జిల్లాలకు రథసారధులను నియమించడం లేదు. పాత పది జిల్లాల డీసీసీ అధ్యక్షులతోనే హస్తం పార్టీ నేతలు కాలం వెళ్లదీస్తున్నారు. ఎన్నికల సమయంలో పదవుల పందెరం పెట్టుకుని.. ఇబ్బందులు కొని తెచ్చుకోవడమెందుకనే ఆలోచనతో పీసీసీ భావిస్తున్నట్లు సమాచారం. డీసీసీల నియామకం బదులు లోక్‌సభ, అసెంబ్లీ నియోజక వర్గాలకు బలమైన నాయకులను ఇన్‌చార్జీలగా నియమించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత టీడీపీ, బీజేపీతో పాటు వామపక్షపార్టీలు ఒక అడుగు ముందుకేసి వివిధ జిల్లాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. అయితే అధికార టీఆర్ఎస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లా పార్టీ అధ్యక్షుల నియామకం దిశగా అడుగులు ముందుకేయడం లేదు. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షపదవి కోసం చాల మంది పోటీ పడుతున్నారు. సీనియర్ నేతలు కూడా తమ వారికి పదవి ఇప్పించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఏ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించినా.. మిగతా నేతల నుంచి వ్యతిరేకత వస్తుందనే భావతోనే డీసీసీ నియమాకాలను పక్కన పెట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉంటే రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజక వర్గాలు, 17 పార్లమెంట్ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. కొత్త జిల్లాల పరిమాణం చిన్నగా ఉండటం వల్ల పార్టీ అధ్యక్షుడిని నియమించినా పెద్దగా ప్రయోజనం ఉండదని, పార్లమెంట్ నియోజక వర్గానికి ఇన్‌చార్జిని నియమిస్తే బాగుంటుందనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలున్నట్లు చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహర్‌రెడ్డి కూడా లోక్‌సభ ఇన్‌చార్జిల ద్వారానే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోనూ ఇదే విధానాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది. లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జీల నియమించడం వల్ల పార్టీ బలోపేతానికి అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు. ఒక్కో లోక్ నియోజక వర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్న విషయం విదితమే. ఇన్‌చార్జీలే వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులని బరోసా ఇవ్వాలనే యోచనలో టీపీసీసీ ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే లోక్‌సభ నియోజక వర్గాల వారిగా ఇన్‌చార్జీలను నియమించడం అంత సులువైన విషయం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్‌చార్జీలను నియమించి.. వచ్చే ఎన్నికల్లో మీరే అభ్యర్థులని ప్రకటిస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంటుందనే చర్చ కూడా జరుగుతోంది. కొంత మాజీ ఎంపీలు ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టాలని భావిస్తున్నారు. ఎమ్మెల్యేలు పని చేసిన వారేమో లోక్‌సభకు పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది.

ఇకపోతే తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటి హైదరాబాద్‌కు పార్టీ అధ్యక్షుడు లేకపోవడం పలువురు సీనియర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మాజీ మంత్రి దానం నాగేందర్ నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత దానం నాగేందర్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అయితే ఈ పదవి కోసం చాలా మంది నగర నాయకులు పోటీ పడుతున్నారు. మాజీ మంత్రి ముఖేష్ మాత్రం తన కుమారుడికి పార్టీ గ్రేటర్ బాధ్యతలు ఇప్పించుకోవాలనే ప్రయత్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు గవర్నర్ అభినందనలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవ క్యాంపులో నక్షత్రాల వెలుగులు విరజిమ్మారని ఎన్‌సీసీ కాడేట్స్‌ను తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభినందించారు. జనవరి 1 నుంచి 21 వరకు ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులను గవర్నర్ సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోమ్ కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ కాడేట్ అవార్డును గవర్నర్ ప్రదానం చేశారు. కొత్తగా రూపొందించిన ఎన్‌సీసీ మొబైల్ యాప్‌ను ప్రారంభించి... ఎన్‌సీసీ జర్నల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎయిర్ కమాండర్ మహేశ్వరీ, డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎన్‌సీసీ తదితరులు పాల్గొన్నారు. రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొని అవార్డులను సాధించిన ఎన్‌సీసీ కాడేట్లను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఎన్‌సీసీ కాడేట్లు గ్రామాల్లో పర్యటించి నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడాన్ని గవర్నర్ అభినందించారు.

పెట్టుబడికి టైమ్ షెడ్యూల్!

(మొదటిపేజీ తరువాయి)

టైమ్ షెడ్యూల్ అమలు చేయనున్నారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో, స్థానిక బ్యాంకుల సమన్వయంతో లబ్ధిదారులైన రైతులు చెక్కులను విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఒక్కో మండలం పరిధిలో ఒక్కో తేదీని ఖరారుచేసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

క్షేత్రస్థాయికి ఉపసంఘం ప్రతిపాదనలు

వారం, పది రోజులపాటు విస్తృతస్థాయి చర్చలు, సంప్రదింపులతో కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం గత నెలలోనే ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. ఈ పథకం అమలు విషయంలో తలెత్తిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాలు సూచించింది. బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణి చేయాలని తేల్చి చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్దేశిత మొత్తానికి చెక్కులు పంపిణి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినా, రాకున్నా వారంలోగా పెట్టుబడి మద్దతు పథకం అమలుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి.

సాగు భూమి కోటిన్నర ఎకరాలు

అధికారిక లెక్కల ప్రకారం చిన్న, మధ్యతరహా, భారీ నీటి ప్రాజెక్టులు, బోరు బావుల కింద ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కోటి న్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమిలో పంటలు సాగవు తున్నాయి. అందులో సుమారు 40లక్షల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైనప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రతియేటా బీడు భూములుగానే మిగులుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఆధారపడి జీవిస్తున్న కోటి 20 లక్షల కుటుం బాల్లో సుమారు 40 లక్షల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర సాగుకు అవసరమైన ముడి సరుకును సబ్సిడీపై అందిస్తున్నా, బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తున్నా గడిచిన మూడేళ్ళ పరిస్థితిని పరిశీలిస్తే వ్యవసాయ రంగంలో ఆశించిన ఫలితాలు సాధ్యం కాలేదు. దీంతో తనదైన శైలిలో ఆలోచించిన సీఎం కేసీఆర్ పెట్టుబడి మద్దతు పథకానికి శ్రీకారం చుట్టారు.

మత్స్యకారుల సమస్యలపై కలిసిరండి

● రాజకీయ పార్టీలకు పవన్ కళ్యాణ్ పిలుపు



కర్నూలు జిల్లా మత్స్యకారుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న పవన్‌కళ్యాణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా అందరు ముందుకు రావాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ గత కొంతకాలంగా వారు ఆందోళన చేపడుతున్నారు. అందులో భాగంగానే మత్స్య కార్మిక నాయకులు సోమవారం పవన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు ఇటీవల పవన్ కళ్యాణ్‌ను కోరిన విషయం తెలిసిందే. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్, మత్స్యకారుల సమస్యలు తనకు తెలుసునని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. తెదేపా ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. మత్స్యకారుల ఉద్యమానికి అండగా నిలిచిన మల్లాడిపై పవన్ కళ్యాణ్ ప్రశంసలు కురిపించారు.

కాపులను బీసీలో చేర్చవద్దు : మల్లాడి

ఆంధ్రప్రదేశ్‌లో కాపు సామాజిక వర్గాన్ని బీసీ జాబాతాలో చేర్చవద్దని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు గవర్నర్ నరసింహన్‌ను కోరారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సందర్భంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి తెచ్చారు. అలాగే ఏపీలో ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న కాపు సామాజికవర్గాన్ని బీసీ జాబితాలో చేరిస్తే వెనకబడిన బీసీలకు అన్యాయం జరుగుతుందని మల్లాడి గవర్నర్ దృష్టికి తెచ్చారు. కాపులను బీసీ జాబితాలో చేర్చేందుకు ఏపీ ప్రభుత్వం అధ్యయన కమిషన్‌ను వేసిన సంగతి తెలిసిందే.

బీసీ రిజర్వేషన్లకు బహిరంగ సభలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్నాటకలోనూ భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్టు సోమవారం ఆయన తెలిపారు. 7న కరీంనగర్ జిల్లా మంథనిలో, 9న పరిగిలో బహిరంగ సభలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 21న తిరుపతిలో, 25న విజయవాడలో సభలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా కర్నాటక రాష్ట్రం బీదర్‌లో 29న బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పార్లమెంటులో బీసీ బిల్లుకోసం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చినట్టు తెలిపారు.

ఏపీకి హోదాపై చర్చకు వైకాపా పట్టు

● 184 నిబంధన కింద వైవీ సుబ్బారెడ్డి నోటీసు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్ సృష్టిస్తున్న ప్రకంపనాల నేపథ్యంలో ఎన్డీయే కూటమిలో మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ సైతం ఆందోళన బాట పట్టడంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా పార్లమెంటులో విభజన హామీలపై చర్చకు, చర్చతో బాటు ఓటింగ్‌కు పట్టుబడుతోంది. ఈ మేరకు ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి లోక్‌సభలో 184 నిబంధన కింద నోటీసులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంతో పాటు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయడాన్ని ప్రధానాంశాలుగా తీసుకుని ఈ నోటీసులిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని పార్లమెంటులో పాస్ చేస్తున్న సందర్భంలో నాటి ప్రధాని ఫిబ్రవరి 20, 2014న రాజ్యసభలో ఇచ్చిన హామీ ప్రత్యేక హోదా అని గుర్తుచేశారు. ఈ హామీని తక్షణమే అమలు చేయాలని నోటీసులో పేర్కొన్నారు. ప్రత్యేక హోదాను 15 సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమలు చేసేలా సభ తీర్మానం చేయాలని పట్టబట్టారు. తీర్మానాన్ని ఆమోదించిన 3 నెలల లోపే ప్రత్యేక హోదా అమలు చేయాలని కూడా పేర్కొన్నారు. అలాగే ఒడిషాలోని కోరా పుట్ - బోలాంగిర్ - కలహండికి, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజి తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజిని అమలు చేయాలని కూడా నోటీసులో ప్రస్తావించారు. దీంతో పాటు విభజన చట్టంలో పేర్కొన్న ప్రతి అంశాన్ని, హామీని అమలు చేసేలా తీర్మానం చేయాలని నోటీసులో పేర్కొన్నారు. మే 2019లోపు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఒక తీర్మానం ప్రవేశపెట్టాలని కూడా కూడా డిమాండ్ చేశారు. దుగరాజపట్నం పోర్టు సాధ్యపడని పక్షంలో రామాయపట్నం వద్ద పోర్టు నిర్మించాలన్న అంశాన్ని సైతం ఇదే నోటీసులో వైవీ సుబ్బారెడ్డి ప్రస్తావించారు.

మేడారం ఓ మినీ కుంభమేళా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మేడారం జాతర విశిష్టతను రాజ్యసభలో వెంకయ్య నాయుడు సభ్యులకు వివరించారు. శుక్రవారం తాను మేడారం పర్యటనకు వెళ్లానని చెప్పారు. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన సుమారు కోటిన్నర గిరిజనులు మేడారం జాతరలో భాగస్వాములవుతారని తెలిపారు. ఇది మినీ కుంభమేళా లాంటిదని చెప్పారు. తనతో పాటు తెలంగాణ సీఎం కేసీఆర్, ఛత్తీస్‌ఘడ్ సిఎం రమణ్ సింగ్ కూడా ఈ మేడారం జాతరకు వచ్చారని చెప్పారు. అత్యంత క్రమశిక్షణతో ఆదివాసీలు నిర్వహించే ఈ మేడారం జాతర ఓ అద్భుత అనుభవమని అన్నారు. సమ్మక్క - సారక్క దేవతలుగా గిరిజనులు ఆరాధిస్తారని జాతర ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రభుత్వం మంచి ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

రాజ్యసభలో ఎస్పీ-ఆప్ నిరసనలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంటు ఉభయసభల్లో లోక్‌సభ సోమవారం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకుండానే వాయిదా పడింది. బీజేపీ ఎంపీ హుకుంసింగ్ ఆకస్మిక మృతికి సభలో సంతాపం తెలిపారు. రాజస్థాన్ నుంచి నూతనంగా ఎన్నికైన ఎంపీలు కరణ్‌సింగ్ యాదవ్, రఘుశర్మలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఇటు రాజ్యసభలోనూ సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు ఉత్తరప్రదేశ్‌లో యోగి సర్కారు నకలీ ఎన్‌కౌంటర్లు చేస్తోందని నిరసనకు దిగింది. ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌కు వ్యతిరేకంగా ఆప్ ఎంపీలు సైతం నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. సభ్యులు ఎంత చెప్పినా వినకపోవడంతో సభ కార్యక్రమాలను మధ్యాహ్నం రెండింటి వరకు వాయిదా వేశారు. అనంతరం సభ రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టింది.

విశాఖ నీటిశుద్ధిప్లాంటుకు రూ. 21కోట్లు ఇచ్చాం

● పోలవరానికి ఇంజనీర్ల కొరత లేదు

● ఎంపీల ప్రశ్నలకు కేంద్రమంత్రుల జవాబు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇంజనీర్ల కొరత లేదని జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మెఘువాల్ సోమవారం రాజ్యసభలో స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ... ఏపీ ప్రభుత్వం తెలిపిన సమాచారం ప్రకారం ఇంజినీరింగ్ విభాగంలోని దాదాపు అన్ని కేడర్‌లలో ఖాళీలు భర్తీ అయినట్టు మంత్రి తెలిపారు. అలాగే ప్రాజెక్ట్ నిర్మాణంలో అనవసర జాప్యాన్ని నివారించేందుకు సాంకేతికపరమైన సలహాలు ఇవ్వడానికి కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ డ్యామ్ డిజైన్ రివ్యూ కమిటీని నియమించినట్లు చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తయ్యే వరకు దాని అమలు తీరును పర్యవేక్షించడానికి, నిర్వాసితులకు సంబంధించి అమలు జరిగే సహాయ, పునరావాస చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన కార్యదర్శితో నిపుణుల కమిటీని నియమించినట్లు రామ్ మెఘువాల్ తెలిపారు.

సగం కూడా ఖర్చు చేయలేదు

విశాఖపట్నం జిల్లాలోని 13 మండలాల్లో 47 గ్రామాలను ఫ్లోరైడ్ పీడిత గ్రామాలుగా గుర్తించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారాన్నిబట్టి తెలుస్తోందని కేంద్ర రక్షిత తాగు నీరు, పారిశుద్ధ్య శాఖ సహాయ మంత్రి ఎస్.ఎస్.అహ్లూవాలియా రాజ్య సభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబుగా చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు తాగు నీటి సరఫరా రాష్ట్రానికి సంబంధించిన అంశమైనప్పటికీ గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత తాగు నీరు అందించేందుకు ఆయా రాష్ట్రాలు చేసే ప్రయత్నాలకు కేంద్రం ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తుందని అహ్లూవాలియా అన్నారు. జాతీయ గ్రామీణ తాగునీటి కార్యక్రమం (ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు సాంకేతిక, ఆర్థిక సహాయం అందిస్తుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత తాగు నీరు అందించడానికి అవసరమైన పథకాలను రూపొందించడం, అమలు చేయడం, అవి నిరంతరం కొనసాగేలా చూడటం రాష్ట్రాల బాధ్యత. ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ కింద విడుదల చేసే నిధులను ఫ్లోరైడ్ పీడిత గ్రామాలలో తాగు నీటి సౌకర్యం ఏర్పాటును ప్రాధాన్యంగా తీసుకుని రాష్ట్రాలు వినియోగించుకోవచ్చు. ఫ్లోరైడ్ పీడిత గ్రామాలలో సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌లను నెలకొల్పడానికి నీతి అయోగ్ సిఫార్సుల మేరకు మార్చి 2016లో కేంద్ర ప్రభుత్వం 21.26 కోట్ల రూపాయలను ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేస్తే, ఆ నిధులలో కేవలం 40.04 లక్షల రూపాయలను మాత్రమే ఖర్చు చేసి విశాఖ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలలో 15 సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌లను నెలకొల్పిందని మంత్రి సమాధానమిచ్చారు.

తెదేపా ఎంపీల నిరసనలు

● విభజన హామీలు అమలు చేయాలంటూ నినాదాలు

● సాయంత్రం రాజ్‌నాథ్‌సింగ్‌తో మంతనాలు

లోక్‌సభ లోపలా..వెలుపలా ఆందోళనలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని చెబుతున్న తెలుగు దేశం పార్టీ నేతలు తమ స్వరాన్ని పెంచారు. సోమవారం ఆ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల నిరసనలతో హోరెత్తించారు. ఉభయ సభలకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఉదయం గం. 10.45 ని.ల సమయంలో పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతూ ధర్నా చేపట్టారు. హెల్ప్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌కు సహకరించండి), విభజన చట్టంలోని హామీలను అమలు చేయండి అన్న నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అయితే ఈ ధర్నాకు కేంద్రంలో మంత్రులుగా ఉన్న అశోక్ గజపతి రాజు, వై.ఎస్. చౌదరి (సుజనా చౌదరి) దూరంగా ఉన్నారు. లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం, గల్లా జయదేవ్, నిమ్మల కిష్టప్ప, శివప్రసాద్, కొనకళ్ల నారాయణ, కేశినేని శ్రీనివాస్ (నాని), జేసీ దివాకర్ రెడ్డి, టీజీ వెంకటేష్, కే. రామ్మోహన్ నాయుడు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాగంటి వెంకటేశ్వర రావు (బాబు), మాగంటి మురళీ మోహన్ తదితర ఎంపీలు ధర్నా సమయానికి అందుకోలేకపోయారు. అన్యాయం గురించి యావద్దేశం దృష్టికి తీసుకెళ్లాలన్నదే తమ ఉద్దేశమని, అలాగైనా కేంద్ర ప్రభుత్వం స్పందిస్తుందన్నదే తమ ఆశ అని తెదేపా ఎంపీలు తెలిపారు. ధర్నా సందర్భంగా ఎవరెవరు ఏమన్నారంటే....

ఇచ్చిన హామీలే అడుగుతున్నాం: తోట నరసింహం, తెదేపా లోక్‌సభాపక్ష నేత

విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలనే అమలు చేయాలని గత నాలుగేళ్లుగా అడుగుతున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 బడ్జెట్లలో రాష్ట్రానికి అరాకొరగానే నిధులిచ్చారు. ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా మిత్రధర్మం పాటిస్తూ, సహనంతో వ్యవహరిస్తున్నాం. తాజా బడ్జెట్లోనూ విభజన హామీలకు ఏరకమైన నిధుల కేటాయింపు లేదు. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలనే నిరసన చేపట్టాం. రెవెన్యూ లోటు, రైల్వే జోన్ వంటివి అపరిష్కృతంగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్రానికి మంజూరు చేసిన విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలకు అరాకొరగా నిధులు కేటాయించారు. ఒక్కో సంస్థకు రూ. 500 కోట్ల నుంచి రూ. 1000 కోట్ల వరకు ఖర్చవుతుంది. వాటికి రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల మధ్య నిధులు కేటాయించారు. ఈ లెక్కన ఇంకో 20, 30 సంవత్సరాలు గడిస్తే తప్ప ఆ సంస్థల నిర్మాణం పూర్తి కాదు. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకోవాలి, రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులివ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలన్నదే మా విజ్ఞప్తి. సభ వెలుపల గాంధీ విగ్రహం వద్ద నిరసనతోనే సరిపెట్టబోము. ఇప్పటికే విభజన హామీలు అమలు చేయాలంటూ బడ్జెట్ సమావేశాల ముందు రోజే నేను లోక్‌సభాపక్ష నేతగా 193 నిబంధన ప్రకారం నోటీసులిచ్చాను. ఇది స్పీకర్ పరిశీలనలో ఉంది. దీనిపై చర్చ జరపాలి. హామీలు అమలు చేయాలి. ఆర్థికంగా ఆదుకోవాలి.

ఇస్తారా.. ఇవ్వరా.. తేల్చి చెప్పాలి



హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించడం వల్ల తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం మా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పలు మార్లు ఢిల్లీకి వచ్చి కేంద్ర నాయకత్వాన్ని కలిశారు. సమస్యలను పరిష్కరించాలని, ఆర్థికంగా చేయూత నివ్వాలని ప్రాధేయపడ్డారు. మేం డిమాండ్ చేసిన ప్రతిసారీ ఎవరో ఒకరు ముందుకొచ్చి సర్దిచెప్పి బుజ్జగిస్తున్నారు. ఇకపై అది కుదరదు. ఐసలా.. పైసలా, ఇస్తారా.. ఇవ్వరా.. కేంద్రం తేల్చి చెప్పాల్సిందే. ఇవ్వడం కుదరదని చెబితే మళ్లీ మా ముఖ్యమంత్రితో కూర్చుని తదుపరి కార్యాచరణ నిర్ణయించుకుంటాం.

193 నిబంధన కింద చర్చకు నోటీసులు

సభ వెలుపలే కాదు, సభ లోపల సైతం నిరసన తెలిపేందుకు ఎంపీలు ప్రయత్నించారు. అయితే లోక్‌సభ సిట్టింగ్ ఎంపీ హుకుం సింగ్ శనివారం రాత్రి చనిపోయినందున, లోక్‌సభ ఆయనకు సంతాపం ప్రకటిస్తూ మంగళవారానికి వాయిదా పడింది. దీంతో రాజ్యసభలో ఎంపీలు నినాదాలు చేస్తూ వెల్ లోకి వెళ్లి నిరసన తెలిపాలని భావించారు. అయితే అప్పటికే రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ సహా ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు వివిధాంశాలపై ఆందోళన చేపట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు సైతం ప్లకార్డు పట్టుకుని వెల్‌లో నిలబడడంతో గందరగోళం మధ్య సభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు, మధ్యాహ్నం గం. 2 వరకు వాయిదా వేశారు. దీంతో ఎంపీలంతా పార్లమెంటులోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. తమ నుంచి ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ కేంద్ర మంత్రులు, ప్రధాని, అమిత్ షాను కలిసి సమస్య తీవ్రతను వారి ద ష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ బృందంలో కేంద్ర మంత్రులు అశోక్‌గజపతి రాజు, సుజనా చౌదరితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని 3 ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఉత్తరాంధ్ర నుంచి కె. రామ్మోహన్ నాయుడు, కోస్తాంధ్ర నుంచి తోట నరసింహం, రాయలసీమ నుంచి నిమ్మల కిష్టప్పకు చోటు కల్పించారు. ఈ ఐదుగురు సభ్యుల బృందం సాయంత్రం గం. 5 సమయంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయింది. నిజానికి సాయంత్రం గం. 3.45 ని.లకే అపాయింట్మెంట్ ఇవ్వడంతో తెదేపా ఎంపీలు ఆ సమయానికి నార్త్‌బ్లాక్‌లోని హోం మంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. కానీ దాదాపు గంటసేపు వేచి చూసిన తర్వాతనే రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం మొదలైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు, అంశాలు అమలు కావడం లేదని, వాటిని అమలు చేయడానికి ఇంకా ఏడాది మాత్రమే సమయముందని నేతలు హోంమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ వెంటనే హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబాను తన ఛాంబర్‌కి పిలిపించి విభజన హామీలు, సమస్యలపై వివరాలు ఆరా తీశారు. విభజన చట్టాన్ని అమలు చేసే విషయంలో కేంద్ర హోంశాఖనే నోడల్ ఏజెన్సీగా ఉన్న నేపథ్యంలో చట్టంలో పొందుపరిచిన హామీలు, అంశాల్లో ఇంకా అపరిష్కృతంగా ఉన్నవాటి జాబితాను తయారు చేయాల్సిందిగా రాజ్‌నాథ్ సింగ్ తెదేపా ఎంపీలకు సూచించినట్టు తెలుస్తోంది. అప్పటికే సిద్ధం చేసుకున్న నివేదికను ఎంపీల బృందం ఆయనకు అందజేసినట్టు సమాచారం. మరోసారి సమావేశమై, విభజన అంశాలపై కూలంకశంగా చర్చిద్దామని రాజ్‌నాథ్ సింగ్ తెదేపా ఎంపీలకు సర్దిచెప్పి పంపించారు.

నార్త్‌బ్లాక్ నుంచి బయటికొచ్చిన తర్వాత సుజనా చౌదరి సహా ఎంపీలెవరూ మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసేందుకు సైతం ఎంపీలు ప్రయత్నిస్తున్నందున, ఈ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్తానని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

ఇదిలా ఉంటే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను కలిసేందుకు తెదేపా ఎంపీల బృందం ప్రయత్నిస్తోంది. ఒకవైపు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూనే, మరోవైపు కేంద్ర పెద్దలతో మంతనాలు సాగించాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో మంగళవారం మరికొందరు కేంద్ర మంత్రులను కలిసే అవ కాశం ఉంది. అలాగే సభలోపల చర్చకు పట్టుబడుతూ ఇప్ప టికే పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, 193 నిబంధన కింద నోటీసులిచ్చారు. విభజన చట్టంలోని హామీ లను అమలు చేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నిబంధన కింద స్వల్పకాలిక చర్చకు స్పీకర్ అనుమతిస్తే చర్చ అనంతరం కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. మంగళ వారం చర్చ జరపాలని పట్టుబడతామని తెదేపా ఎంపీలు చెప్పారు.

సహనానికి హద్దుంది



సహనానికి కూడా ఒక హద్దుంటుంది. మా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి విషయాన్ని పరిశీలించి, అధ్య యనం చేసిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటారు. అలుగుటయే ఎరు గని అజాత శత్రువు మా చంద్ర బాబు నాయుడు. ఆయనే అలిగిన రోజు ఎవరికీ మంచిది కాదు. ఇప్ప టికీ మించి పోలేదు. ఆంధ్ర ప్రజల్ని సంతృప్తి పరిచే సమాధానాలు కావాలి. సోము వీర్రాజు వంటి నేతలను గిల్లి ఇష్టమొచ్చినట్టు మాట్లా డించడం కాదు. ప్రధాని మోడీ అన్యాయం చేస్తున్నారనే భావన రాష్ట్ర ప్రజల్లో ఉంది. తిరుపతి వెంకన్న సాక్షిగా అన్నీ ఇస్తామని చెప్పి, ఏమీ ఇవ్వకుండా నామాలు పెడుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు. సంతృప్తికర సమాధానం ఇవ్వకపోతే, పరిస్థితులు మా చేయి దాటి పోతాయి. మేం ఇప్పటికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఇదే మా చిట్ట చివరి విజ్ఞాపన. అయినా సమాధానం రాకపోతే.. మా సీఎం తో మాట్లాడి తీవ్రతను పెంచుతాం. ఇదే సరైన సమయం. వాళ్లే నిర్ణయం తీసుకోవాలి.

మిత్రులను దెబ్బతీస్తే, మీరూ దెబ్బతింటారు



కేంద్ర బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని మేం సీరియస్‌గా తీసుకున్నాం. మోడీ సర్కారు తమ భాగస్వాములను నిర్లక్ష్యం చేస్తోంది. బీజేపీ అధికారంలో ఉన్నచోట, అధికారం లోకి వచ్చే అవకాశం ఉన్నచోట మాత్రమే ప్రాధాన్య తనిస్తున్నారు. కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. మేము దెబ్బతింటే మీరు కూడా దెబ్బతింటారు. మీరు కేవలం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రమే మద్ధతిస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. గుజరాత్‌కు బుల్లెట్ రైలుకి, మహారాష్ట్రకు, బెంగళూరుకు భారీగా నిధులిచ్చారు. మిత్ర ప్రభుత్వాలు ఏమైపోతాయో కూడా ఆలోచించాలి. ప్రజలకు మేం జవాబు చెప్పలేని పరిస్థితిలో ఉన్నాం.

'సీమ'లో హైకోర్టు ఏర్పాటు చేయండి

● కేంద్రానికి ఉత్తరాంధ్ర చర్చావేదిక వినతి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో హైకోర్టును ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక కేంద్రాన్ని కోరింది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక కొద్దిరోజుల కిందట చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా ఢిల్లీ వచ్చిన వేదిక బృందం కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ కు చెందిన పలువురు నేతలు, ఎంపీలను కలిసి ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలుకు మద్దతు ఇవ్వాలని పలువురు నాయకులకు విజ్ఞప్తి చేశారు. కొణతాల రామకృష్ణతో పాటు ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు సోమవారం కేంద్ర న్యాయ శాఖా మంత్రి రవిశంకర్తో ప్రసాద్ తో భేటీ అయ్యారు. హైకోర్టును రాయలసీమలో, విశాఖపట్నం, అమరావతిలో హైకోర్టు బెంచులను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో కొణతాలతో పాటు చిత్తూరు మాజీ ఎంపీ జ్ఞానేందర్ రెడ్డి, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి న్యాయమంత్రి పాల్గొన్నారు.

ఏపీకి న్యాయం చేయండి

● రాజ్యసభలో ప్లకార్డుతో కేవీపీ నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పోలవరంనకు సంబంధించిన విభజన హామీలను నెరవేర్చాలంటూ ఎంపీ కేవీపీ రామచంద్రరావు రాజ్యసభలో డిమాండ్ చేశారు. డు జస్టిస్ టు ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో ప్లకార్డు పట్టుకుని ఆయన సభలో నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రజల ప్రయోజనాల గురించి చంద్రబాబు ఇప్పటికైనా పట్టించుకుంటే ఏపీ ప్రజలు అదృష్టవంతులు అవుతారని కేవీపీ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. పోలవరం కాంట్రాక్టుల కోసం, ఖర్చు లేకుండా బిల్లులు ఆమోదించడం కోసం, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆయన విమర్శించారు. ఈసారైనా ప్రజలను వంచించకుండా ఉంటారని ఒక ఆంధ్ర పౌరుడిగా నేను ఆశిస్తున్నానని ఎంపీ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడే చర్యల్లో భాగంగా ఒక షార్ట్ డ్యూరేషన్ డిస్కషన్‌కు, కాల్ అటెన్షన్‌కూ నోటీస్ ఇచ్చామని తెలిపారు. రాజ్యసభ ఛైర్మన్ విశాలమైన దృక్పథంతో, రాజకీయ పరిణతితో ఏపీ ప్రజల ప్రయోజనాలను ఆకాంక్షిస్తారు కాబట్టి దానిని తప్పకుండా సభలో తప్పకుండా ప్రవేశ పెట్టడానికి ఆమోదం తెలియజేస్తారని ఆశిస్తున్నామని కేవీపీ అన్నారు. విభజన హామీలు నెరవేర్చాలని టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన తెలపడాన్ని ప్రజలు చూస్తున్నారు చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయా లని కోరుతూ రాజ్యసభ వెల్‌లో కాంగ్రెస్ ఎంపీ కెవిపి. రామచం ద్రరావు నిరసనకు దిగారు. ఏపి విభజన చట్టం హామీలు నెరవే ర్చాలని ఆయన డిమాండ్ చేశా రు. సీట్లోకి వెళ్లి ఛైర్మన్ సూచిం చినా ఆయన ప్లకార్డు పట్టుకుని నిరసన కొనసాగించారు.

చంద్రయాన్-2కి సన్నాహాలు

● ఇస్రో సరికొత్త ప్రయోగం ● చంద్రుడిపైకి రోవర్‌ను పంపేందుకు ఏర్పాట్లు ● ఇప్పటికే చంద్రుడిపై నీటిజాడలను గుర్తించిన భారత శాస్త్రవేత్తలు ● రోవర్ ప్రయోగం విజయవంతమైతే ..

ఇక అంతరిక్షంలో భారత్‌దే అగ్రస్థానం



నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: చంద్రుడిపై పరిశోధన కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే చంద్రయాన్-1 ద్వారా జాబిల్లిపై నీటి జాడలను గుర్తించి అంతరిక్ష పరిశోధనారంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న భారత శాస్త్రవేత్తలు తాజాగా చంద్రయాన్-2 ప్రయోగం ద్వారా చంద్రుడుపైకి రోవర్‌ను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఏప్రిల్ మొదటి వారంలో జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా చంద్రయాన్-2 ప్రయోగం ద్వారా రోవర్‌ను చంద్రుడుపైకి ప్రవేశపెట్టాలని ఇస్రో ఆ దిశగా శరవేగంగా ప్రయోగ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. 2008 అక్టోబర్ 22వ తేది పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్‌వీ) సీ-11 ప్రయోగం ద్వారా చంద్రయాన్-1 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టిన ఇస్రో ఆ దిశగా ఆ ఉపగ్రహం నాలుగు సంవత్సరాలపాటు చంద్రుడుపై అధ్యయనం చేసింది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయడంతో పాటు చంద్రుడుపై వాతావరణం, జనజీవనానికి అవసరమైన గాలి, నీరు, వెలుతురు వంటి ప్రకృతి వనరులు ఏ స్థాయిలో అందుబాటులో ఉన్నాయి, భవిష్యత్తులో మానవుడు చంద్ర మండలంలో జీవించడానికి అక్కడి వాతావరణం అనుకూలంగా ఉందా వంటి అంశాలపై చంద్రయాన్ -1 ఉపగ్రహం 2012వరకు అధ్యయనం చేసింది. ఆ దిశగా చంద్రుడుపై నీటి జాడలు కూడా ఉన్నాయని అందుకు సంబంధించి ఛాయాచిత్రాలను కూడా ఇస్రోకు అందించింది. అయితే జీవితకాలంకంటే ముందే చంద్రయాన్-1 ఉపగ్రహంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో 2012లోనే సేవలు నిలిచిపోయాయి. దీంతో అప్పటినుంచి ఇస్రో చంద్రయాన్-2 ప్రయోగాన్ని చేపట్టాలని ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. అయితే 2008లో పీఎస్ఎల్‌వీ ద్వారా 1650 కేజీల బరువున్న ఉపగ్రహాన్ని మాత్రమే చంద్రుడుపైకి పంపిన ఇస్రో తాజాగా ఏప్రిల్‌లో చేపట్టే చంద్రయాన్-2 ప్రయోగాన్ని జీఎస్ఎల్‌వీ ద్వారా చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. బరువైన ఉపగ్రహాలను మోసుకెళ్ళగలిగిన అతి శక్తివంతమైన జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా మరో చారిత్రాత్మక ప్రయోగాన్ని విజయవంతం చేయాలని ఇస్రో భావిస్తోంది. ఇప్పటికే ఇస్రో ఛైర్మన్ శివన్ ఈ ప్రయోగాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారత శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆ దిశగా ఏప్రిల్ మొదటి వారంలో రోవర్‌ను చంద్రుడుపైకి పంపాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించిన ప్రయోగ ఏర్పాట్లను లోతుగా పరిశీలిస్తున్నారు. గతంలో చంద్రుడుపై నీటి జాడలు ఉన్నట్లు గుర్తించిన ఇస్రో తాజాగా పంపే రోవర్ ద్వారా చంద్రుడుపై పూర్తిస్థాయిలో పరిశోధన చేయడంతో పాటు అక్కడ వాతావరణ పరిస్థితులు, రసాయన విశేషాలు తదితర అంశాలను ఈ రోవర్ ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు తెలుసుకోనున్నారు. ఈ రోవర్ చంద్రుడుపై 150 నుంచి 200 మీటర్ల మేర నిత్యం పరిభ్రమిస్తూ అక్కడి వాతావరణానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు భారత శాస్త్రవేత్తలకు అందిస్తుంది. అంతరిక్ష ప్రయోగరంగంలో భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచ దేశాలకు మరోసారి చాటిచెప్పే ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రయోగాన్ని ఎలాగైనా విజయవంతం చేసి అంతరిక్ష ప్రయోగాల్లో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఇస్రో భావిస్తూ ఆ దిశగా ప్రయోగ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది.

యూఏఈ పర్యటనకు మోడీ!



దుబాయ్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరో విదేశీ పర్యట నకు సిద్ధమౌతున్నారు. ఈ వారాంతంలో మోడీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో పర్యటనకు వెళ్లనున్నారు. మోడీ పర్యటనతో భారత్- యూఏఈ మధ్య దౌత్య, ఆర్థిక, భద్రతా రంగంలో ఒప్పందాలు కుదిరే అవకాశముంది. ఈనెల 10,11 తేదీల్లో యూఏఈలోనే గడపనున్న మోడీ.. దుబయ్ లో జరిగే వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్ లో ప్రసంగిస్తారు. 2015లో మొదటిసారి యూఏఈలో పర్య టించిన మోడీకి ఈ పర్యటన రెండోది. ప్రధాని యూఏఈ పర్యటన నేపథ్యంలో ఆదేశంలోని భారత రాయభారి నవదీప్ సింగ్ సూరి స్పందిస్తూ మోడీ రెండో పర్యటన కీలకమైనదని.. ఈ టూర్ ద్వారా ఇండియా-యూఏఈల బంధం మరింత బలోపేతమౌతుందని పేర్కొన్నారు. 2017 లో భారత రిపబ్లిక్ డేకు హాజరైన అబుదాబి యువరాజు షేక్ మహ్మద్ తో జరిపిన చర్చలపై కూడా ఈ పర్యట నలో చర్చకు వచ్చే అవకాశముందని తెలిపారు. ఇండియా- యూఏఈ ద్వైపాక్షిక ఒప్పందాలతో పాటు మోడీ అరబ్ దేశాల్లోని భారతీయులతో దుబాయ్ ఒపెరా హౌస్ లో భేటీ కానున్నారు. ఈ సంవత్సరంలో భారత్‌కు యూఏఈ పెట్టుబడులను భారీగా పెంచగలిగామని.. రక్షణ, భద్రత రంగాల్లో పరస్పర ఒప్పందాలు, ఇంధన రంగంలో కొనుగోలు, అమ్మకం వంటి వాటిలో వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగి ఉన్నామని సూరి వెల్లడించారు. సూరి వ్యాఖ్యలపై భారత్ లోని యూఏఈ రాయభారి అహ్మద్ అల్ బన్నా స్పందించారు. భారత్-యూఏఈ పరస్పర అంగీకారంలో ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హర్యానాలో హరప్ప ఆనవాళ్లు

చండీఘడ్ : హర్యానాలోని ఫతేబాద్ జిల్లాలో జరిపిన తవ్వకాల్లో 5000 ఏళ్ల నాటి హరప్ప నాగరికతకు సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయని పురావస్తు శాస్త్రవేత్త కునాల్ తెలిపారు. 1986 నుండి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతూనే ఉన్నట్టు వివరించారు. నేషనల్ మ్యూజియం డైరెక్టర్ జనరల్ బీఆర్ మని, హర్యానా ఆర్కియాలజీ అండ్ మ్యూజియం డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ (హెచ్ఏఎండీ) బనానీ భట్టాచార్య తవ్వకాలను ప్రారంభించారు. హెచ్ఏఎండీ, నేషనల్ మ్యూజియంతో పాటు ప్రముఖ ఇండియన్ ఆర్కియాలజీ సొసైటీ (ఐఏఎస్) కలిసి ఈ తవ్వకాలు జరపడం మొదలుపెట్టారు. హెచ్ఏఎండీ, ఢిల్లీకి చెందిన ఐఏఎస్ హరప్పన్ ప్రదేశంలో తవ్వకాలకు సంబంధించి ఒప్పంద పత్రాలపై సంతకం చేసుకున్నాయి. తవ్వకాల్లో స్క్వేర్, దీర్ఘ చతురస్రాకారంలోని మట్టితో కూడిన ఇటుకలు కనుగొన్నారు. ఒక నెక్లెస్, ఆరు బంగారు పూసలు, ఆయుధ సామాగ్రి, కొన్ని గాజు ముక్కలు, 12,442 పూసలు, తక్కువ విలువైన రాళ్లు తవ్వకాల్లో వెలుగులోకొచ్చాయి. తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం అత్యంత సంపన్నులు ఉండే ప్రదేశంగా పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు.

పకోడీలు అమ్మడమే మేలు

● చిదంబరం ట్వీట్‌పై బీజేపీ చీఫ్ అమిత్‌షా గుస్సా ● 55 ఏళ్ల అధికారంతో పరిష్కారం కాని నిరుద్యోగ సమస్య ● జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్‌తో పోల్చడంపై అభ్యంతరం ● సర్జికల్ స్ట్రయిక్స్‌తో సత్తా చూపాం : రాజ్యసభలో అమిత్‌షా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పకోడీలు అమ్మి ఉపాధి పొందడం సిగ్గుపడే విషయం కాదని, కానీ వారిని బిచ్చగాళ్లతో పోల్చడం అవమానకరమని బీజేపీ చీఫ్ అమిత్ షా అన్నారు. పకోడీ అమ్మడాన్ని బిచ్చగాళ్లతో పోలుస్తూ కాంగ్రెస్ నేత పి.చిదంబరం ట్వీట్ చేయడం బాధాకరమని అన్నారు. సోమవారం రాజ్యసభలో ఆయన రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ప్రారంభిస్తూ తొలి ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పలువురు మంత్రులు అమిత్ షా ప్రసగం పూర్తయ్యేంతవరకు రాజ్యసభ లోనే ఉన్నారు. నిరుద్యోగ సమస్యపై మాట్లాడుతూ 55 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపలేకపోయిందన్నారు. తాము వచ్చిన కొద్ది కాలంలోనే సమస్య పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. స్టార్టప్, స్టాండప్ ఇండియా, ముద్ర యోజన పథకం ద్వారా లక్షల కోట్ల రూపాయలు ఇచ్చి ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగిగా ఉండడం కన్నా పకోడీలు అమ్ముకోవడం మంచిదేనని అన్నారు. టీ అమ్మే వ్యక్తి తనయుడు ప్రధానమంత్రి అయినప్పుడు, పకోడీలు అమ్మే వ్యక్తి కూడా రేపు పెద్ద పారిశ్రామిక వేత్త కావొచ్చని అన్నారు.

ఒకే దేశం - ఒకే పన్ను నినాదంతో తీసుకువచ్చిన జిఎస్టీ అతి ముఖ్యమైన సంస్కరణ అని అన్నారు. జిఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పోల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాలో గబ్బర్‌సింగ్ అనే పాత్ర డెకాయిట్ పాత్ర అని దాన్ని జిఎస్టీ తో పోల్చడం సరికాదని అన్నారు. స్వాతంత్ర్య భారత చరిత్రలో కాంగ్రెసేతర పార్టీకి మెజారిటీ వచ్చినా తాము ఎన్‌డిఎ పక్షాలను కలుపుకుపోయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్ల పాలనలో ఒకే కుటుంబం పరిపాలించిందన్నారు. ముస్లిం మహిళల వివాహ హక్కులు కాపాడేందుకు తమ ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లు తెచ్చిందని చెప్పారు. షాబానో కేసు సమయంలోనే సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా నాటి ప్రభుత్వం చట్టం తీసుకురాలేకపోయిందని విమర్శించారు.

కాశ్మీర్ సమస్యను ప్రభుత్వం అత్యంత సమర్థంగా నిర్వహిస్తోం దని చెప్పారు. ఉగ్రవాదులకు కరెన్సీ, ఆయుధాలు సరఫరా చేసేవా రంతా ఇప్పుడు జైలులో ఊచలు లెక్కపెడుతున్నారని తెలి పారు. కాశ్మీర్ ప్రస్తుతం సురక్షితంగా ఉందని చెప్పారు. యూరిలో ఉగ్రదాడి తర్వాత పాక్‌సరిహద్దులోపలకి వెళ్లి సర్జికల్ స్ట్రయిక్స్ జరిపేందుకు మోడీ ప్రభుత్వం సాహ సోపేత నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆయు ష్మాన్ భారత్ పథకంతో 50 కోట్ల మంది ప్రజలకు అయిదు లక్షల రూపాయల వరకు ఆరోగ్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

నరేంద్రమోడీ నాయకత్వంలో వారసత్వ రాజకీయాలకు , కుల రాజకీయాలకు, సంతుష్టీకరణ రాజకీయాలకు తెరపడిందన్నారు. రాజకీయాల్లోని ఈ అవలక్షాలన్నింటిని మోడీ కూకటివెళ్లతో పెకిలించివేశారని అన్నారు. అలాగే దేశమంతటా పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఒకేసారి ఎన్నికలు జరిగితే బాగుంటుందని అన్నారు.

కనీసం అసెంబ్లీ, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు అవసరమైన సానుకూల వాతావరణం వచ్చేలా దేశంలో చర్చ జరగాలని కోరారు. తమ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేసిందని, బొగ్గు, స్పెక్ట్రం వేలం పాటలన్నింటిని ఆన్‌లైన్ ద్వారా బహిరంగంగా నిర్వహించామని చెప్పారు.

మాటా.. | తూటా..

పథకాలు రీప్యాక్ చేస్తున్న బీజేపీ

● కాశ్మీర్ విధానమే లేదు ● ఉద్యోగ కల్పనలో విఫలం : గులాంనబీ ఆజాద్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను బీజేపీ ప్రభుత్వం రీ ప్యాకేజింగ్ చేసి ప్రచారం చేసుకుంటోందని కాంగ్రెస్ నేత, రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. పథకాల పేర్లు మారుస్తూ ఈ ప్రభుత్వం గేమ్ చేంజర్‌గా కాక, కేవలం నేమ్‌చేంజర్‌గా మిగిలిపోయిందన్నారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన ప్రసంగించారు. తమ నేషనల్ చైల్డ్ కార్యక్రమానికి పేర్లు మార్చి బేటీ బచావో, బేటీ పడావో అంటూ పెద్ద ఎత్తున ప్రచారంపై ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ప్రచారం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో కనీసం నిజాయితీ ఉండాల్సిన అవసరముందని అన్నారు. తమ పథకాలను రీప్యాకేజింగ్ చేయడంలో బీజేపీని మించి మరెవరూ లేరని అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని 161 జిల్లాల నుంచి 600 జిల్లాలకు విస్తరించినా, పథకం ఖర్చును మాత్రం200 కోట్ల నుంచి కేవలం 280 కోట్ల మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని వివరించారు. నిజానికి ఈ పథకానికి 800 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉందని అన్నారు. జనౌషధి కార్యక్రమం కాస్తా, ప్రధాని జన ఔషధి కార్యక్రమంగా మారిపోయిందన్నారు.

2జి కుంభకోణం ద్వారా తమపై అవినీతి ప్రభుత్వమనే మరక పడిందని, అయితే ఎన్‌డీఏ హయాంలోనే సిబిఐ కోర్టు 2జి కుంభకోణం నిందితులను నిర్దోషులుగా ప్రకటించిందని తెలిపారు. గత 29 సంవత్సరాలుగా గాంధీ కుటుంబం నుంచి ఎవరూ కనీసం మంత్రులు కూడా కాలేదని చెప్పారు. అటువంటప్పుడు వారసత్వమనే ప్రశ్న ఎక్కడ తలెత్తుందని అన్నారు. స్త్రీలపై హర్యానాలాంటి ప్రాంతాల్లో అత్యాచారాలు కొనసాగుతున్నాయన్నారు. అమిత్‌షా తనయుడిపై పరోక్షంగా మాట్లాడుతూ 50వేల రూపాయలను 800 కోట్ల వ్యాపారంగా వృద్ధి చేసుకునే పథకాన్ని అందరితో పంచుకోవాలని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలంటే కనీసం 6 లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ మోడీ ప్రభుత్వం లాలీపాప్‌లు ఇస్తోందన్నారు. పదికోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న సర్కారు ఇందులో ఘోరంగా విఫలమైందని చెప్పారు. కాశ్మీర్‌లో హింసను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని అన్నారు. ఆ పార్టీకి కాశ్మీర్‌పై విధానమే లేదని విమర్శించారు. దౌత్యవైఫల్యం కారణంగా కీలకమైన ఎన్ఎస్‌జి లో సభ్యత్వం సాధించలేకపోయారని అన్నారు. ట్రిపుల్ తలాక్‌కు తాము మద్దతు ఇస్తామని, అయితే భర్తను జైలుకు పంపే క్లాజుకు వ్యతిరేకమని అన్నారు.

మేజర్ల పెళ్లిళ్ళలో జోక్యం వద్దు

● ఖాప్ పంచాయతీలపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ప్రేమ వివాహాలు హత్యలు, దాడులకు దారి తీస్తుండటంతో స్పందించిన సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇద్దరు మేజర్లు వివాహం చేసుకుంటే వారి విషయంలో ఎవరూ తలదూర్చొద్దని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా స్పష్టం చేశారు. ప్రేమ వివాహాలు చేసుకోవడంతో అమ్మాయి, అబ్బాయి కుటుంబ సభ్యులు కక్షపెంచుకుని హత్యలు చేస్తున్నారని ఆయన వివరించారు. కుటుంబ పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న మేజర్ల విషయంలో వారి వారి కుటుంబీకులు, బంధువులు, కుల పెద్దలు, సమాజం ఇలా ఎవరూ కల్గజేసుకోవద్దని తెలిపారు. ఉత్తర భారతదేశంలో ఇలాంటి ఘటనలు అధికంగా వెలుగులోకి వస్తుండటంతో శక్తి వాహిని అనే సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇలాంటి తరహా నేరాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేసింది. కొన్ని గ్రామాల్లో ఈ పరిస్థితి చాలా దారుణంగా ఉందని పిటిషన్‌లో పేర్కొంది. హర్యాణాలో మేజర్ల వివాహంలో చాలా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయని, సాంస్కృతి సంప్రదాయాల పేరిట ప్రేమ పెళ్లి చేసుకున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యులను గ్రామం నుండి వెలివేయడం, దాడులు చేయడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఉత్తరభారత దేశంలో ఖాప్ పంచాయతీలు గ్రామాల్లో సొంతంగా తీర్పులు చెబుతున్నాయని, దీని ఆగడాలు శృతి మించడంతో ఎన్‌జీఓ సంస్థ పిటిషన్ దాఖలు చేయగా పై సుప్రీం కోర్టు పై ఆదేశాలు వెలువరించింది. పరువు హత్యలతరహా నేరాలకు ఖాప్ పంచాయతీలు కూడా వ్యతిరేకం అని ఖాప్ పంచాయతీ తరపు న్యాయవాది విచారణలో వెల్లడించారు. ఇటీవల ఢిల్లీ రోడ్డుపై 23 ఏళ్ల అంకిత్ అనే యువకుడిని అతడి ప్రియురాలి కుటుంసభ్యులు హత్య చేసిన విషయం వివాదంగా మారిన సంగతి తెలిసిందే. అంకిత్ హత్య లేవనెత్తారు.

పాకిస్థాన్ రేంజర్ల కాల్పుల్లో..

నలుగురు జవాన్ల వీరమరణం

● కన్నుమూసిన యువ కెప్టెన్ కపిల్ కుందు ● ఆర్మీపై భారతీయులకు నమ్మకం ఉంది : రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో కెప్టెన్ కపిల్ కుందుతో పాటు ముగ్గురు జవాన్లు వీర మరణం పొందారు. ఆరు రోజుల తరువాత కపిల్ కుందు పుట్టిన రోజు కావడంతో అతని కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జీవితం అనేది చాలా పెద్దది అని ఆయన ఫేస్‌బుక్ పేజీలో రాసుకున్నారు. ఈ ఘటన రాజోరీ జిల్లాలో చోటు చేసుకుంది. పాక్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో రామవతార్ (28), శుభం సింగ్ (22) అనే ఇద్దరు రైఫిల్ మెన్‌లు, హవల్దార్ రోషన్ లాల్ (42)తో పాటు కెప్టెన్ కపిల్ కుందు (23) చనిపోయారు. విచక్షణ రహితంగా కాల్పులు జరపడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. కుమారుడు చనిపోయిన విషయం తెలిసి సునీత బరువెక్కిన హృదయంతో విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు భారతమాత ఒడిలో శాశ్వతంగా నిద్రపోయాడని, ఎప్పుడూ దేశం కోసమే బతికేవాడని, ఆర్మీలో చేరిన తరువాత చాలా ఆనందంగా ఉన్నట్టు కనిపించేవాడని చెప్పారు. ఇంకో కుమారుడు ఉంటే ఆర్మీలోనే జాయిన్ చేయించేదాన్ని అని వివరించారు. అమరుల కోసం పాకిస్థాన్‌పై మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆమె వివరించారు. తన కుమారుడు బతికి ఉంటే ఆర్మీలోనే 10 నుండి 15 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసే వాడని ఆమె చెప్పారు.

కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం : రాజ్‌నాథ్

భారతీయులకు ఆర్మీ జవాన్లపై పూర్తి నమ్మకం ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. రాజౌరీ సెక్టార్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు అమరు లయ్యారని అన్నారు. ఈ విషయమై ఆయన మృతుల కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. జమ్మూ-కాశ్మీర్ ఎల్ఓసీ వద్ద ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. పార్లమెంట్ సెషన్‌కు హాజరైన నేపథ్యంలో విలేకరులు రాజౌరీ సెక్టార్ కాల్పుల గురించి ప్రశ్నించగా, ఆయన పైవిధంగా సమాధానం చెప్పారు. వీరమరణం పొందిన వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

ధీటుగా బదులిస్తాం : ఆర్మీ వైస్ చీఫ్ శరత్

జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో కాల్పుల ఉల్లంఘనకు పాల్పడి నలుగురు సైనికులను చంపేసిన పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సైన్యం సిద్ధంగా ఉందని, పాక్‌కు ధీటుగా బదులిస్తామని ఆర్మీ వైస్ చీఫ్ శరత్ చంద్ పేర్కొన్నారు. భారత్ చేతలతో పాక్‌కు సమాధానం చెబుతుందని ఆయన హెచ్చరించారు. రాజోరి సెక్టార్‌లో జరిపిన కాల్పులపై నేనేం మాట్లాడను.. నేనేం చెప్పను.. కానీ ప్రతీకారం మాత్రం తప్పకుండా ఉంటుందని చెబుతున్నా.. మేము చేపట్టే చర్యలే దీనికి సమా ధానాలు అవుతాయి. ఆ దిశగానే భారత్ ఆర్మీ అడుగులు వేస్తున్నది అని శరత్ చంద్ చెప్పుకొచ్చారు. పాకిస్థాన్ ప్రతీ రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ వస్తోందని అన్నారు. ఆటోమెటిక్ ఆయుధాలతో పాక్ కాల్పులకు తెగబడిందని, మోర్టార్ షెల్స్‌ల వర్షం కురిపించిందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

నావికాదళ అధికారి దుర్మరణం

ముంబై: ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండియన్ నేవీకి చెందిన ఓ అధికారి మృతి చెందారు. స్టేషనరీ ట్రక్‌ను అతని కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 26 ఏళ్ల శ్రీకాంత్ నాగిపోగు ఐఎన్ఎస్ శివాజీలో లెఫ్టినెంట్ హోదాలో పని చేస్తున్నాడు. పుణే జిల్లాకు 120 కిలోమీటర్ల దూరంలోని లోనావాలాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. కోన్ గ్రామానికి సమీపంలోని భటన్ టన్నెల్ వద్ద ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని పన్వేల్ తాలూకా పోలీసులు వివరించారు. 95 కి.మీ మేర హైవేపై వాహనాలు నిలపడం నిషేధం. కానీ డ్రైవర్ దిల్వార్ పటేల్ మాత్రం లారీలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రోడ్డు పక్కన ఆపడంతో దుర్ఘటన చోటు చేసుకుంది.

గ్యాస్‌లీక్.. 8 మంది మృతి

బీజింగ్ : దక్షిణ చైనా ప్రాంతంలోని గుయంగ్డోంగ్‌లోని ఓ స్టీలు మిల్లులో గ్యాస్ లీక్ కావడంతో 8మంది మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. షాగోవన్ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం... షాక్యుగన్ ఐరన్ అండ్ స్టీల్ సంస్థకు చెందిన షాంగ్షాన్ ప్లాంట్లో ఉదయం 3 గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది ప్రమాద తీవ్రతను తగ్గించారు. దీనికి గలకారణాలను విచారించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్మాగారాల్లో ప్రమాదాల నియంత్రణకు చైనా ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా ఘోరాలు మాత్రం ఆగడం లేదు. ప్రతీఏటా కార్మాగారాల్లో, కోల్ మైన్స్, ట్రాన్స్‌పోర్టేషన్ వ్యవస్థల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉంటున్నాయి.

సీపీఈసీపై భారత్ దాడి చేయొచ్చు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మరోసారి తన వంకర బుద్దని ప్రదర్శించింది. భారత్ కు వ్యతిరేకంగా చైనాతో కలిసి పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదుగా చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) నిర్మిస్తున్న దాయాది దేశం తాజాగా ఇండియాపై కొత్త ఆరోపణలు చేసింది. తాము ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సీపీఈసీ నిర్మాణాలపై భారత్ దాడులు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేసింది. బిలియన్ డాలర్ల ప్రాజెక్టు నిర్మాణాలపై భారత్ దాడులు చేయవచ్చని పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. కారకోరం హైవేపై జరుగుతున్న నిర్మాణాలపై దాడులు చేసేందుకు భారత్ ప్లాన్ చేస్తోందని పాకిస్తాన్ కు చెందిన డాన్ పత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో సీపీఈసీ నిర్మాణాల దారిపొడుగునా భద్రతను కట్టుదిట్టం చేశారు. కారకోరం రహదారిపై దాదాపు 24 బ్రిడ్జీలు నిర్మిస్తున్న నేపథ్యంలో గిల్జిట్- బల్టిస్తాన్ హోంశాఖ కార్యదర్శి జావేద్ అక్రమ్, ఇన్స్పెక్టర్ జనరల్ సాబీర్ అహ్మద్, ఇతర ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి డియామర్ జిల్లాలో నిర్మిస్తున్న బ్రిడ్జీల వద్ద భద్రతను పర్యవేక్షించారు. ఐజీపీ సాబీర్ మాట్లాడుతూ కారకోరం హైవేను సన్నితమైన ప్రాంతంగా ప్రకటించామన్నారు.

భర్తపై దాడి చేసిన వారిపై భార్య కాల్పులు

లఖనవూ: ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భర్తపై దాడి చేసిన వారిపై భార్య తుపాకి గురిపెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. తన కళ్లముందే భర్తను కొడుతూ ఉంటే తట్టుకోలేక పోయి రంగంలోకి దిగిందో ఓ భార్యామణి. లఖ్‌నవూలోని కాకోరీ ప్రాంతానికి చెందిన అబిద్ అలీ వృత్తిపరంగా జర్నలిస్టు. సోమవారం ఉదయం అలీ తన నివాసం ముందు నిల్చుని మరో వ్యక్తితో మాట్లాడుతుండగా అక్కడి నలుగురు వ్యక్తులు కత్తులు, రాడ్లతో వచ్చి దాడి చేయడం ఆరంభించారు. అందులో ఒక వ్యక్తి రాడ్‌తో అలీ తలపై మోదగా, అలీ అరుపులకు భార్య ఇంటి నుంచి బయటకు పరుగెత్తుకుంటూ వచ్చింది. చేతిలో తుపాకీతో వచ్చి దుండగులపై గురిపెట్టింది. వారిని భయపెట్టేందుకు కొన్ని రౌండ్లు కాల్పులు కూడా జరిపింది. దీంతో ఆ దుండగులు పారిపోయారు. అలీ ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ తతంతం అంతా సీసీ కెమేరాలో రికార్డైంది. అయితే, భార్య లాయర్. ఆమె తన లైసెన్స్ తుపాకీతోనే దుండగులపై కాల్పులు జరిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అలీపై ఎవరు దాడిచేశారన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు.

చిన్నారి లేఖకు చలించిన ట్రంప్



వాషింగ్టన్: తుపాకీ కాల్పుల్లో ప్రాణ స్నేహితుణ్ణి కోల్పోయిన ఓ చిన్నారి... పిల్లల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అని ప్రశ్నిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఉత్తరం రాసింది. దీనికి ట్రంప్ చలించిపోయి ఆ చిన్నారికి సమాధానం పంపించారు. సౌత్ కరొలినాలోని టౌన్‌విల్లే పట్టణంలో ఎవా ఓస్లేన్ అనే చిన్నారి, ఓ వ్యక్తి తుపాకీతో కాల్పులు జరపడం చూసింది. ఆమె చదువుకునే పాఠశాల వద్ద 14 ఏళ్ల అబ్బాయి జరిపిన కాల్పుల్లో ఎవా స్నేహితుడు జాకోబ్ సహా ముగ్గురు మృతి చెందారు. పాఠశాల ఆటస్థలంలో ఆడుకుంటున్న జాకోబ్ తీవ్రంగా గాయపడి మూడు రోజుల అనంతరం ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన 2016 సెప్టెంబర్‌లో జరిగింది. స్నేహితుడి మరణాన్ని మర్చిపోలేని ఎవా 2017 ఆగస్టులో అధ్యక్షుడు ట్రంప్‌కు లేఖ రాసింది. 'డియర్ మిస్టర్ ప్రెసిడెంట్, నా పేరు ఎవా రోస్ ఓస్లేన్. నాకు ఏడేళ్లు. రెండు తరగతి చదువుతున్నాను. తగ ఏడాది టౌన్‌విల్లే ఎలిమెంటరీ స్కూల్ దగ్గర జరిగిన కాల్పుల్లో నా స్నేహితుడు జాకోబ్ ప్రాణాలు కోల్పోయాడు. అది చూసి నేను చాలా భయపడ్డాను. మేము పెళ్లి చేసుకోవాలనుకున్నాం. దయచేసి ఇలాంటిది ఎప్పటికీ జరగనివ్వకండి' అంటూ లేఖలో పేర్కొంది. ట్రంప్ ఆమెకు సమాధానం పంపించారు. 'డియర్ ఎవా, నీ స్నేహితుడు జాకోబ్ మరణం గురించి విని నేను, మిసెస్ ట్రంప్ చాలా బాధపడుతున్నాం. నీ గురించి, నీ కుటుంబం గురించి, జాకోబ్ కుటుంబం గురించి మేము ప్రార్థిస్తున్నాం' అని ట్రంప్ చెప్పారు.

తన పెళ్లికి తానే వీడియో జర్నలిస్టు!



పాకిస్తాన్: ఒక వీడియో జర్నలిస్టుని చూస్తే ఈరోజుల్లో కూడా ఇలాంటి నిబద్ధత గలవారు ఉన్నారా అనిపిస్తుంది.బంధువుల ఇంట్లో పెళ్ళికే వారం రోజులసెలవు పెట్టి చెక్కేసే వారున్న నేటి కాలంలో పాకిస్తాన్‌లో సీ-41 న్యూస్ చానల్ వీడియో జర్నలిస్టు పెళ్ళి కుమారునిగా ముస్తాబై పందిరలోకి మైక్ పుచ్చుకుని రాగానే అంతా ఆశ్చర్యపోయారు. మరి కాసేపట్లో పెళ్ళి జరగబోతుంటే, జర్నలిస్టు ఉద్యోగం చేస్తున్నా డేమిటని నోరెళ్ళబెట్టారు.ఆ జర్నలిస్టు మైక్ ని తల్లి ముందు పెట్టి, మీ అబ్బాయి ఒక ఇంటివాడవుతున్నందుకు ఆనందంగా ఉందా అని ప్రశ్నించాడు.అలాగే,తన కాబోయే శ్రీమతిపై కూడా ప్రశ్నల వర్షం కురిపించాడు.పెళ్ళి కుమారుని ఆహార్యంలో ఉన్నప్పటికీ,సాదాసీదాగానే ప్రశ్నలు అడగడం,ఇతరుల ప్రశ్నలకు సమాధానమివ్వడం చూసిచాలా మంది నోళ్ళు నొక్కుకున్నారు. ప్రేమించిపెళ్ళి చేసుకుంటున్నట్టు కూడాప్రకటించారు. సీ-42 ఛానల్‌లో ప్రసారమైన అతడి ఇంటర్వ్యూ భాగాలు సాంఘిక మాధ్యమాల్లో ఆకర్షణగా ఉన్నాయి.

ఇద్దరిని పట్టించిన సెల్ఫీ

చెన్నై: ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన ఒక ఫోటో ఇద్దరు యువకుల అరెస్టుకు దారితీసింది. తన ఇంటి టెర్రస్ పై సాగు చేస్తున్న మొక్కలకు సంబంధించిన ఫొటోను ఫేస్‌బుక్‌లో ఒక స్నేహితుడు చేసిన పోస్ట్ ఈ అరెస్టులకు కారణమైంది. పెంచుతున్న మొక్కలు గంజాయి మొక్కలు. నీలమ్ బాషా రోడ్‌లోని తన నివాసంలోని టెర్రస్ పై కమల్ అనే 35 ఏళ్ల యువకుడు గంజాయి సాగు చేస్తున్నాడు. అతడి స్నేహితుడు శశికుమార్ (22) ఆ మొక్కల దగ్గర కూర్చుని సెల్ఫీ దిగి ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు.

సంక్షోభానికి తెర దించండి..

● అంతర్జాతీయ సమాజానికి మాల్దీవుల ప్రతిపక్షాలు వేడుకోలు

● ప్రజాస్వామ్య స్ఫూర్తితో మెలగాలంటూ భారత్ హితవు



మాలే: మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం ముదిరిపాకాన పడింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పును మాల్దీవులు అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ లెక్కచేయకుండా నిరంకుశవాదానికితెరతీయడంతో ప్రతిపక్షాలు రోడెక్కాయి. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించకపోవడంపై ప్రతిపక్షాలు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగాయి.

సుప్రీం తీర్పును అమలు చేయలేం..

ప్రతిపక్షపార్టీకి చెందిన 9 మంది నాయకులను వెంటనే విడుదల చేసి..బ్రిటన్ లో ఆశ్రయం పొందుతున్న మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ ను మాల్దీవులుకు వచ్చేందుకు అనుమతించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని గురువారం ఆదిశించింది..అలాగె ప్రతిపక్షాలకు సపోర్టుచేసిన 12మంది అధికార పార్టీ పార్లమెంట్ సభ్యులపై అనర్హత వేటు ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. దీంతో చిక్కుల్లో పడిన అధ్యక్షుడు యమీన్ ముందస్తుగానే ఎన్నికలకు వెళ్తామంటూ సుప్రీంతీర్పుపై మొదటి సారి నోరువిప్పారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సిన అవసరం లేదంటూ పోలీసులు..ఆర్మీని ఆదేశించారు. తాజాగా మాల్దీవులు న్యాయశాఖ మంత్రి అజిమా షాకూర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తమ ప్రభుత్వం నమ్మడం లేదని.. అరెస్టయిన ప్రతిపక్ష, అసమ్మతి నేతలను విడుదల చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ కమ్యూనిటీకి ప్రతిపక్షాల వినతి

తమ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నశీమ్ నేతృత్వంలోని డెమోక్రాటిక్ పార్టీ అంతర్జాతీయ కమ్యూనిటీని వేడుకుయటన్నాయి. నిరంకుశుడిగా వ్యవహరిస్తున్న అబ్దుల్ యమీన్ పాలనకు చరమగీతం పాడి.. రాజకీయ అనిశ్చితికి ముగింపు పలకాలని కోరుతూ నేతలు ఓలేఖను విడుదల చేశారు. కోర్టు తీర్పును అమలు చేస్తే తన పాలన ముగిసిపోతుందనే భయంతోనే యమీన్ నిరంకుశ వాదానికి దిగాడని ఆరోపించారు. భారత్,శ్రీలంక, అమెరికా, బ్రిటన్, యురోపియన్ యూనియన్ మిగతా దేశాలు మా దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరగా.. ఐక్యరాజ్యసమి తి,ఆస్ట్రేలియా, భారత్, అమెరికాలు స్పందించాయి.

మాల్దీవులు పర్యటనలొద్దుః చైనా

రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో మాల్దీవుల్లో పర్యటించరాదని చైనా తమ దేశ పౌరులను హెచ్చరించింది. మాల్దీవులకు హాలిడే టూర్లు ప్లాన్ చేసుకున్న వారు కూడా వెంటనే తమ పర్యటనను రద్దు చేసుకోవాలని కోరింది. తమ టూరిస్టుల ద్వారా మాల్దీవులు పర్యాటక రంగానికి ఎక్కువ ఆదాయం సమకూరుతున్న నేపథ్యంలో చైనా ప్రకటన చేసింది.



ప్రజాస్వామ్య స్ఫూర్తితో మెలగండి.. ః భారత్

మాల్దీవులు రాజకీయ సంక్షోభంపై భారత్ స్పందించింది. ప్రజాస్వామ్య దేశంలో అరాచకానికి తావులేదని స్పష్టం చేసిన భారత్... ప్రజాస్వామ్య స్ఫూర్తితో మెలగాలని ఆదేశ అధ్యక్షుడు యమీన్‌కు సూచించింది. మాల్దీవులు సుప్రీంకోర్టు ఆదేశాలను ఆ దేశ ప్రభుత్వం శిరసావహించి అన్ని వర్గాలకు న్యాయబద్ధమైన పాలన అందించాలని కోరింది. స్థిర, శాంతి, శ్రేయస్కరమైన మాల్దీవులను తాము కోరుకుంటున్నామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. భారత్‌కు నైరుతి వైపు ఉన్న మాల్దీవులు మన దేశానికి వ్యూహాత్మక భాగస్వామి. అయితే గతేడాది డిసెంబర్ లో చైనా ఒత్తిడి మేరకు ఆదేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మాల్దీవులు సంతకం చేసింది.

డీజే నృత్యంతో ప్రియురాలి నిరసన

హర్యానా: ప్రేమ పేరుతో మోసం చేసిన తన ప్రియుడికి వినూత్న రీతిలో నిరసన తెలిపింది హర్యానాలోని ఓ యువతి. ఏకంగా డీజేతో ప్రియుడి ఇంటిముందు చిందేసింది. ఈ ఘటన హర్యానాలోని పటౌడీలో చోటుచేసుకుంది. ప్రియుని మోసాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ బాధతో ఆమె మద్యం సేవించినట్లు కనిపించినా ఈ విషయంపై స్పష్టతలేదు. అంతేకాదు అమీర్‌ఖాన్ ఫేమస్ మూవీ 'రాజా హిందుస్థానీ'లోని 'తేరే ఇష్క్ మే' పాట పెట్టుకుని డ్యాన్స్‌లు చేస్తూ తన బాధను వ్యక్తపరిచింది. ప్రేమాయణం జరిపిన ఓ యువకుడు కొన్ని రోజు లుగా ఆమెను పట్టించుకోకపోవడంతో ఆమె ఇలా ప్రవర్తించినట్లు సమాచారం.



క్రీడాప్రభ

పక్కా ప్లానింగ్‌తో గొప్పగా ఆడారు!

మన కుర్రాళ్లు త్యాగధనులు: ద్రవిడ్ ప్రశంసలు



ముంబై: అండర్ 19 వరల్డ్ కప్ గెలిచిన యువ భారత క్రికెట్ జట్టు సోమవారం ముంబై చేరుకున్నది. కోచ్ రాహుల్ ద్రావిడ్‌తో పాటు కెప్టెన్ పృథ్వీ షా మీడియాతో మాట్లాడారు. వరల్డ్ కప్‌లో విక్టరీ కోసం యువ ప్లేయర్లు ఎంతో త్యాగం చేశారని ద్రావిడ్ తెలిపారు.

అండర్-19 ప్లేయర్లను తయారు చేయడం కోసం వేసిన ప్లానింగ్ ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. యువకులు ఆడిన తీరు, ఒత్తిడిని జయించిన తీరు ఆకట్టుకున్నదన్నారు. తీవ్ర ఒత్తిడిలో.. ఫైనల్లో ఆడడం అదో రకమైన అనుభవమన్నారు. ముంబైకి వచ్చి ఇక్కడ అభిమానుల ఆనందాన్ని వీక్షించడం మరో రకమైన ఆనందమన్నారు. యువ ప్లేయర్లు సాధించిన ఘనత పట్ల గర్వంగా ఉందని ద్రావిడ్ అన్నారు.

అపూర్వ స్వాగతం

అండర్-19 ప్రపంచకప్ విజేతలైన భారత యువ కిశోరాలకు సోమవారం అపూర్వ స్వాగతం లభించింది. న్యూజిలాండ్ నుంచి స్థానిక ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి పృథ్వీ షా, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లతో కూడిన యువ భారత జట్టు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకున్నారు. వీరికి మహారాష్ట్ర క్రికెట్ అకాడమీతోపాటు విమానాశ్రయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం సందర్శకుల గ్యాలరీతోపాటు, వెలుపల అభిమానులు భారీ సంఖ్యలో పృథ్వీ సేనకు స్వాగతం పలికారు. భారత్ ప్రపంచ కప్‌లో ఆడిన అన్ని మ్యాచుల్లో గెలిచి నాలుగోసారి ప్రపంచ కప్‌ను దేశానికి తీసుకొచ్చింది. ఫైనల్లో ఆస్ట్రేలియాను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించిన విషయం తెలిసిందే.



బీసీసీఐకి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు బీసీసీఐకి నోటీసులు జారీ చేసింది. క్రికెటర్ శ్రీశాంత్ సస్పెన్షన్ పై నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని నోటీసులో ఆదేశించింది. తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసే ఉంటుంది. సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ క్రికెటర్ శ్రీశాంత్ తరపున వాదించారు. కేసు విచారణ ముగిసే వరకు క్రికెట్ ఆడేందుకు వీలుగా శ్రీశాంత్‌కు మధ్యంతర ఉపశమనం కల్పించాలన్న సుప్రీంను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సుప్రీం నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని బీసీసీఐకి నోటీసులు పంపింది.

బెంగళూరుకు మారనున్న బీసీసీఐ కార్యాలయం



భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు అద్దె కార్యాలయం నుంచి సొంత కార్యాలయానికి మారనుంది. ప్రస్తుతం ముంబై లోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియంలో బీసీసీఐ కేంద్ర కార్యాలయం ఉంది. గార్డెన్ సిటీగా పేరుపొందిన బెంగళూరులో జాతీయ క్రికెట్ అకాడెమీ ఏర్పాటు పూర్తికాగానే బీసీసీఐ తన కార్యాలయంను అక్కడికి మార్చునంది. ప్రపంచంలోనే ధనవంతమైన బోర్డుగా ఉన్న బీసీసీఐ సొంత కార్యాలయంతోపాటు 40 ఎకరాల భూమిని సొంతం చేసుకోనుంది. కార్యాలయ మార్పుపై కొంతమంది ఉన్నతాధికారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు కార్యాలయంకూడా ఐదు నక్షత్రాల లాడ్జింగ్ మల్లే ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు.


వన్డేలకు డికాక్ దూరం



కేప్‌టౌన్: గాయాల బెడద దక్షిణాఫ్రికా జట్టును కలవర పెడుతోంది. ఇప్పటికే గాయాలతో వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ డు ప్లెస్సిస్, డి విల్లియర్స్‌లకు తోడూ తాజాగా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డి కాక్ గాయపడి మిగతా వన్డేలకు దూరమయ్యాడు. డికాక్ మిగిలిన వన్డేలతోపాటు టీ20 వ్యచుల్లో ఆడడం అనుమానమే. భారత్‌తో సెంచూరియన్‌లో రెండో వన్డేలో డికాక్ ఎడమచేయి మణికట్టుకు తీవ్ర గాయమయింది. కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కాగా డివిల్లియర్స్, ప్లెస్సిస్ ఇద్దరూ చేతి వేళ్లకు గాయంతో సతమవుతున్నారు. డికాక్ స్థానంలో కొత్త వారిని తీసుకునేది లేదని దక్షిణాఫ్రికా సెలెక్టర్లు ప్రకటించారు. ఇప్పటికి వన్డే స్క్వాడ్‌లో ఉన్న కీపర్ బ్యాట్స్‌మన్ హెయిన్‌రిచ్ క్లాసెన్ మూడో వన్డేలో ఆడే అవకాశముంది. ఆరు వన్డే ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-0తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్

బొల్లింజర్ క్రికెట్‌కు గుడ్‌బై



సిడ్నీ: మాజీ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ డౌగ్ బొల్లింజర్ క్రికెట్ నుంచి విరమించనున్నట్లు ప్రకటించాడు. 36 ఏళ్ల బొల్లింగర్ 12 టెస్టులాడి 25.9 సగటుతో 50 వికెట్లు తీశాడు. 39 వన్డేల్లో 23.9 సగటుతో 62 వికెట్లు చేజిక్కించుకున్నాడు. తొమ్మిది టీ-20ల్లో పాల్గొన్న బొల్లింగర్ న్యూ సౌత్ వేల్స్ తరపున 124 ఫస్ట్ క్లాస్ వ్యాచులాడాడు. ఎడమ చేతి ఫాస్ట్ బౌలరయిన బొల్లింగర్ వెస్టిండీస్‌తో ఒకసారి న్యూజిలాండ్‌తో మరోసారి ఐదేసి వికెట్లు తీశాడు. అతని అత్యుత్తమ బౌలింగ్ 5/28.

9 నుంచి ఫెడరేషన్ కబడ్డీ టోర్నీ

ముంబై: ఫెడరేషన్ కప్ కబడ్డీ పోటీలు ఈ నెల 9న ముంబైలోని సబర్బన్ ప్రాంతం గుర్‌గావ్‌లో ప్రారంభ కానున్నాయి. ఈ పోటీల్లో జాతీయ ఛాంపియన్లుగా ఉన్న మహారాష్ట్ర జట్టు ప్రత్యర్థి జట్లనుంచి గట్టి పోటీని ఎదుర్కోనుంది. ఈ టోర్నీని ముంబై ఉపనగర్ కబడ్డీ సంఘటన్ నిర్వహిస్తోంది. మహిళలకు, పురుషులకు వేరువేరుగా రెండు కోర్టులు కమిటీ ఏర్పాటు చేసింది. మహిళా విభాగంలో ప్రస్తుత ఛాంపియన్ హిమాచల్ ప్రదేశ్, ఇండియన్ రైల్వేస్, ఉత్తర ప్రదేశ్, కేరళ, పంజాబ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు పాల్గొంటున్నాయి. కాగా పురుషుల విభాగంలో సర్వీసెస్, హర్యానా, కర్నాటక, యూపీ, ఇండియన్ రైల్వేస్, రాజస్థాన్, ఉత్తరఖండ్ జట్లు బరిలోకి దిగనున్నాయి. పోటీలు రౌండ్ రాబిన్ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అగ్ర భాగాన నిలిచే రెండు జట్లు సెమీస్‌కు చేరుతాయి. ప్రో కబడ్డీ క్రీడలో భాగంగా ఇప్పటికే పాపులర్‌గా మారిన క్రీడాకారులు అనుప్ కుమార్, మన్జీత్ చిల్లార్, సురేంద్ర నాడా(హర్యానా) దీపక్ హుదా, వజీర్ సింగ్, వికాస్ దహియా(రాజస్థాన్), మోహిత్ చిల్లార్, రాజెస్ మోండల్ (రైల్వేస్), జీవా కుమార్, షబ్బీర్ బాపు(కర్నాటక), ప్రదీప్ నార్వల్(ఉత్తరఖండ్)లతో పాటు ఆతిథ్య రాష్ట్రానికి చెందిన గిరీష్ ఎర్నక్, నితిన్ మదానే తదితరులు టోర్నీలో పాల్గొంటున్నారు. మహిళా విభాగంలో అతిథ్య రాష్ట్రానికి చెందిన ఆసియన్ గేమ్స్‌లో స్వర్ణ పతక విజేత అభిలాష మాహాత్రే బరిలోకి దిగనుండగా, రైల్వేస్ తరపున వెటరన్ క్రీడాకారిణి తేజస్వినీ బాయి, రక్షా నర్కార్, సోనాలీ షింగ్తేలు బరిలోకి దిగనుండగా, హిమాచల్ ప్రదేశ్ తరపున పుష్పా దేవీ, దేవికా చౌహాన్ ప్రియాంక నేగి పూజా థాకూర్‌లు సవాలు చేయనున్నారు

రష్యన్ అథ్లెట్లకు ఆహ్వానం లేదు

ఐవోసీ ప్రకటన

ప్యాంగ్‌చాంగ్: డోపింగ్ టెస్టులో పట్టుబడి జీవిత కాల నిషేధానికి గురై గతవారం కోర్టు తీర్పుతో శిక్షనుంచి బయటపడ్డ 15మంది రష్యన్ అథ్లెట్లు, సిబ్బందిని శీతాకాల ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనడానికి ఆహ్వానించవమని అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ(ఐవోసి) సోమవారం ప్రకటించింది. ఐవోసి ప్రత్యేక ప్యానెల్ ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించిందని కమిటీ పేర్కొంది. ఓఏఆర్ఐజీ(ఒలింపిక్స్ అథ్లెట్ ఫ్రం రష్యా ఇంప్లిమెంటేషన్ గ్రూప్) ఈ విషయాన్ని నిర్ధారించింది. వీరికి మళ్లీ అదనపు ఆహ్వానాలు పంపించే ప్రసక్తే ఉండదని స్పష్టం ఐవోసి చేసింది.



ఈ 15 మంది అథ్లెట్లు డోపింగ్ టెస్టులో పట్టుబడి జీవితకాల నిషేధానికి గురైన 28 మందిలో ఉన్నారు. అయితే వీరందరిపై ఉన్న నిషేధాన్ని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్(సీఏఎస్) గత గురువారం ఎత్తివేసింది. వీరిలో 13 మంది అథ్లెట్లు, ఇద్దరు మాజీ అథ్లెట్లు ఉన్నారు. ప్రస్తుతం వీరు సహాయక సిబ్బందిగా పనిచేస్తున్నారు. మిగతావారు పదవీవిరమణ చేసి ఉండవచ్చు లేదా కావాలనే తమ ఉనికిని బహిర్గతం చేయడంలేదు. కాగా ఐవోసి ప్యాంగ్‌చాంగ్ శీతకాల ఒలింపిక్స్ నుంచి రష్యాను బహిష్కరించింది. ఈ నేపథ్యంలో రష్యాకు చెందిన 169 అథ్లెట్లు డోపింగ్ పరీక్షల్లో గట్టెక్కి తటస్థ పతాకంతో బరిలోకి దిగనున్నారు.

సీఏఎస్ నిర్ణయంను తప్పుపట్టిన ఐవోసి ప్రెసిడెంట్ థామస్ బాచ్

నిషేధాన్ని ఎత్తివేస్తు సీఏఎస్ తీసుకున్న నిర్ణయం సరికాదని ఐవోస్ ప్రెసిడెంట్ థామస్ బాచ్ అన్నారు. కోర్టు నిర్ణయం తమకు ఆవేదనకు గురిచేసిందన్నారు. ఈ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ స్వతంత్రంగా వ్యవహరించేలా సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. రష్యాలో ఉద్దేశపూర్వకంగా వ్యూహాత్మకంగా ఆంటి డోపింగ్ వ్యవస్థను పక్కతోవ పట్టించారని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆంటి డోపింగ్ సంస్థ కూడా సీఏఎస్ నిర్ణయం పట్ల ఆందోళనను వ్యక్తం చేసింది.

తెలంగాణ కరాటే విజేతలకు అభినందనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యునైటెడ్ షోటొకాన్ కరాటే అఫ్ ఇండి యా అధ్వర్యంలో ఫిబ్ర వరి 2నుండి 4 వరకు విశాఖపట్టణంలో నిర్వ హించిన రెండవ అం తర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తెలంగా ణ రాష్ట్రం తరపున మాస్టర్ కేశవ్ షోటోకాన్ కరాటే అకాడమీ, గార్డ్ ఆన్ వారియర్స్ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని రెండు బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సాధించిన కరాటే క్రీడాకారులను సన్మానించారు. అండర్-14 బాలుర విభాగంలో అవినాస్ (మహబూబ్‌నగర్), బాలికల విభా గంలో నందిని(వనపర్తి) బంగారు పతకాలు సాధించారు.

అండర్-16 బాలికల విభాగంలో అనూష (మహబూబ్‌నగర్), అండర్-8 బాలుర విభాగంలో ఆదిత్య (మహబూబ్‌నగర్), అండర్-9 బాలుర విభాగంలో ఎండి ఆర్ఫత్ (వనపర్తి) వెండి పతకాలు సాధించారు.



సోమవారంనాడు తన కార్యా లయంలో పతకాలు

ఐసీసీ మహిళా క్రికెట్ ఛాంపియన్ షిప్

సఫారీలపై భారత్ విజయం



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్మృతి మంధన

ముంబై: ఐసీసీ మహిళల చాంపియన్ షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి వన్డేలో భారత్ మహిళలు 214 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత మహిళలు నిర్ణీత 50 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేశారు. ఓపెనర్ స్మృతి మంధన 84 (98 బంతులు, 8 ఫోర్లు 1 సిక్సు)తో మెరవగా కెప్టెన్ మిథాలీ రాజ్ 45 (70 బంతులు,2 ఫోర్లు) రాణించారు. మిగతా బ్యాట్స్‌ఉమెన్‌లు విఫలమవ్వడంతో భారత్ ఆతిథ్య జట్టు ముందు స్వల్పలక్ష్యాన్ని ఉంచింది. దక్షిణాఫ్రికా మహిళా బౌలర్లలో మరిజన్నే కాప్, అయబోంగా కాకాలు రెండేసి వికెట్లు పడగొట్టగా.. మసబట క్లాస్ ఓ వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌతాఫ్రికా మహిళ జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 36 పరుగులు చేసింది. సఫారీల బ్యాటింగ్ ఏకోశాన కూడా భారత బౌలర్లను నిలువరించలేకపోయింది. 43.2 ఓవర్లలోనే 125 పరుగులకు ఆలౌట్ అయింది. సఫారీల జట్టు కెప్టెన్ వ్యాన్ నీకెర్క్ 41 పరుగులు చేసింది. దీనితో భారత్ 88 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. గోస్వామి 4 వికెట్లు, పాండే మూడు వికెట్లు, పూనం యాదవ్ రెండు వికెట్లు, ఆర్ఎస్ గ్వైక్వాడ్ ఒక వికెట్ తీశారు. స్మృతి మంధన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది.

శ్రీశాంత్ కేసులో

బీసీసీ స్పందన కోరిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కేసులో కేరళ హైకోర్టు తీర్పు ద్వారా జీవిత కాల నిషేధానికి గురైన క్రికెటర్ శ్రీశాంత్ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించింది. దీనిపై బీసీసీఐ స్పందనను కోరింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలను వెలు వరిస్తూ నాలుగు వారాల్లో బీసీసీఐ తమ వివవణను కోర్టుకు సమర్పించాలని సూచించింది. శ్రీశాంత్ తరపున సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదిస్తున్నాడు. శ్రీశాంత్ కెరియర్‌ను దెబ్బతీస్తూ కేరళ ఇచ్చిన తీర్పు చాలా కఠినమైనదని ఖుర్షీద్ ధర్మాసనంకు తెలిపాడు. కాగా కోర్టు నోటీసులను బీసీసీఐ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది పరాగ్ త్రిపాఠి అందుకున్నాడు. శ్రీశాంత్ 2013 ఐపీఎల్‌లో ఫిక్సింగ్ పాల్పడ్డాటంటూ ఆయన పేర్కొన్నాడు. ఫిక్సర్లతో జరిపిన సంభాషణల్లో శ్రీశాంత్ డబ్బును తీసుకున్నట్లు సాక్ష్యాలున్నాయని తెలిపాడు. ఆ ప్రకారమే శ్రీశాంత్ నోబాల్స్ వేశాడని త్రిపాఠి పేర్కొన్నాడు. ఏమైనా బీసీసీఐ తగిన వివరణతో అపెక్స్ కోర్టు ముందుకు వస్తుందని ఆయన మీడియాకు చెప్పాడు.

విజయ్ హజారే ట్రోఫీలో

ముంబై, ఏపీ, తమిళనాడు గెలుపు

చెన్నై: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సోమవారం తమిళనాడు, ముంబై, ఆంధ్రప్రదేశ్‌లు ప్రారంభ వ్యాచుల్లో విజయం సాధించాయి. తమిళనాడు జట్టు, గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిని తమిళనాడు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 311 పరుగులు చేయగా, ప్రతిగా గుజరాత్ 45.1 ఓవర్లలోనే 235 పరుగులకు ఆలౌట్ అయింది. మరో మ్యాచ్‌లో ముంబై జట్టు మధ్య ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన ముంబై 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 332 పరుగులు చేయగా, మధ్యప్రదేశ్ 46.1 ఓవర్లలో 258 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్ల మధ్య జరిగిన వ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. రాజస్థాన్ తొలుత బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 229 పరుగులు చేయగా అనంతర బ్యాటింగ్‌ను ప్రారంభించిన ఏపీ జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 45 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

బిలాస్‌పూర్‌లో.. ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన యూపీ జట్టు ఢిల్లీని బ్యాటింగ్‌చేయాలని కోరింది. ఢిల్లీ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 307 పరుగులు చేసింది. కాగా లక్ష్య ఛేదనలో యూపీ జట్టు వెనకబడి 252 పరుగులకు ఆలౌటయింది. దీనితో ఢిల్లీ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ ఓపెనర్ ఉన్ముక్త్ చాంద్ గాయంతో ఆడుతూ 116 పరుగులు చేసి తనపై వస్తున్న విమర్శలను ఆటతో తిప్పికొట్టాడు. చాంద్ 2012లో అండర్-19 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఉండి భారత్‌కు కప్‌ను అందించాడు.

సికింద్రాబాద్‌లో.. సౌరాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య జరిగిన మ్యాచుల్లో సౌరాష్ట్ర 32 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 7 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్ తొమ్మిది వికెట్ల నష్టానికి 254 పరుగులు మాత్రమే చేయగలిగింది. మరో మ్యాచ్‌లో రంజీ ఛాంపియన్ విదర్భా, జార్ఖండ్‌ల మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భా 300 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు మాత్రమే చేయగలిగింది.

14 నుంచి చీఫ్ మినిస్టర్ కప్

తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ తైక్వాండో అసోసి యేషన్ అధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 'చీఫ్ మినిస్టర్ కప్ ఓపెన్ తెలంగాణ స్టేట్ తైక్వాండో చాంపి యన్‌షిప్' టోర్నమెంట్ నిర్వహి స్తున్నట్లు శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీ ప్రారంభోత్సవానికి టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, టీ-న్యూస్ ఎండీ జె.సంతోష్‌కువమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో 14 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు ముటా శ్రీనివాస్ తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్ టోర్నీలో తెలంగాణలోని 31 జిల్లాల నుండి వివిధ వయస్సు గ్రూప్‌లకు చెందిన 3000 క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. 17వ తేదిన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రీడాకారులతో రక్తదాన శిబిరం కూడా గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నామని టోర్నమెంట్ నిర్వాహకులు తెలియజేశారు. టీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్‌కు ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి వెంట తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కే.శ్రీహరి, మహబూబ్ నగర్ జిల్లా తెరాస నాయకులు బుక్క మోహన్‌బాబు, నందు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జూనియర్ టీటీ టోర్నీలో

మానవ్‌కు రజతం



న్యూఢిల్లీ: లక్సెంబర్గ్‌లో జరిగిన అంతర్జాతీ య టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ప్రపంచ జూనియర్ సర్క్యూట్ ఫైనల్లో భారత్‌కు చెందిన మానవ్ టక్కర్ రజతంను గెలుచుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మానవ్ అమెరికాకు చెందిన టాప్ సీడ్ ఆటగాడు కనక్ ఝా చేతిలో 3-4(11-9, 3-11, 11-9, 6-11, 3-11, 11-9, 6-11) తేడాతో ఓటమిని పొందాడు. అమెరికన్ ఆటగాడు ఝా మెయిన్ డ్రాకు అర్హత సాధించనప్పటికి.. ప్రారంభ గ్రూప్ దశ పోటీల్లో టాప్ స్థానంలో నిలిచాడు. టక్కర్ సెమీస్‌లో ఈజిప్ట్‌కు చెందిన యూసెఫ్ అబ్దెల్ అజీజ్‌పై 11-8, 11-8, 11-5, 11-8 తేడాతో గెలిచాడు. కాగా మరో సెమీఫైనల్లో అమెరికా ఆటగాడు ఝా రష్యాకు చెందిన ఇవాన్న్ డెనిస్‌పై 11-3, 12-10, 11-9, 11-6 తేడాతో గెలిచి ఫైనల్లోకి ప్రవేశించాడు.

స్పోర్టీ సొల్యూషనిజ్‌తో

డబ్ల్యూఎఫ్ఐ ఒప్పందం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) స్పోర్టీ సొల్యూషనిజ్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో కుస్తీకి దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం లభిస్తుందని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. ఒప్పందంలో భాగంగా డబ్ల్యూఎఫ్ఐకు వాణిజ్య భాగస్వామిగా, సలహాదారు సంస్థగా స్పోర్టీ సొల్యూషనిజ్ సంస్థ వ్యవహరిస్తూ.. దేశంలో కుస్తీ క్రీడ నిలకడగా అభివృద్ధి చెందడానికి కృషిచేస్తోంది. 'కుస్తీ క్రీడను వాణిజ్య పరంగా అభివృద్ధి చేయడానికి, పోటీలను నిర్వహించడానికి మేము ఎప్పటినుంచి భాగస్వామిని వెతుకుతున్నాము. ఈ నేపథ్యంలోనే స్పోర్టీసొల్యూషనిజ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాము. ఈ ఒప్పందం మంచి ఫలితా లను ఇస్తుందని ఆశిస్తున్నాము' అని డబ్ల్యూఎఫ్ఐ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ శరణ్ అన్నారు. స్పోర్టీ సొల్యూషనిజ్ క్రీడల్లో లీగ్ మోడళ్లను ప్రవేశపెట్టడంలో దిట్ట. కుస్తీ పోటీల ప్రసార హక్కులను వాణిజ్య పరంగా విక్రయించడంలో దానికి అను భవం ముంది. ఈ ఒప్పందం కుస్తీ క్రీడలో శకం ప్రారంభమవుతుందని బ్రిజ్ భూషణ్ అన్నారు.

Published & Printed by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.

ఆంధ్రప్రభ
లైఫ్ I
lifepage2012@gmail.com
మంగళవారం
6 ఫిబ్రవరి 2018



యూట్యూబ్‌ని ఇలా చూసేద్దాం!

అది ..2005వ సంవత్సరం..... మైఖేల్ జాక్సన్ సోదరి జానెట్ జాక్సన్ సూపర్ బౌల్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తుండగా ఆమె డ్రెస్సు అకస్మాత్తుగా జారిపోయి... అరక్షణం పాటు ఆమె నగ్నంగా కనిపించిందనే వార్త అంతకుముందు రోజే వచ్చింది. ఆ క్లిప్పింగ్ కోసం చాడ్... ఇంటర్నెట్ లో ఎంత వెతికినా దొరకలేదు. దాంతో అతను ఎంతగానో నిరుత్సాహపడ్డాడు.

జావేద్ తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. అప్పుడు తీసిన వీడియోను ఈ-మెయిల్ ద్వారా స్నేహితులతో పంచుకునేందుకు యత్నించిన జావేద్‌కు..అంత పెద్ద వీడియో అప్ లోడ్ కాక నిరాశే ఎదురైంది. ఎందుకంటే ఇప్పటి మాదిరిగా వాట్సప్, డ్రాప్ బాక్స్, గూగుల్ ప్లేస్టోర్‌లాంటి క్లౌడ్ స్టోరేజ్ లు అప్పుడు లేవు. ఈ సంఘటనలు జరిగిన మరుసటి రోజు చాడ్ హర్లీ, జావేద్ కరీమ్‌లు పేపాల్ ఆఫీస్ క్యాంటీన్‌లో విశ్రాంతిగా కూర్చొని కాఫీ తాగుతున్నారు. అదే సమయంలో సహోద్యోగి స్టీవ్ చెన్ వచ్చి..మన కంపెనీని ఈబే (eBay) కొన్నదట. ఉద్యోగులు జాబ్ మానివేయకుండా..ప్రోత్సహించడం కోసం కంపెనీ పెద్ద మొత్తంలో బోనస్ ఇస్తుందంట..అన్న కబురు వారి చెవిలో వేశాడు. బోనస్ మాట వినగానే ముగ్గురు సహోద్యోగుల మెదళ్లలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. మనమే వీడియోలను అప్‌లోడ్ చేసే వెబ్ సైట్ ఓపెన్ చేస్తే ఎలా ఉంటుంది? అని...! అనుకున్నదే తడవుగా ముగ్గురు కలిసి వెబ్ సైట్ ను ప్రారంభించారు. కంపెనీ ఇచ్చిన బోనసే వారి మొదటి పెట్టుబడి. కానీ అదంత ప్రోత్సాహకరంగా లేకపోవడంతో...రూటు మార్చి..వైరల్ వీడియోలతో అందరినీ ఆకర్షించే ఉద్దేశ్యంతో వెబ్ సైట్ పేరును యూట్యూబ్ గా మార్చేశారు. యూట్యూబ్ ప్రారంభించిన కొన్ని వారాల వరకు ఎంతో ప్రచారంచేసినా సందర్శకుల రద్దీ అంతంతమాత్రంగానే ఉండేది. మరో పక్క పైపులు తయారు చేసే కంపెనీ యూ ట్యూబ్ పైప్స్(Universal Tube Pipes) వెబ్ సైట్ సందర్శకుల ఒత్తిడిని తట్టుకోలేక కుప్పకూలింది. ఇరు కంపెనీలు అప్రమత్తం చేసేవరకు సందర్శకులు యూ ట్యూబ్ కు బదులు యూ ట్యూబ్ కంపెనీ వెబ్ సైట్ లోకి ప్రవేశించేవారు వైరల్ వీడియోల కోసం. అలా 2005లో ప్రేమికుల రోజున యూట్యూబ్.కామ్ పురుడు పోసుకుంది.

వ్యవస్థాపకుల్లో ఒకరైన జావేద్ అమెరికాలోని ఒక జంతు ప్రదర్శన శాలను సందర్శించగా తీసిన వీడియోను యూట్యూబ్‌లో మొదటగా అప్‌లోడ్ చేశాడు. మొదట అశ్లీల వీడియోలకోసం ఆవిర్భవించినా..ఈరోజు విజ్ఞానం,వినోదం, పాఠాలు,వార్తలు, వంటావార్పు,ప్రముఖుల ఉపన్యాసాలు ..ఇలా యూట్యూబ్‌లో దొరకని అంశమంటూ లేదు.

కీ బోర్డ్ షార్ట్ కట్స్...ఎంతో సులువు...బోలెడు సమయం ఆదా

ఈ రోజు మనం ఎక్కువ సమయం యూట్యూబ్ కోసం వినియోగిస్తున్నాం. కంప్యూటర్లు లేదా ల్యాప్ టాప్‌లు ఉపయోగించేవాళ్లు కొన్ని కీబోర్డ్ షార్ట్ కట్స్ ఉపయోగించడం ద్వారా తమ సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. అయితే ఈ షార్ట్‌కట్స్ యూట్యూబ్ ప్లేయర్ ఫోకస్‌లో ఉన్నప్పుడు మాత్రమే పనిచేస్తాయని గుర్తుంచుకోవాలి.

సమయాన్ని ఆదా చేసే కీబోర్డు షార్ట్‌కట్‌లు

Spacebar... పాజ్/ ప్లే వీడియో
K కీ .. పాజ్/ ప్లే వీడియో
↑ (అప్ ఏరో కీ).. వాల్యూమ్ 5 శాతం పెంచుతుంది.
↓ (డౌన్ ఏరో కీ).... వాల్యూమ్ 5 శాతం తగ్గిస్తుంది.
M కీ... మ్యూట్/ అన్‌మ్యూట్ వాల్యూమ్.
← (ఏరో కీ ఎడమ వైపు).. వీడియో 5 క్షణాలు వెనకకు వెళుతుంది.
→ (ఏరో కీ కుడి వైపు)...వీడియో 5 క్షణాలు ముందుకు వెళుతుంది.
L కీ ...వీడియో 10 క్షణాలు వెనుకకు వెళుతుంది.
J కీ ....వీడియో 10 క్షణాలు ముందుకు వెళుతుంది.
0 /హోమ్ కీ... వీడియో మొదటి నుంచి ప్లే అవుతుంది.
End / ఎండ్ కీ... వీడియో చివరకు వెళ్లిపోతుంది.

ఇక అంకెల కీలు 1,2,3,4,5,6,7,8,9..సంబంధిత అంకెను బట్టి 10 నుంచి90 శాతం వరకు వీడియో ముందుకు వెళ్తుంది.(ఫ్రంట్ ఫార్వార్డ్ అవుతుంది)

F కీ....పూర్తి స్క్రీన్‌లోకి / పూర్తి స్క్రీన్ నుంచి మామూలు స్క్రీన్ కు వెళ్తుంది.
Esc కీ...పూర్తి స్క్రీన్ నుంచి మామూలు స్క్రీన్‌కు వెళ్తుంది.
Ctrl + → ఇది ఇష్టమైన పాటలతో ప్లే జాబితా సృష్టించుకున్న వాళ్లకు మాత్రమే ..ప్రస్తుత వీడియో నుంచి తదుపరి వీడియోకి వెళ్తుంది.
Ctrl + ← ఇది ఇష్టమైన పాటలతో ప్లే జాబితా సృష్టించుకున్న వాళ్లకు మాత్రమే ..ప్రస్తుత వీడియో నుంచి మునుపటి వీడియోకి వెళ్తుంది.
C కీ...స్క్రీన్ మీద ఉన్న టెక్స్ట్, సబ్ టైటిల్స్‌ను ఆన్ లేదా ఆఫ్ చేస్తుంది.
\+ కీ...స్క్రీన్ మీద ఉన్న టెక్స్ట్, సబ్ టైటిల్స్ ఫాంట్ పరిమాణాన్ని పెంచుతుంది.
\- కీ...స్క్రీన్ మీద ఉన్న టెక్స్ట్, సబ్ టైటిల్స్ ఫాంట్ పరిమాణాన్ని తగ్గిస్తుంది.
B కీ....బ్యాక్ గ్రౌండ్ రంగు మారుస్తుంది.
> కీ...వీడియో నడిచే వేగాన్ని పెంచుతుంది.
< కీ...వీడియో నడిచే వేగాన్ని తగ్గిస్తుంది.
Shift + P కీ...మునుపు చూసిన వీడియోను ప్లే చేస్తుంది.
Shift + N కీ...సిఫార్సు/ప్లే జాబితాలో తుదుపరి వీడియోను ప్లే చేస్తుంది
/ కీ ..వీడియో సెర్చ్ చేయడానికి.. టైపు చేయడాన్ని అనుమతిస్తుంది.

మనం యూట్యూబ్‌లో సంధ్యావందనం లేదా మ్యూజిక్ లేదా వంటలు ఇలా ఏ విషయాలు నేర్చుకుంటున్నా... అవసరాన్ని బట్టి వీడియో స్పీడ్ తగ్గించుకోవచ్చు లేదా పెంచుకోవచ్చు. యూట్యూబ్ స్క్రీన్ మీద సెట్టింగ్స్ లోకి వెళ్లి స్పీడ్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. చాలావరకు వీడియోలకు ముఖ్యంగా సినిమాలు, ప్రసంగాలు, మ్యూజిక్ వీడియోలకు సబ్ టైటిల్స్ ఉంటాయి. సెట్టింగ్స్ లోకి వెళ్లి సబ్ టైటిల్ ఆఫ్ లేదా ఆన్ చేసుకోవచ్చు. మనకు కావాల్సిన భాషను ఎన్నుకోవచ్చు. సబ్‌టైటిల్ లేని వీడియోలకు మీకు నచ్చిన సబ్‌టైటిల్ రాసి యూట్యూబ్‌కు కాంట్రిబ్యూట్ చేయవచ్చు.

మజా పెంచే ఫీచర్లు

మనకు తెలియని ఫీచర్లు ఎన్నో..!

యూట్యూబ్‌లో మనకు తెలియని ఫీచర్లు చాలా ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుని ఉపయోగించుకుంటే భలే మజాగా ఉంటుంది.

-ఎక్కువసేపు వీడియో చూస్తే కళ్లకు బడలిక కలుగుతుంది. అందుకే స్క్రీన్‌ను డార్క్ మోడ్ మరియు నలుపు థీమ్‌లు పెట్టుకుంటే కళ్లకు హాయిగా ఉంటుంది.

-పెద్ద స్క్రీన్ ఇంటర్ఫేస్‌ను ఉపయోగించడానికి www.youtube.com/tv ను ప్రయత్నించండి.ఇది చాలా సరళమైనది. సులభంగా నావిగేట్ చేయడానికి మరియు సాధారణంగా ఉపయోగించడానికి చాలా బాగుంటుంది. ముఖ్యంగా దీనిని మీ టీవీ లేదా మరో కంప్యూటర్‌కి జత లేదా ఫెయిర్ చేయవచ్చు.

- ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ ఫోన్‌లో వీడియో చూస్తున్నపుడు వీడియోని 10 సెకన్ల కోసం ఫార్వార్డ్ చేయాలన్నా, వీడియోని కుడివైపు 10సెకన్లు రివైండ్ చేయాలన్నా డబుల్ ట్యాప్ చేయవచ్చు. యూట్యూబ్ రీస్ట్రికటేడ్ మోడ్‌లో పెడితే పిల్లలు దుర్వినియోగం కోసం వాడలేరు. మరొక విషయం పిల్లలకు హాని లేకుండా కొత్తగా kids.youtube.com ఆవిష్కరించారు.

-సాధారణంగా మీరు యూట్యూబ్ లింకులను కాపీ చేసినప్పుడు ప్రారంభం నుంచి వీడియో ప్లే అవుతుంది. మీరు నిర్ణీత విషయం మాత్రమే మీవాళ్లతో పంచుకోవాలనుకుంటే లేదా చూపించాలనుకుంటే లేదా వీడియో మొదట్లో సుదీర్ఘ పరిచయాన్ని దాటవేయాలంటే కూడా ఒక మార్గం ఉంది. వీడియో యూఆర్ఎల్ చివరన &t=YmXX లను జోడించడం ద్వారా వీడియోని ఎన్ని నిముషాలు / ఎన్ని సెకన్ల నుంచి ప్రారంభించాలి అనేది సెట్ చేసుకోవచ్చు. ఈ వీడియో..... youtube.com/watch?v=prHj7RNVTnQ

ఈ URL ఉపయోగించి 105 సెకన్లు ముందుకు వెళ్లొచ్చు...youtube.com/watch?v=prHj7RNVTnQ&t=1m45s

మీరు మాన్యువల్ పద్ధతిని ఉపయోగించవద్దు అనుకుంటే ..వీడియోను ఎక్కడి నుంచి పంచాలనుకుంటున్నారో అక్కడ అదే సమయంలో వీడియోను పాజ్ చేసి, కుడి క్లిక్ చేసి ఆ సమయంలో యూఆర్ఎల్‌ను కాపీ చేయండి. అలాగే వీడియో ఆరంభంలో ఉపోద్ఘాతంలేదా టైటిల్స్ దాటవేయాలంటే ... &start=60youtube.com/ watch?v= 2NJNTgUNs8Q &start=60

-ఇక ఏదైనా వీడియో డౌన్‌లోడ్ చేసుకోవాలంటే యూఆర్ఎల్‌లో యూట్యూబ్‌కు ముందు ఎస్ఎస్ చేర్చండి.అప్పుడు అది వేరే పేజికి వెళ్లి మీరు కావాలనుకున్న ఫార్మాట్లో డౌన్ లోడ్ అవుతుంది. ఉదాహరణకు... youtube.com/watch?v=jDCORBtuWWY వీడియోకి ముందు ఎస్ఎస్ జోడించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు... ssyoutube.com/ watch?v=jDCORBtuWWY

- యూట్యూబ్ లింక్‌కు ముందు gif చేర్చడం ద్వారా వీడియోలోని ఏ భాగాన్నైనా యానిమేటెడ్ GIF గా సృష్టించుకోవచ్చు.అయితే gif లాక్‌చేసి ఉన్న వీడియోలకు ఇది సాధ్యం కాదు. youtube.com/watch?v=OUmQ5VwYcT8 ఈ యూఆర్ఎల్‌లో gifyoutube.com/ watch?v=OUmQ5VwYcT8 చేర్చి అనేక gif లు పొందవచ్చు .ఎన్నో రకాల ప్రభావాలను జోడించ వచ్చును మరియు GIF ను మీ ఇష్టానికి కత్తిరించుకోవచ్చును. ఒకసారి పూర్తయితే సామాజిక నెట్వర్క్ లకు సులభమైన లింక్‌తో GIFను పంపుకోవచ్చు. దానిని డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అయితే వీడియో 60 నిమిషాల కంటే ఎక్కువ ఉంటే gif అవ్వదు.

-ఇకపోతే...యూట్యూబ్‌లో వీడియోలకు ముందు వచ్చే.. అడ్వర్‌టైజ్‌మెంట్లను మనం తొలగించలేము. కాని ఏ అడ్వర్‌టైజ్‌మెంట్‌ను మనం చూడవద్దు అనుకుంటున్నామో వాటిని మనం కీ వర్డ్స్ సెట్ చేసుకోవడం ద్వారా మన యూట్యూబ్ నుంచి తొలగించుకోవచ్చు.



-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

రోబో మార్ట్ వచ్చేస్తోంది!

ఇంటి ముంగిట్లోకి కోరిన సరుకులు!



ఇంట్లో నిత్యావసర సరుకులు నిండుకున్నాయి...బజారుకు వెళ్లి తెచ్చుకోవాలి... ఉరుకులు పరుగుల జీవితం...ఏరోజుకు ఆరోజు వెళ్లాలి అనుకున్నా కుదరడం లేదు. ఆన్ లైన్ మార్కెటింగ్ సంస్థ అమెజాన్‌కో లేదా మరో దానికో సరుకులు ఆర్డర్ చేస్తాం. అయితే అవి ఇంటికి చేరడానికి కనీసం ఒక్క రోజన్నా సమయం పడుతుంది. అలా కాకుండా ఆర్డర్ చేసిన వెంటనే సరుకులు ఇల్లు చేరాలంటే?.....ఇప్పటికైతే అలాంటి అవకాశం లేదుకాని.....సమీప భవిష్యత్తులో ఆర్డర్ చేసిన నిముషాలు, లేదంటే గంటల్లోనే మనం కోరుకున్న సరుకులు మన ముంగిట్లోకి రానున్నాయి. అదెలా సాధ్యం అనుకుంటున్నారా? అసాధ్యాన్ని సుసాధ్యం చేయడానికే కదా టెక్నాలజీ ఉంది. ఆ పరిష్కార మార్గమే రోబోమార్ట్! మనం కాలు కదపకుండా మన స్మార్ట్ ఫోన్‌లో చిన్న బటన్ నొక్కితే చాలు సరుకులు మన ఇంటికే వచ్చి వాలుతాయి.

అదే రోబోమార్ట్!

ఓ స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకుడు అలి అహ్మద్ మానస పుత్రిక ఈ రోబోమార్ట్. ఇతను సరుకులను కస్టమర్ల ఇళ్లకు చేరవేసేందుకు మొదట డిస్పాచ్.. పేరుతో స్మార్ట్ ఫోన్ సేవలు ప్రారంభించాడు. కస్టమర్లు తమకు కావాల్సిన సరుకులను టెక్స్ట్ మెసేజ్ ద్వారా ఆర్డర్ చేస్తే,...చాలు.. వాటిని ప్యాక్ చేసి వారి వారి ఇళ్లకు చేరవేసేవారు. కానీ మటన్, చికెన్, కూరగాయ లు, పండ్లు లాంటివి ఆర్డర్ చేసినప్పుడు కస్టమర్ వాటిలోని మంచిచెడు చూసుకుని ఎంపికచేసుకుని ప్యాక్ చేయించుకునే అవకాశం ఉండదు. అవి తాజానో కాదో అనేది డెలివరీ తర్వాత ప్యాక్ విప్పిచూస్తే కాని తెలీదు. ఈ విషయంలో థర్డ్ పార్టీని నమ్మక తప్పని పరిస్థితి. ఆ ఆలోచనలోంచే రోబోమార్ట్ రూపుదిద్దుకుంది.

రోబో మార్ట్ అంటే ఏమిటి....ఎలా పనిచేస్తుంది?

రోబోమార్ట్ అనేది ఒక వెహికల్ పేరు. వినియోగ దారులు తమ స్మార్ట్ ఫోన్ లోని ట్యాప్ బటన్ నొక్కడం ద్వారా సరుకులు కావాలనే రిక్వెస్ట్ పంపితే చాలు..రోబోమార్ట్ వెహికిల్ నిమిషాల్లో..మీ ఇంటి ముందుకు వస్తుంది. (ఎంత సమయంలో వస్తుంది అనేది..దూరం మరియు ట్రాఫిక్ మీద ఆదారపడి ఉంటుంది) రోబోమార్ట్ మన ఇంటి ముంగిట్లోకి రాగనే దాని డోర్‌ను ఓపెన్ చేసుకొని, మనకు కావాల్సిన సరుకులను మనం తీసుకోవచ్చు. సరుకులు కొన్న తర్వాత రోబోమార్ట్ మనకు బిల్లు ఇస్తుంది.ఆ తర్వాత రోబోమార్ట్ తాను వచ్చిన దారిన తాను వెళ్లిపోతుంది. చదువుతుంటేనే చాలా థ్రిల్లింగ్‌గా ఉందికదూ..అందుబాటులోకి వస్తే మరెంత థ్రిల్లింగ్‌గా ఉంటుందో కదా!

రోబోమార్ట్ స్పీడ్ గంటకు 25 కిలోమీటర్లు. ఇది విద్యుత్‌తో నడుస్తుంది. ఒక్కసారి చార్జ్‌చేస్తే 80 మైళ్లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతం దీనిని శాన్‌ఫ్రాన్సిస్కో ఏరియాలో పైలట్‌గా రన్ చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా రోబోమార్టులు సరుకులను చేరవేసేందుకు మార్కెట్లోకి రానున్నాయి.

రూ.15వేలలోపు నుంచి స్మార్ట్ ఫోన్లు

స్మార్ట్ ఫోన్ కొనాలనుకునేవారికి ఇదో మంచి ఎంపిక. ఇందులో ఫాస్ట్ సిస్టమ్ అప్ డేట్స్, లేటెస్ట్ సాఫ్ట్ వేర్ ఉంది. దీని బ్యాటరీ సామర్థ్యం... 3000 ఎంఏహెచ్! ఇందులో కూడా... 5.5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే..64 జీబీ స్టోరేజ్, 4జీబీ ర్యాం, 2జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్...ఇతర ఫీచర్లు! ఇందులోనూ డ్యూయల్ కెమెరా సౌకర్యం ఉంది.మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!



మోటో జీ5 ఎస్ ప్లస్ (Moto G5S Plus)

ఈ స్మార్ట్ ఫోన్ ధర 14,999 రూపాయలు. 15వేల రూపాయల లోపు లభించే స్మార్ట్ ఫోన్‌లలో మంచి డిమాండ్ ఉన్న ఫోన్. దీనికి డ్యూయల్ కెమెరా సౌకర్యం ఉంది. బ్యాటరీ సామర్థ్యం..3000 ఎంఏహెచ్. కెమెరా పర్‌ఫార్మెన్స్ చాలా బాగుంటుంది. ఆకర్షణీయమైన అమరిక ఈ ఫోన్ సొంతం. ఇక .. 5.5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే..64 జీబీ స్టోరేజ్, 4జీబీ ర్యాం, 2జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్...ఇతర ఫీచర్లు! మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!



జియామి ఎంఐ ఏ1(Xiaomi MiA1)

దీని ధర కూడా ..14,999 రూపాయలు... 15వేల లోపు ధరతో



లెనోవా కే8 నోట్ (Lenovo K8 Note)

లెనోవా కే8 నోట్ ధర....11,666 రూపాయలు. దీనిని కొనుగోలు చేసిన వారికి మంచి ఫోన్ తీసుకున్నామన్న ఫీలింగ్ కలుగుతుంది. ఇందులోని థియేటర్ మ్యాక్స్ వీఆర్..ఆప్షన్ మనకు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుంది. ఈ ఆప్షన్ మూలంగా ఫోన్‌ను virtual cinema(వర్చువల్ సినిమా)గా మార్చుకోవడానికి అవకాశం ఉంది. ఇందులోనూ డ్యూయల్ కెమెరా సౌకర్యం ఉంది. 5.5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే..32 జీబీ స్టోరేజ్, 3జీబీ ర్యాం, 1.4 జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్...ఇతర ఫీచర్లు! దీని బ్యాటరీ సామర్థ్యం... 4000 ఎంఏహెచ్! మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!



కూల్ ప్లే6(Cool Play 6)

కూల్ ప్లే6 స్మార్ట్ ఫోన్ ధర...14,999 రూపాయలు. దీని బ్యాటరీ సామర్థ్యం... 4060 ఎంఏహెచ్! 5.5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే....64 జీబీ స్టోరేజ్, 6జీబీ ర్యాం, 1.4 జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్ తోపాటు..13మెగాపిక్సెల్ రేర్ కెమెరా, 8 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా ..ఇతర ఫీచర్లు! మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!



జియామి ఎంఐ మ్యాక్స్2 (Xiaomi Mi Max 2)

జియామి ఎంఐ మ్యాక్స్2 ధర...13,999 రూపాయలు. దీని బ్యాటరీ సామర్థ్యం... 5300 ఎంఏహెచ్! 6.44 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే....32 జీబీ స్టోరేజ్, 4 జీబీ ర్యాం, 2 జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్ తోపాటు...12మెగాపిక్సెల్ రేర్ కెమెరా,5 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా ..ఇతర ఫీచర్లు! మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!

మోటో జీ5ఎస్ (Moto G5S)



మోటో జీ5ఎస్ స్మార్ట్ ఫోన్ ధర.. రూ.12,770 . నాణ్యత, మన్నిక, ఫీచర్లు.. ఇలా అన్ని విషయాల్లోనూ ఇది మంచి ఫోన్ అని చెప్పాలి. 5.2 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే..32 జీబీ స్టోరేజ్, 4 జీబీ ర్యాం, 1.4 జీహెచ్ జెడ్ ఓక్టా-కోర్ ప్రాసెస్సర్ ..ఇతర ఫీచర్లు! ఇది చూడడానికి కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. మార్కెట్లో దీని ఓవరాల్ రేటింగ్..8!

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

పాదమేది? శిరమేది?



(గత సంచిక తరువాయి భాగం)

10-4-47

తన స్థానంలో తానణగటం అంటే, బుద్ధిచేత అన్నమయాది కోశాలను తోసిపుచ్చి, ఆ వెనుక బుద్ధిని గూడా తోసివేయవలెనా?" అన్నారా భక్తులు. "బుద్ధిని విడిచి ఎక్కడికండీ పోయేది? బుద్ధి ఉన్నట్లుండుటే, తన స్థితిని తానెరుగుట. పైన వచ్చే విషయాదులన్నీ తొలగించే నిమిత్తం బుద్ధిని కట్టిగా పట్టుకోవాలి. మలిన బుద్ధి, అమలిన బుద్ధి అని ఆ బుద్ధిని రెండు విధాలుగా వివరిస్తారు. అంతఃకరణ కార్యాలైన విషయాలతో గూడి ఉన్నప్పుడు 'మలినబుద్ధి' అంటారు. దానికే మనస్సనీ, అహంకారమనీ పేర్లు. ఆ విషయాదులను తోసి పుచ్చుటకు ఊతకోలవలె ఉండే 'నే' నను అహంస్ఫురణకే, అమలిన బుద్ధి అని పేరు. దాన్ని పట్టుకొని మిగతాదంతా తోసివేస్తే, ఉన్నది ఉన్నట్లుంటుంది" అన్నారు భగవాన్.

"ఆ బుద్ధిని ఆత్మలో ఐక్యం చేయాలంటారు గదా?" అని మళ్లీ ప్రశ్న. "ఐక్యం చేయటానికి ఎక్కడినుంచైనా వచ్చే వస్తువు కాదే? తనలోనే ఉన్నది. ఆత్మ యొక్క స్ఫురణే బుద్ధి. ఆ బుద్ధితో అచలమైన వస్తువును తెలుసుకుంటే, తానుతానుగా ఉంటాడు. ఆ బుద్ధినే కొందరు శక్తి అంటారు. కొందరు అహమంటారు. ఏదో ఒక పేరు. పైన వచ్చేదంతా తరిమే నిమిత్తం దాన్ని పట్టుకోవాలి గట్టిగా"నన్నారు భగవాన్.

ఆత్మహత్య

15-5-47

ఈ మధ్యాహ్నం తిరుచ్చినాపల్లి వైపు నుండి వచ్చిన యువకుడొకడు భగవాన్‌కొక జాబు వ్రాసి చేతికిచ్చాడు. దేశంలో ఎందరో జనం అన్నం లేక మాడుతున్నారనీ, ఎంతో కల్లోలంగా ఉన్నదనీ, వారి కష్టం చూడలేకున్నామనీ, భగవాన్ ఏదైనా నివారణోపాయం చెప్పవలసిందనీ, తమ వంటి పెద్దలు ఏమీ చెప్పకుంటే ఎట్లాగనీ, ఆ జాబులోని విషయ సారాంశం.


భగవాన్ చదివి అతని వంక పరిశీలనగా చూస్తూ, "అదా నీకు కావలసింది. వారి కష్టం చూడలేక బాధపడుతున్నానంటావు. నీవిప్పుడు సుఖంగా ఉన్నావన్న మాటేనా?" అన్నారు. "లేదు, ఏదోరకంగా చింత కలుగుతూనే ఉన్నది" అన్నాడా యువకుడు. "ఆ, అదీ సంగతి, నీ సుఖమేదో నీకు తెలియదు. వారికొరకా చింత? లోకులందరు ఒకేవిధంగా ఉండేట్లు చేయాలంటే సాధ్యపడుతుందా? అంతా అందలమెక్కితే మోసేదెవరన్నట్లు అంతా రాజులే అయితే, వీడు రాజని నిర్దేశించి చెప్పేందుకేమున్నది? బీదవారుంటేనే, భాగ్యవంతులు వీరని తెలుస్తుంది. అజ్ఞానులుంటేనే జ్ఞానిని గుర్తించగలం. చీకటి ఉంటేనే వెలుగు తెలుస్తుంది. కష్టం ఉంటేనే సుఖం గోచరిస్తుంది. ఆకలి ఉంటేనే ఆహారానికి రుచి. అందువల్ల, తోచినంత సహాయం చేయగలమే గాని, అందరినీ ఒకేవిధంగా ఉంచాలంటే ఏ నాటికీ ఏ ఒక్కరి వల్లా సాధ్యపడదు. ఎందరెందరో దేశనాయకులు పనిచేస్తున్నారు. అందులో కొందరు 'మేము తలపెట్టిన కార్యం సరిగా కాలేదు, అందుకుగాను ఉపవాసాలు చేస్తా'మంటారు. ఎందుకో! ఒకరి వెనుక ఒకరు నాయకులుగ వస్తున్నారు, పని జరుగుతూనే ఉన్నది. అందరినీ నడిపే శక్తి ఒకటుందని గదా? దాని పని అది చూచుకుంటుందని భారం దానిపైన వేసి, నిశ్చింతగా ఉంటే, అదే జరిగిపోతుంది. మరికొందరు జీవహింస చేయరాదని బోధిస్తారు. వినకుంటే, 'మీరిది మానరేని మేము ప్రాయోపవేశం చేసి, ఆత్మహత్య చేసుకుంటాం. ప్రాణం విడుస్తా'మంటారు. లోకులు జీవహింస మానలేదని తానాత్మ హత్యకు పాల్పడితే అది మాత్రం జీవహింస కాదా యేమి? ఆత్మహత్య అంటే, శరీరం విడుచుటని వారి ఊహం. శరీరం ఆత్మ కాదే.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



దృఢసంకల్పం ఉంటే దైవసాయం

కష్టమొచ్చినా, నష్టమొచ్చినా అనుకున్న పనిని నిర్విఘ్నంగా పూర్తి చేసే వారిని గొప్పవారుగా ఎవరైనా చెబుతారు. చేయదలచుకున్న పనిపై ముందుగా పూర్తి అవగాహన కలిగించుకోవాలి, దానిలో ఎదురయ్యే ఆటంకాలను ముందుగా గుర్తించాలి, వాటిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ఒక నిశ్చయానికి రావాలి, అనుకోని విఘ్నాలు వచ్చినా పనిని పూర్తి చేయగలగాలి, వారే ఉత్తములని భర్తృహరి కీర్తించారు.

మన పురాణాల్లో, ఇతిహాసాల్లో ఇటువంటి కీర్తిమంతులు ఎందరో కనిపిస్తారు. ఎన్నో కష్టాలకోర్చి గంగను భూమిపైకి తీసుకొచ్చాడు భగీరథుడు. తీవ్ర తపస్సుతో పరమేశ్వరుణ్ని సాక్షాత్కరింపజేసుకుని గంగను భూమిపై ప్రవహింపజేయడానికి అనుమతి సంపాదిస్తే నా జలధార ధాటికి భూమి తట్టుకోలేదని గంగ చెప్పింది. శివుడు తన తలమీదకు దూకమంటే ఆమె అంగీకరించలేదు. దానిలో మరి మరికొంతకాలం ఆగవలసి వచ్చింది. చివరకు పరమేశ్వరుణ్ణి, గంగను ఇద్దరిని ఒప్పించి గంగను భూమి మీదకు తీసుకు వచ్చాడు భగీరథుడు. తీరా వచ్చిన గంగ దూకుడును ప్రదర్శిస్తూ జహ్ను ముని ఆశ్రమాన్ని ముంచెత్తి ప్రవాహంతో కొట్టివేసింది. దీనితో ఆ మహామునికి కోపం వచ్చి గంగను మొత్తం పానం చేశాడు. ఆయనను ప్రార్థించి తిరిగి గంగను ఆయన వదిలేలా చేశాడు భగీరథుడు. ఇలా ఎన్నో ఆటంకాలు ఎదుర్కొంటూ పావన గంగ తన పిన తండ్రుల భస్మ రాశులపై నుంచి ప్రవహించేలా చేశాకే వారికి ముక్తి కలిగింది. అందువల్లే వదలకుండా ఎవరైనా ఏదైనా పనిని సాధిస్తే దానిని భగీరథ ప్రయత్నం అనడం వాడుకలోకి వచ్చింది. ఇలాంటి ప్రయత్నమే శ్వేతకి అనే మహారాజు చేశాడని మహాభారతం చెబుతోంది.

శ్వేతకి రాజ్యం సుభిక్షంగా ఉండేది. అతను ప్రజలను కన్న బిడ్డలవలె చూసేవాడు. తనకు, రాజ్యంలోని పౌరులందరికీ మేలు జరగాలని కోరుతూ తరచు యజ్ఞాలను నిర్వహిస్తూ ఉండేవాడు. అయినా ఆయనకు తృప్తి ఉండేది కాదు. ఇలాకాక సదా దానాలిచ్చే యజ్ఞాలను నిరంతరాయంగా చేస్తే ఎలా

భారతంలో చిన్న కథలు

ఉంటుందనుకున్నాడు. మంత్రి, పురోహితులతో ఈ విషయమై సంప్రతించేవాడు. వారు ఈ ఆలోచన బాగానే ఉంది కాని నిరంతరాయంగా యజ్ఞాలు చేయాలంటే రుత్విక్కులు శాశ్వతంగా తమ కుటుంబాలను వదిలేసి ఉండాలని, అందువల్ల అది సాధ్యం కాదని చెప్పారు.

అయితే నిరంతరాయంగా కాకపోయినా నూరు సంవత్సరాలు సాగే సత్రయాగం చేయవచ్చు కదా అని అన్నాడు శ్వేతకి. (ఆ కాలంలో మనుషుల పూర్ణాయుర్దాయం వందేళ్లు కాదు). అయితే అది కూడా తమ వల్ల సాధ్యం కాదని, సర్వసంగ పరిత్యాగులు, అలసట లేనివారు మాత్రమే దానిని చేయగలరని వారు చెప్పారు. అయినప్పటికీ ఇటువంటి యాగం చేయాలనే గట్టిసంకల్పం ఉన్న పక్షంలో పరమేశ్వరుని ఆనతి తీసుకుంటే ఆయనే మార్గం చూపగలడని వారు చెప్పారు. దానితో పరమేశ్వరుని గూర్చి శ్వేతకి దీర్ఘకాలం తపస్సు చేశాడు. చాలా సంవత్సరాల అనంతరం శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. నూరు సంవత్సరాల సత్ర యాగం చేయ సంకల్పించానని అది జరిగేలా మార్గోపదేశం చేయమని శివుని కోరాడు. దీనికి ముందుగా 12 ఏళ్ళ పాటు ఆజ్య ధారలతో అగ్నిని సంప్రీతుని చేయాలని అప్పుడే అతని కోరిక తీరే మార్గం లభిస్తుంది అన్నాడు. రాజు అలానే చేశాడు. పరమేశ్వరుడు శ్వేతకి పట్టుదలను మెచ్చుకున్నాడు. తానే స్వయంగా తన కోపరూపమైన దుర్వాస మహామునిని పిలిచాడు. 'శ్వేతకి అనే రాజర్షి సంకల్పించుకున్న సత్ర యాగాన్ని నిర్విఘ్నంగా యాజకునివై నిర్వర్తించు' అని ఆదేశించాడు. సంకల్పం గట్టిదైతే, అది నలుగురికీ మంచి చేసేదైతే పరమేశ్వరుడు కూడా దానికి సహకారం అందించి, మన చేత మంచి పనులు చేయిస్తాడు. అలా దుర్వాసుడు మరికొందరు మహర్షుల సాయంతో శ్వేతకి సత్ర యాగం పూర్తి చేశాడు. సంతృప్తి పొందాడు.

ఈ కథ ద్వారా మనం తెలుసుకోవలసింది పట్టుదల ఎలా ఉండాలనేది. ఇది దేనికైనా వర్తిస్తుంది. అయితే ఇది కలియుగం కదా, సత్ర యాగం వంటివి చేయలేమే అని దిగులు చెందనక్కర్లేదు. మన పరిధికి లోబడి మంచి పనులు చేయడం ప్రారంభిస్తే మంచివారంతా ఒక దరికి చేరినట్లు అటువంటి వారు తోడై వాటికి చేయూతనిస్తారు. వీటికి పరమేశ్వర సహకారం ఎలానూ ఉంటుంది. అది సర్వ జన కల్యాణ కారకం అవుతుంది.

- అశ్విని

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతి కూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.


కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

అశోక వృక్షం అసలు కథ





పురాణ కథలు వేర్వేరు పురాణాల్లో వేర్వేరుగా ఉండవచ్చు. దానికి కారణం అదే కథ ఒక్కో కల్పంలో ఒక్కో విధంగా జరిగినందున ఆ తేడాలు ఉంటుంటాయి. అదేవిధంగా రామాయణంలోని కొన్ని విశేషాలు ఇతర పురాణాలలో కనిపించవచ్చు. అటువంటిదే ఒక కథ భవిష్య పురాణంలో ఉందని చెబుతారు. రామాయణంలో సీతాదేవి లంకలో అశోక వృక్షం కింద కాలం గడిపిందనే కథ ఉంది. ఇది అందరికీ తెలిసిన కథే. అయితే ఈ అశోక వృక్షం అనే దాని గురించినకథ భవిష్య పురాణంలో ఉందని పెద్దలు చెబుతారు. ఇది రామాయణ కాలం నాటి కంటే ముందు నాటిది. ఒకప్పుడు ఒక అడవిలో భిల్లు జాతికి చెందిన నరమాంస భక్షకుడైన సశోకుడనేవాడు ఉండేవాడు. అతను అడవిలో ప్రయాణించే వారిని చంపి తినేసేవాడు. ఒకరోజున అదే విధంగా ఎవరైనా ఆహారంగా దొరుకుతారా అని అతను వెతుకుతున్న సమయంలో అతనికి ఒక ముని ఆశ్రమం కనిపించింది. అక్కడ ఒక ముని ధ్యానంలో ఉండడం గమ నించాడు. అంతకు ముందు అతను ఎప్పుడూ ఎవరూ అలా ధ్యానంలో ఉన్నవారిని చూసి ఉండలేదు. అతని మనసు ఎందుకో ఆ ముని దగ్గరికి వెళ్లాలనిపించింది. ఆయన ముందుకు వెళ్లి ఆయన ప్రశాంత వదనాన్ని చూశాడు. ఆయన కళ్లు తెరిచే వరకూ వేచి చూశాడు. కళ్లు తెరవగానే 'నేను నీలా ఎందుకు లేను' అని మునిని ప్రశ్నించాడు. దానికి ఆ ముని 'నీవెవరవు? నీకేమి కావాలి? అని అడిగాడు. దానికి సశోకుడు తన పేరు చెప్పి తాను నరమాంస భక్షకుడినని, అందరూ తనను చూసి భయపడుతుంటారని తెలిపాడు. అయితే 'మీ ప్రశాంతత చూశాక నాకు కూడా మీలా ఉండా లనిపిస్తోంద'ని తెలిపాడు. దానికి ఆ ముని జాలిపడి 'నువ్వు పశ్చాత్తాపపడుతున్నందుకు సంతోషంగా ఉంది. అయితే నీకు ఈ ప్రశాంతత చేకూరాలంటే ముందుగా జీవితమంతా దైవ ధ్యానంలో గడపాల'ని అన్నాడు. అలా చేస్తే వచ్చే జన్మలో నీకు ప్రశాంతత బాధలు లేని పరిస్థితి వస్తుందని చెప్పాడు. అయితే సశోకుడు 'నాకు ప్రశాంతత చేకూరాలి. ప్రజలు నా నుంచి భయంతో పారిపోకూడదు. దాని కోసం ఏమి చేయ మన్నా చేస్తాను' అన్నాడు నిశ్చయంగా. దానికి ముని సంతోషించి 'ఈనాటి నుంచి హింసను విడనాడి దైవధ్యానంలో గడిపితే వచ్చే జన్మలో రావణాసురుని లంకా నగరంలో వృక్షంగా పుడతావు. పరమ సాధ్వి అయిన సీతా మాత నీ నీడన అశోక వృక్షాలతో నిండిన వనంలో ఉంటుంది. ఆమెను వెతుకుతూ హనుమంతుడు వచ్చి నీ కొమ్మలలో దాగి ఉండి రామ కథా గానం చేస్తాడు. తర్వాత సీత ముందుకు వచ్చి రాముని సందేశం వినిపిస్తాడు. దానితో సీతాదేవి శోకం తగ్గి ఆమెకు ఉపశమనం కలుగుతుంది. అప్పుడే నీ పాపాలన్నీ ప్రక్షాళనమై నీకు ప్రశాంతత కలిగి శోకం నశిస్తుందని, ఆ రోజు నుంచి నీకు అశోకమనే పేరు వస్తుం దని తెలిపాడు. సశోకుడు ముని చెప్పినట్టే చేసి మరుజన్మలో అశోక వృక్షమయ్యాడు. అప్పటి నుంచి ఆ వృక్ష జాతి అశోకంగా పేరు పొందిందని చెబుతారు. ఇక్కడ మరో విషయం కూడా గమ నించాలి. ప్రశాంతత లేని జీవితం గడుపుతున్నపుడు అతని పేరు సశోకుడు అంటే శోకంతో ఉన్నవాడు అని. శోకం లేని స్థితి వచ్చాక అశోక (శోకం లేనిది) అయ్యాడు. ఆ చెట్టు కిందే సీతాదేవికి ఉన్న శోకం నివారణ అయింది. అశోక జాతి వృక్షాల్లో రకాలున్నాయి. కొన్నిటికి గుత్తులు గుత్తులు ఎర్రటి పూలు ఉంటాయి. కొన్నిటికి పూలు ఉండవు. అయితే ఇవన్నీ అశోక వృక్ష జాతికి చెందినవేనని అంటుంటారు.

- సేకరణ: జి.పి

సంపదకు పఠించవలసిన మంత్రం


ధర్మం-మర్మం



శరీర సౌందర్యానికి, సంపదకు పఠించవలసిన మంత్రం

ఓం శ్రీమతే నమః

మంత్ర జప విధానం: ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రాలు ధరించి నుదుటన తిలకం దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యా వందనాది కార్యక్రమాలను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత



భూత భవిష్యత్ వర్తమానాలు నాకు తెలుసు

అధ్యాయం 7

శ్లోకం 26:

వేదాహం సమతీతాని
వర్తమానాని చార్జున।
భవిష్యాణి చ భూతాని
మాం తు వేద న కశ్చన॥

తాత్పర్యం

ఓ అర్జునా! దేవదేవుడనైన నేను గతములో జరిగిన సమస్తాన్ని, ప్రస్తుతం జరుగుతున్న సర్వాన్ని, భవిష్యత్తులో జరుగనున్న వాటన్నింటిని ఎరుగుదును. అలాగునే జీవులందరిని నేను ఎరుగుదును. కాని నన్నెవ్వరును ఎరుగరు.

భాష్యం

శ్రీకృష్ణుడు సాకారమా, నిరాకారమా అని నిర్ధారించడానికి ఈ శ్లోకం చక్కని ఆధారాలను ఇస్తున్నది. మాయావాదులనబడేవారు, కృష్ణుడికి రూపం లేదని, అతడు భౌతికమైన రూపాన్ని తీసుకుంటాడని వాదించే వారు, ఇక్కడ దృష్టిని సారించాలి. భౌతిక రూపము తీసుకుంటే, శరీరం మార్పు చెంది మనం గతాన్ని మరచి పోతాము, భవిష్యత్తును గుర్తించలేం. కేవలం ముక్త స్థితిలో మాత్రమే భూత, భవిష్యత్, వర్తమానాలను సమగ్రంగా గుర్తించగలుగుతాము. శ్రీకృష్ణుడు ఎప్పుడో భగవద్గీతను వివశ్వానుడికి, సూర్యభగవానుడికి చెప్పినట్లు నాల్గవ అధ్యాయంలో తెలియజేశాడు. అంతేకాక ప్రతి జీవి హృదయంలో పరమాత్మగా ఉంటూ అన్నీ తెలిసిన వ్యక్తి కాబట్టి అతనికి భౌతికశరీరం ఉండదు. అయితే మేఘాలు కమ్మినప్పుడు మనం సూర్యుడిని చంద్రుడిని నక్షత్రాలను చూడలేము. అంటే మేఘాలు మనదృష్టిని కప్పగలవేమో కాని సూర్యుడిని, చంద్రుడిని, నక్షత్రాలను కప్పలేవు. అదే విధముగా భగవంతుని యోగామాయా శక్తి నాస్తికులను, నిరాకారవాదులను కప్పగలదేమో గాని భగవంతుణ్ని కాదు. కేవలం భక్తులు మాత్రమే ఈ విషయాన్ని గ్రహించి శ్రీకృష్ణుని ఎల్లప్పుడూ దేవాదిదేవుడిగా పూజిస్తారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

కులాసా



నిద్రలేమి బాధిస్తోందా?

నిద్రలేమి (ఇన్‌సోమ్నియా)అనేది నిద్రకు సంబంధించిన రుగ్మత. దీనివల్ల నిద్రపోవడం కష్టతరమౌతుంది. వీళ్లు రాత్రిళ్లు మెలుకువతో ఉంటారు. మళ్లీ నిద్రపోవడానికి ప్రయత్నించినా ఫలితం ఉండదు. కొంతమంది తెల్లవారకముందే నిద్రలేస్తారు. దీనివల్ల బాగా అలసిపోయినట్టుగా అనిపిస్తారు.

రకాలు

ఇన్‌సోమ్నియా రెండు రకాలు. ఒకటి ప్రయిమరీ ఇన్‌సోమ్నియా. రెండోది సెకండరీ ఇన్‌సోమ్నియా. ప్రైమరీ ఇన్‌సోమ్నియాలో వ్యక్తి నిద్ర పోతారు. దీనివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు.

సెకండరీ ఇన్‌సోమ్నియాలో మాత్రం వ్యక్తి నిద్రపోవడానికి అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. వీరిలో ఆస్తమా, డిప్రెషన్, ఆర్థరైటిస్, క్యాన్సర్, ఛాతిలో మంట ఉంటుంది.

కొద్దికాలం మాత్రమే ఇన్‌సోమ్నియా ఉంటే మాత్రం అక్యూట్ ఇన్‌సోమ్నియా అంటారు. అదే దీర్ఘకాలం కొనసాగితే మాత్రం క్రానిక్ ఇన్‌సోమ్నియా అంటారు. అక్యూట్ ఇన్‌సోమ్నియా కొన్నివారాలపాటు కొనసాగుతుంది. వారానికి వరుసగా మూడు రోజుల పాటు నిద్రసరిగ్గా పట్టకపోతే క్రానిక్ ఇన్‌సోమ్నియాగా పరిగణించాలి.

వేగంగా దూసుకెళ్తున్న నేటి తరుణంలో నిద్రపై శ్రద్ధ తగ్గుతోంది. రాత్రిపూట తక్కువ నిద్రపోవటంతో దాని ప్రభావం ఉద్యోగంపై, చదువులపై తీవ్రంగా ఉంటోంది. జీవగడియారం సరిగ్గా నడవడానికి నిద్ర ఎంత ముఖ్యమో తెలుసుకోవాలి.

శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిద్ర ఎంతో ముఖ్య పాత్రపోషిస్తుంది.

ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాగైనా ఎమిమిది గంటల నిద్రపోవాలని అందరూ అంటుంటారు. ప్రపంచస్థాయి ఆరోగ్య సంస్థలు కూడా ఎనిమిదిగంటలు నిద్రపోవాలని అంటున్నాయి.

కానీ ఎన్నిగంటలు నిద్రపోవాలనే విషయాన్ని కాస్త వివరంగా తెలుసుకుందాం.

ప్రపంచవ్యాప్తంగా అన్ని వయస్సుల వారికి రోగలెలా వస్తాయో చూస్తే. ఎక్కువ నిద్ర, తక్కువ నిద్ర రెండూ ఆరోగ్యానికి మంచివి కావని పలు అధ్యయనాల్లో తేలింది.

ఆరుగంటల కంటే తక్కువగా నిద్రపోవడాన్ని తక్కువ నిద్ర అంటారు. పది గంటల కన్నా ఎక్కువ నిద్రపోవడాన్ని ఎక్కువ నిద్ర అంటారు. ఈ రెండూ ఆరోగ్యానికి మంచివి కావు.

నిద్రలేమికి కారణం అనారోగ్యమని చెప్పడం కష్టమని, కానీ నిద్రలేమి, అనారోగ్యం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని పరిశోధనలో వెల్లడైంది.

నిద్రలేమి ఎన్నో రుగ్మతలకు దారితీస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

నిద్రలేమికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 153 అధ్యయనాల్లో 50 లక్షల మందికి పైగా పాల్గొన్నారు.

ఇందులో చాలామందికి నిద్రలేమి మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బు, గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చాయి.

యుక్తవయస్సులో వరుసగా కొన్ని రాత్రులు నిద్రలేకుండా ఉంటే కూడా అది మధుమేహానికి దారి తీస్తుందని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. నిద్రలేమితో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించే సామర్థ్యం కూడా దెబ్బతింటుందని, నిద్రలేమి రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందని.. దీంతో తొందరగా ఇన్ఫెక్షన్లు సోకే అవకాశముంటుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

ఏడుగంటల కన్నా ఎక్కువ నిద్రపోయేవారికన్నా, తక్కువ నిద్రపోయేవారికి జలుబు త్వరగా వస్తుందని ఓ అధ్యయనంలో తేలింది.

నిద్రలేమితో ఆకలిని పుట్టించే హార్మోన్ గ్రెలిన్ ఎక్కువగా విడుదల అయ్యి ఆకలి ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుందని, కడుపునిండిందనే భావన కల్పించే హార్మోన్ లెప్టిన్ తక్కువగా విడుదలయ్యి మరింత ఆహారం తినే విధంగా చేసి ఊబకాయానికి దారితీస్తుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది.

నిద్రలేమి ప్రభావం మెదడు పనితీరుపై కూడా ఉంటుందని పరిశోధకులంటున్నారు.

ప్రతిరోజూ మెదడులో కొన్ని వ్యర్థ కణాలు పెరుగుతాయని, నిద్రపోయినప్పుడు అవి తొలగిపోతాయి. అందుకే సరిపడ నిద్రలేకపోతే ఆ వ్యర్థ కణాలు మెదడులో పేరుకుపోతాయి. ఆ పరిస్థితి అలానే కొనసాగితే మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుంది.

ఎక్కువ నిద్ర దుష్ప్రభావాల గురించి చాలామందికి తెలియదు. కానీ అతి నిద్రతో జ్ఞాపకశక్తి క్షీణించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

నిద్ర దశలు

నిద్ర కూడా ఒకేలా ఉండదు. వివిధ దశల్లో నిద్ర ఉంటుంది. అదెలా అంటే ప్రతి దశ 60 నుంచి 100 నిమిషాల వరకూ ఉంటుంది.

మొదటి దశలో నిద్ర మెల్లిగా వచ్చి శరీరానికి ప్రశాంతత కలిగిస్తుంది. ఆందోళన, ఒత్తిడి తగ్గుముఖం పట్టి, కండరాలు విశ్రాంతి చెందుతాయి. హృదయ స్పందన రేటు కూడా క్రమంగా తగ్గుతుంది.

రెండో దశలో నిద్ర కాస్త గాఢమౌతుంది. కానీ ఎక్కడో ఓ చోట మేలుకుని ఉన్నామనే భావన మాత్రం ఉంటుంది.

మూడో దశలో నిద్ర మరింత గాఢంగా ఉంటుంది. శరీరంలోని జరిగే ప్రక్రియలు మరింత తగ్గుముఖం పడతాయి. అందుకే ఈ దశలో నిద్ర నుంచి మేల్కొనడం కష్టం.

రెండో, మూడో దశలను స్లోవేవ్ స్లీప్ అంటారు. ఈ రెండు దశల్లో కలలు రావు.

గాఢమైన నిద్ర తర్వాత మళ్లీ రెండో దశ వస్తుంది. అప్పుడే కలలొస్తాయి. దాన్నే ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఆర్ఈఎం) అంటారు.

ఓ మనిషి పూర్తి నిద్ర దశలో ఒకటి నుంచి మూడు వరకూ అన్ని దశలను పూర్తి చేస్తాడు. ఆ తర్వాత ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్‌లోకి వెళ్లాక రెండోదశలోకి వెళతాడు.

షిఫ్టలలో పనిచేసేవారికి..

షిఫ్టుల్లో పనిచేసేవారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. షిఫ్టుల్లో తక్కువ నిద్రపోయేవారికి మధుమేహం, ఊబకాయం వచ్చే ప్రమాదాలున్నాయి. బ్రిటన్‌లో నిర్వహించిన ఓ అధ్యయనంలో షిఫ్టుల్లో పనిచేసేవారు దీర్ఘకాలం అనారోగ్యం పాలవుతున్నారని తేలింది.

నిద్రలేమి ప్రభావం శారీరక శ్రమతో కూడిన ఉద్యోగంలో, ఒకేచోట కూర్చుని చేసే ఉద్యోగుల విషయంలో భిన్నంగా ఉంటుందని కూడా తేలింది. ఒకేచోట కూర్చొని పనిచేసే ఉద్యోగులపై నిద్రలేమి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

నిద్రలేమి సమస్య వయసు ఆధారంగా స్త్రీ పురుషుల్లో భిన్నంగా ఉంటుంది. బ్రిటన్‌లో చేసిన ఓ పరిశోధనలో రెండు వేలమంది పాల్గొన్నారు. ఈ పరిశోధనలో మహిళలు ఎక్కువగా నిద్రలేమితో బాధపడుతున్నారని తేలింది.

పిల్లల పెంపకం, ఉద్యోగం మహిళల నిద్రలేమికి ముఖ్య కారణాలుగా నిలిచాయి. కెఫిన్, మద్యం కూడా నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

రాత్రివేళల్లో పార్టీల్లో, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ పగటిపూట ఎక్కువ సేపు నిద్రపోయినా, ఆ నిద్ర రాత్రి నిద్రకు సరితూగదు. నిద్రలేమి సమస్య యువతలో కూడా ఎక్కువగా ఉంది.

టీనేజర్లు రాత్రిపూట 10 గంటలపాటు నిద్రపోవాలి. కానీ సగం మంది కూడా అలా చేయడంలేదని ఓ అధ్యయనంలో తేలింది. ఒకప్పుడు బెడ్‌రూం అంటే విశ్రాంతికి చిహ్నంగా ఉండేవి. కానీ ఇప్పుడక్కడ ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు అత్యధికంగా కనిపిస్తున్నాయి.

స్మార్ట్‌ఫోన్‌ల నుంచి వెలువడే నీలం రంగు వెలుతురు కళ్లపై పడి నిద్రరాకుండా చేస్తుంది.

ఇన్‌సోమ్నియా రావడానికి కారణాలు అనేకం ఉన్నాయి. వీటిలో గుర్తుతెలియని కారణాలు కూడా ఉన్నాయి. ఒత్తిడి, ఇతర అనారోగ్య కారణాలు, భావోద్వేగాలకు గురైనప్పుడున, శారీరకంగా అసౌకర్యంగా ఉన్నప్పుడు, ధ్వనికాలుష్యం, కాంతి, వేడిగాఉండటం తదితర కారణాలు ఇన్‌సోమ్నియాకి దారితీస్తుంది. జలుబు, అలర్జీలు, డిప్రెషన్, అధిక రక్తపోటు, ఆస్తమాకి వాడే మందుల వల్ల కూడా ఇన్‌సోమ్నియా వస్తుంది. రాత్రిపూట విధులు నిర్వహించడం వల్ల కూడా ఇన్‌సోమ్నియా రావడానికి అవకాశం ఏర్పడుతుంది.

నిర్ధారణ

ఇన్‌సోమ్నియాతో బాధపడుతున్నవాళ్లు సంబంధిత డాక్టరును సంప్రదించాలి. వీరి వైద్య చరిత్ర తెలుసుకుని శారీరక పరీక్షలు చేయాలి. వారం రోజుల పాటు డైరీ రాయాలి. నిద్రకు సంబంధించిన వివరాలు పూర్తిగా ఇందులో రాసుకోవాలి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇప్పుడు ఎక్కువమంది నిద్రలేమి సమస్యపై డాక్టర్లను సంప్రదిస్తున్నారు. ఊబకాయం సమస్య నానాటికి పెరుగుతుండటంతో నిద్రలేమి సమస్య తీవ్రమౌతుంది.


చికిత్స

అక్యూట్ ఇన్‌సోమ్నియా బాధితులకు చికిత్స అవసరంలేదు. మంచి నిద్రకోసం కొన్ని చిట్కాలను అవలంబిస్తే సరిపోతుంది.

రాత్రిపూట నిద్రమాత్రలు డాక్టరు సూచన మేరకు వాడాలి. దీర్ఘకాలికంగా నిద్రమాత్రలను వాడకూడదు. శరీర జీవగడియారం మారే వరకు ఈ మాత్రలు వాడితే తప్పులేదు. నిద్రమాత్రలు నిరంతరం వాడితే మాత్రం దుష్ఫలితాలు సంభవిస్తాయి. నిద్రలేమికి కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అంటే ఆలోచనా, ప్రవర్తనా విధానాన్ని మార్చే చికిత్సే పరిష్కారం.

నిద్రలేమి సమస్యకు నిద్రమాత్రలు పరిష్కారం కాదు. ఆలోచనా విధానంలో మార్పుతోనే పరిష్కార సాధ్యం.

రాత్రిపూట త్వరగా నిద్రపోవడానికి, ఆలస్యంగా నిద్రపోవడానికి కొన్ని జన్యుపరమైన కారణాలు కూడా ఉంటాయి.



డాక్టర్ శ్రీనివాస్ కంద్రకొండ
సైకియాట్రిస్ట్
మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్స్

చిట్కాలు

- నిద్రించే ముందు గోరువెచ్చని పాలు త్రాగాలి
- గోరెవెచ్చని నీటితో స్నానం చేయాలి
- ప్రాణాయామం, ధ్యానం చేయాలి
- శ్వాస మీద దృష్టి కేంద్రీకరించాలి
- ముక్కు ద్వారా నెమ్మదిగా పీల్చుతూ అంతే నెమ్మదిగా గాలి వదలాలి
- తేలికపాటి వ్యాయామం చేయాలి
- నిద్రకు ఉపక్రమించడానికి మూడు గంటల ముందు వ్యాయామం చేయాలి
- ఆహారం కూడా గంట ముందే సేవించాలి
- పడుకునే ముందు కాఫీలు, టీలు సేవించరాదు
- క్రమంతప్పకుండా ఒకే సమయంలో పడుకోవాలి
- పడకగదిలో ఉష్ణోగ్రత వేడిగా ఉండకూడదు
- మనసును ప్రశాంతతనిచ్చే సంగీతాన్ని వినాలి
- కనుబొమ్మల మధ్య, ముక్కు పైభాగంలో 20 సెకన్లపాటు బొటనవేలితో ప్రెస్ చేయాలి

ఆయుర్వేద చికిత్స

నిద్ర కొందరికి ఎక్కువగా పడుతుంది. కొందరిలో మొదటి నుంచీ తక్కువగానే ఉంటుంది. అది శరీర తత్వాలను బట్టి ఉంటుంది. నిద్ర తక్కువగా పట్టేది వాత శరీరతత్వం ఉన్నవారికే. మామూలు వ్యక్తులకు ఏడెనిమిది గంటల నిద్ర అవసరం. అయితే వాత శరీరతత్వం ఉన్నవారికి ఆరేడుగంటలు నిద్రసరిపోతుంది.

వయోవృద్ధుల్లో వాతదోషాధిక్యత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వయస్సులో ఉన్నప్పుడు వచ్చినంతగా నిద్ర వృద్ధాప్యంలో రాదు. పడుకోగానే నిద్రరాకపోవడం, మధ్య మధ్య మెలకువ రావడం, మూత్ర విసర్జనకోసం వెళ్లాల్సిరావటం వీటివలన నిద్ర సరిగ్గా పట్టటం లేదనే భయం కలుగుతుంది.

రోజువారి జీవితంలో చెదురుముదురులు, వాతం వికారం చెందటం నిద్రలేమికి కారణం అవుతాయని ఆయుర్వేద శాస్త్రం చెబుతుంది.

కమ్మగా నిద్రపోతే వాతం తగ్గుతుంది. రాత్రి జాగరణలు చేస్తే వాతం పెరుగుతుంది. ఈ వాతం అనే వాత వ్యాధులకు దారితీస్తుంది. అర్ధరాత్రిదాకా టీవీలకు అంటుకుపోయే అలవాటున్న వారందరికీ వాతవ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. వీళ్లు భవిష్యత్తులో నిద్రలేమితో బాధపడే అవకాశం కూడా ఉంది.

స్వర్ణమాక్షిక భస్మ, నిద్రోదయ చూర్ణం, వాత కులాంతకరసం లాంటి ఔషధాలు ఆయుర్వేద వైద్యుని సలహా మీద వాడుకుంటే నిద్రాలోపం సరి అవుతుంది. బ్రహ్మీరసాయనం, అశ్వగంధాతి చూర్ణం లేదా లేహ్యం ఇంకా ఆయుర్వేద ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. ప్రాణాయామం బాగా ఉపకరిస్తుంది.



డాక్టర్ సంగమేశ్వర్
ఆయుర్వేదవైద్య నిపుణులు
హైదరాబాద్
9440065764

ఆక్యుపంక్చర్‌లో...

నిద్రలేమికి ఆక్యుపంక్చర్ చికిత్స బాగా ఉపకరిస్తుంది. వందల ఏళ్ల క్రితమే ఈవ్యాధికి చికిత్స ఉంది. ఎలాంటి మందులు వాడకుండా చికిత్స తీసుకోవడానికి దోహదపడుతుంది. ఒకసారి ఆక్యుపంక్చరిస్ట్ దగ్గరికి వెళితే సన్నని పొడవైన సూదిని శరీరంలోని వివిధ భాగాల్లో గుచ్చుతాడు. దీనివల్ల శక్తి ప్రవాహం చెందుతుంది. దీన్నే మెరిడియన్స్ అంటారు. ఈ సూదులు గుచ్చడం వల్ల శరీరం మీద ఎటువంటి నొప్పులు ఉండవు.



హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్
హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808

హోమియోపతి ద్వారా నయం

హోమియోపతి ద్వారా నిద్రలేమి చికిత్స చేయడం సాధ్యమని పలు అధ్యయనాలు తెలియజేశాయి. కేవలం ఒకటి రెండు పిల్స్, ఐదు డ్రాప్‌లు నిద్రపోవడానికి గంట లేదా రెండు గంటల ముందు వేసుకుంటే చాలు ఫలితం కనిపిస్తుంది.


అర్సెన్నియమ్ అల్బం

ఎప్పటికీ ఆందోళన, అలసట, భయం ఉన్నవారికి ఈ మందు చక్కగా పనిచేస్తుంది. రాత్రిపూట నిద్రపట్టక పోవడం వల్ల పగటిపూట కూడా మగతగా ఉండేవారు డాక్టరు సలహామేరకు ఈ మందు తీసుకోవాలి. కాఫీక్రూడా, జెల్సిమియం, ఇగ్నాటియా అమర, లైకోపోడియం క్లావాటం, నక్స్ వామికా, పాసీఫ్లోరా ఇన్‌కార్నట, పాస్పరస్, సల్ఫ వంటి మందులు శరీరతత్వాన్ని బట్టీ తీసుకోవాలి.



డాక్టర్ టి. గీత
హోమియోవైద్య నిపుణులు
హైదరాబాద్
8019109109

మూర్ఛవ్యాధి చికిత్స



మూర్ఛవ్యాధి రోగుల్లో అత్యధికులకు చికిత్స చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఐదుకోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మనదేశంలో ఈ వ్యాధితో బాధపడే దేశాల్లో ఐదో స్థానంలో ఉంది.

సికింద్రాబాద్ అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హనుమంతగిరి మాట్లాడుతూ నరాలకు సంబంధించిన రుగ్మతల్లో ఒకటిగా నిలిచింది అన్నారు.

మూర్ఛవ్యాధి భారతదేశంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యగా పరిణమించింది. ఈఈజీ, సీటీస్కాన్ ద్వారా ఈ వ్యాధిని నిర్ధారణ చేసుకోవచ్చు.

మూర్ఛవ్యాధి నివారణకు కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. రోగులు సకాలంలో మందులు వేసుకోని వారి వల్లే సమస్య తెలెత్తుతుందని మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ సిమాచల్ మిశ్రా తెలిపారు.

ప్రాథమిక స్థాయిలో ఆస్తమా గుర్తించాలి

ఆస్తమా అనేది ఊపిరితిత్తుల వ్యాధి. దీన్ని ఆరంభంలో అంతం చేయకపోతే దీర్ఘకాలం మనల్ని వెంటాడుతుందని ప్రముఖ పల్మొనాలజిస్ట్ డాక్టర్ ప్రేమానంద్ అంటున్నారు. ప్రస్తుతం ప్రేమానంద అలర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్ ఎండీగా ఉన్నారు. ఆస్తమా గూర్చి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వివరంగా చెప్పారు.


ఆస్తమా చికిత్స గూర్చి ఈ ఐదేళ్లలో ఏదేని మార్పులు సంభవించాయా?

తప్పకుండా ఆస్తమా చికిత్స విషయంలో అనేక మార్పులు సంభవించాయి. ముఖ్యంగా మైల్డ్ ఆస్తమా కేసుల్లో ప్రజల్లో అవగాహన బాగా పెరిగింది. చాలామంది ఆస్తమా ప్రారంభదశలోనే గుర్తించగలుగుతున్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఆధునాతన చికిత్స చేసుకునే వారి సంఖ్య పెరుగుతుంది.

ప్రైమరీ కేర్ ఫిజిషియన్స్ ఎలాంటి సమస్యలు నిర్ధారణ చేస్తున్నారు?

ఆస్తమా వ్యాధి విషయంలో అక్యూట్ ఎటాక్, అక్యూట్ డిస్‌పినీయా కేసులు మాత్రమే వస్తున్నాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆస్తమా వ్యాధి ప్రాథమిక స్థాయిలో నిర్ధారణ జరగడంలో ఆలస్యమవుతుంది.

పిల్లల్లో ఆస్తమా వ్యాధి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీన్నే పీడియాట్రిక్ ఆస్తమా అంటారు. పెద్దల్లో కూడా ఆస్తమా లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రజల్లో ఆరోగ్యంపట్ల అవగాహన బాగా పెరుగుతుంది కాబట్టి ఆస్పత్రుల్లో చేరినప్పుడు ఆస్తమా లక్షణాలను గుర్తించగలుగుతున్నారు. జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయి. ఆస్తమా కేసులు ఎంత శాతం పెరిగిందో కచ్చితంగా చెప్పడం సాధ్యంకాదు.



ఆస్తమాను నిర్ధారించడంలో ఎలాంటి అవాంతరాలు ఎదురవుతున్నాయి?

ఆర్థిక ఇబ్బందులు ప్రధానంగా ఎదురవుతుంది. ప్రాథమిక స్థాయిలో వ్యాధిని గుర్తించడంలో కూడా వైద్యులు విఫలమవుతున్నారు. దీనివల్ల ఈ వ్యాధి ముదిరిపోతోంది.

ఇన్‌హేలేషన్ థెరపీ గూర్చి మీ అభిప్రాయం?

ప్రస్తుతం ఇన్‌హేలేషన్ థెరపీ ప్రాచుర్యంలోకి వచ్చింది. గతంలో ఆ పరిస్థితి లేదు. ఇన్‌హేలేషన్ థెరపీ గూర్చి ప్రతికూలంగా వార్తలు రావడంతో చాలామంది ఈ చికిత్స పట్ల మొగ్గుచూపేవారు కాదు. స్టిరాయిడ్స్ వినియోగిస్తారన్న అపవాదు ఉండేది. ప్రస్తుతం అవగాహన, చైతన్యం రావడంతో ఇన్‌హేలేషన్ థెరపీ చేయించుకుంటున్నారు.

ఆస్తమా వస్తే ఆర్థికంగా భరించగలుగుతారా?

ఆస్తమా వ్యాధి వస్తే ఆర్థికంగా భారం ఉంటుంది. ప్రస్తుతం ఈ వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుంది.

పిల్లల్లో, పెద్దల్లో ఆస్తమా లక్షణాలు ఏ విధంగా బయటపడతాయి?

పిల్లల్లో నిరంతరం దగ్గు, నిద్రాభంగం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తితే ఆస్తమా వ్యాధి వచ్చినట్లు గుర్తించాలి. దీర్ఘకాలికంగా దగ్గు ఉంటుంది.

పెద్దల్లో ఆస్తమా, పిల్లల్లో ఆస్తమాకి తేడా ఏమిటి?

పిల్లల్లో దగ్గు ఉంటే పెద్దల్లో మాత్రం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తాయి. ఈ వ్యాధి నివారణకు ప్రణాళికాబద్ధంగా చికిత్స తీసుకోవాలి.


అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్

ప్రేమికుల రోజున
సైనికుడి పాట

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తున్న చిత్రం నాపేరు సూర్య - నా ఇల్లు ఇండియా. వక్కంతం వంశీ దర్శకుడు. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్, బన్నీవాసు నిర్మిస్తున్నారు. నాగబాబు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

గణతంత్రం రోజున ఓ పాటని రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఫిబ్రవరి 14న అంటే ప్రేమికుల రోజున మరోపాటని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ భారతదేశ సరిహద్దులో మైనస్ 12 డిగ్రీల సెల్సియస్‌లో జరుగుతోంది.

నిర్మాతలు మాట్లాడుతూ సైనిక సాంగ్ ప్రతి ఒక్క మనసును కదిలించింది. మేకింగ్ వీడియో సినిమా స్టామినా మరింత పెంచింది. దీనికి కొనసాగింపుగా మరోపాటని ఫిబ్రవరి 14 విడుదల చేస్తున్నాం. మన దేశ సరిహద్దులో ఎముకలు కొరికే చలిలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. మన సైనికులు దేశం కోసం ఎలా పోరాడుతారో... హీరో అల్లు అర్జున్ సైతం సినిమా మీదున్న భక్తితో సహజసిద్ధమైన లొకేషన్స్‌లో వాతావరణం అనుకూలించపోయినా షూటింగ్ చేస్తున్నారు. కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం రామ్ లక్ష్మణ్, ఛాయాగ్రహణం రాజీవ్ రవి, సంగీతం విశాల్, శేఖర్,



చిరంజీవి సాంగ్స్ చూస్తున్నట్టుగా ఉంటాయి

- ఇంటిలిజెంట్ ప్రీ రిలీజ్ వేడుకలో సి.కల్యాణ్

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మిస్తున్న చిత్రం ఇంటిలిజెంట్. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన వినోదాత్మక చిత్రమిది. ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక రాజమండ్రిలో జరిగింది.

ఈ సందర్భంగా హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ ఇంటిలిజెంట్ చిత్రానికి ప్రేక్షకుల ఆశీర్వాదం ఉంటుందని భావిస్తున్నాం. వినాయక్ నాకు ఎంతో ఇష్టమైన దర్శకుడు. ఇంత మంచి సినిమా చేసే అవకాశాన్ని ఆయన నాకు ఇచ్చారు. చిరంజీవిగారి కమ్‌బ్యాక్ సినిమాను డైరెక్ట్ చేసిన ఆయన నాతో ఈ సినిమా చేసినందుకు కృతజ్ఞతలు. మెగాభిమానులకు ఇంటిలిజెంట్ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఒక ఆర్టిస్టులు కంఫర్ట్ జోన్ క్రియేట్ చేసి, సినిమాను గ్రాండ్‌గా తెరకెక్కించడానికి వెనుకాడని సి.కల్యాణ్‌గారికి థాంక్స్. తమన్ ఎంతో మంచి మ్యూజిక్ ఇచ్చాడు. చిరంజీవిగారు స్థాపించిన ఈ సామ్రాజ్యంలో జెండా రెపరెపలనే నాగుండే చప్పుళ్ళుగా భావించి కష్టపడుతుంటాను. నాకు మెగాస్టార్, పవర్‌స్టార్, మెగాపవర్‌స్టార్, స్టైలిష్ స్టార్, వరుణ్ ఇలా అందరూ నాకు పంచభూతాలు. చిరంజీవిగారు, పవన్ కల్యాణ్‌గారు, నాగబాబుగారు నాకు గురువులు, వారు లేకుండా నేను ఈ స్టేజీపై లేను అని అన్నారు.

చిత్ర దర్శకుడు వినాయక్ మాట్లాడుతూ మెగాఫ్యామిలీ అభిమానులకు థాంక్స్. పవన్ కల్యాణ్‌గారికి ఓ రిక్వెస్ట్. ఆయన సినిమాలు చేయనని అన్నారు. కానీ ఆయన రాజకీయంగా ఎంత ఎదిగినా, ప్రజా సమస్యలపై ఎంత పోరాడినా సమయం దొరికినప్పుడల్లా సినిమాలు చేయండి అని విజ్ఞప్తి చేశారు. ఇంటిలిజెంట్ సినిమా బాగా వచ్చింది. మంచి విజయం సాధిస్తుంది. తేజ్‌తో చమకు చమక్ సాంగ్ చేసేప్పుడు నాకు చిరంజీవిగారే గుర్తుకువచ్చారు. చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్ గారు కలిస్తే ఎలా ఉంటుందో తేజ్ స్టైల్ అలా ఉంటుంది. చిరంజీవిలాగా తేజ్ అందరినీ కలుపుకుని పోతుంటాడు. వారంత స్టార్ కావాలని కోరుకుంటున్నాను. రామానాయుడుగారి లాగా సి.కల్యాణ్ వంద సినిమాలు తీస్తారనే నమ్మకం ఉంది అని చెప్పారు.

నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ చమకు చమకు పాటని రీమేక్ చేశాం. ఈ పాట అభిమానులకు పండగే. ఇప్పటి వరకు సాయిధరమ్ చేసిన సినిమాలు వేరు. ఈ సినిమా వేరు. వినాయక్ సినిమాను ఇరగదీయించారు. పాటలు చూస్తుంటే చిరంజీవిగారి సాంగ్స్ చూస్తున్నట్టుగానే ఉంది. అన్నారు.

ఈ వేడుకలో సీనియర్ నటుడు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు మురళీమోహన్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి కూడా మాట్లాడారు.

రంగస్థలంపై ఐటమ్ సాంగ్


పూజాహెగ్డే

రామ్‌చరణ్

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం-1985 చిత్రం షూటింగ్ పూర్తికావచ్చింది. ఇటీవలనే ఈ చిత్రం చివరి షెడ్యూల్లో భాగంగా రాజమండ్రి పరిసరాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో భాగంగా మిగిలివున్న ఒకే ఒక ఐటమ్ సాంగ్ చిత్రీకరణను చిత్రబృందం సోమవారం నుంచి మొదలుపెట్టేసింది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో రామ్‌చరణ్, పూజాహెగ్డేలపై చిత్రీకరిస్తున్న ఈ ఐటమ్ సాంగ్ చిత్రంలో ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ పాటకు జానీమాస్టర్ నృత్యరీతులను సమకూరుస్తున్నారు. వాస్తవానికి సుకుమార్, దేవిశ్రీప్రసాద్‌ల కాంబినేషన్ అనగానే ఆ చిత్రంలోని ఐటమ్ సాంగ్‌కు ఎంత క్రేజ్ ఉంటుందో తెలియంది కాదు. గతంలో ఆర్య చిత్రంలోని అ అంటే అమలాపురం అంటూ సాగే ఐటమ్ సాంగ్ ప్రేక్షకులను ఎంతగా అలరించిందో గుర్తుండే ఉంటుంది. అలాగే జగడం చిత్రం బాక్సాఫీసు వద్ద ఎలా ఆడిందన్న విషయాన్ని పక్కనపెడితే ఆ చిత్రంలోని 36..24..36 ఐటమ్ సాంగ్ ఎంతో హైలైట్ అయ్యింది. ఇంకా 100 పర్సెంట్ లవ్ చిత్రంలోని డియాలో...డియాలా..., నేనొక్కడినే చిత్రంలోని లండన్‌బాబు ఐటమ్ సాంగ్‌లు ప్రేక్షకులను అలరింపజేశాయి. అందుకే సుకుమార్, దేవిశ్రీ కాంబినేషన్ అనగానే అది ఏ తరహా చిత్రమైనా ఐటమ్ సాంగ్‌కు ఎంతో ప్రాముఖ్యం ఉండటంతో పాటు దానిపట్ల ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు నెలకొంటుంటాయి. ఇక రంగస్థలం విషయానికి వస్తే...పల్లెటూరి ప్రేమకథా నేపథ్యంలో సాగే పక్కా మాస్ చిత్రం కావడంతో చిత్రంపైనే కాదు ఇందులోని ఐటమ్ సాంగ్‌పై కూడా అంచనాలు భారీగా నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే ఇంతవరకు ఐటమ్ సాంగ్ చేయని పూజాహెగ్డేను ఈ పాట కోసం ఎంచుకున్నారు. హీరోయిన్లు ఐటమ్ సాంగ్స్ చేయడం కొత్తేమీ కాకపోయినా ఓ వైపు కథానాయికగా ఇతర చిత్రాలలో నటిస్తున్న ఆమె ఇందులో ఐటమ్ సాంగ్ చేసేందుకు ఉత్సాహంగా అంగీకరించినట్లు సమాచారం. ఇటీవలనే తనకు సంబంధించిన షూటింగ్ పూర్తయిందని, విడుదల కోసం తాను కూడా ఆసక్తి ఎదురుచూస్తున్నట్లు కథానాయిక సమంత కూడా ట్వీట్ చేసింది. ఈ ఐటమ్ పాట చిత్రీకరణ పూర్తయిందంటే షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టేస్తారట. ఆ తర్వాత నిర్మాణానంతర పనులను పూర్తిచేసి, మార్చి 30న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రానున్నారు.

మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, రావురమేష్, అనసూయ నటిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని, రత్నవేలు ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.



స్టార్ హీరోల సరసన మళ్లీ ఎప్పుడో...


తమన్నా

దాదాపు పుష్కరకాలం హీరోయిన్‌గా ఓ వెలుగువెలిగిన మిల్క్‌బ్యూటి తమన్నాకు ఇప్పుడు సినిమాలు సన్నగిల్లకపోయినా...స్టార్ హీరోల సరసన సినిమాలు లేకపోవడమే హాట్‌టాపిక్ అయ్యింది. తెలుగు సినిమాల ద్వారానే బాగా ఫోకస్ అయిన ఆమె మొదట్నుంచి తమిళంలోను, ఆ తర్వాత హిందీలోనూ సినిమాలు చేయడం మొదలుపెట్టిన సంగతి తెలియంది కాదు. వివిధ భాషల్లో సినిమాలు చేసినా కాల్షీట్లను జాగ్రత్తగా సర్దుబాటు చేసుకుంటూ తాను అంగీకరించిన సినిమాల విషయంలో ఎక్కడా వివాదాలకు తావు లేకుండా ఆమె కెరీర్‌ను కొనసాగిస్తూ వస్తోంది. ప్రస్తుతం తెలుగులో కల్యాణ్‌రామ్ సరసన నా నువ్వే చిత్రంలో నటిస్తున్న ఆమె మరోవైపు కునాల్ కోహ్లీ దర్శకత్వంలో సందీప్‌కిషన్ సరసన ఓ చిత్రం చేస్తోంది. ఈ రెండు చిత్రాలు కాకుండా హిందీ క్వీన్ తెలుగు రీమేక్‌లో నటిస్తోంది. తన కెరీర్‌లో అభినేత్రి చిత్రాన్ని మినహాయిస్తే...హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలు చేసింది ఆమె తక్కువే. అభినేత్రి చిత్రం తన అంచనాలను వమ్ము చేయడంతో ఇప్పుడామె క్వీన్ చిత్రంపై ఎన్నో ఆశలతో ఉంది. అలాగే మిగిలిన రెండు చిత్రాలు కూడా టాలీవుడ్‌లో తన కెరీర్‌ను మలుపు తిప్పేవేనని ఆమె భరోసాతో ఉంది. ఇదిలావుండగా...తమిళంలో ఉదయనిధిస్టాలిన్ కథానాయకుడిగా శీను రామసామి దర్శకత్వంలో రూపొందుతున్న కన్నెకలై మానె అనే తమిళ చిత్రంలో కూడా తమన్నా కథానాయికగా నటిస్తోంది. ఇటీవల వచ్చిన తమిళ స్కెచ్ చిత్రం అటు తమిళంలోనూ, ఇటు తెలుగలోనూ నిరాశనే మిగిల్చింది. ఇక బాలీవుడ్‌లో చక్రి తోలేటి దర్శకత్వంలో కామోషి చిత్రంలోనూ, మరాఠీలో ఎ.బి.సి. అనే చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. మొత్తంమీద నాలుగు భాషల్లో కలుపుకుని అరడజను చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. తప్పకుండా ఇవి తనకు పూర్వవైభవం తెచ్చిపెట్టే చిత్రాలేనని తమన్నా దృఢ విశ్వాసంతో ఉందట.

షూటింగ్ పూర్తికావచ్చిన నితిన్ చిత్రం

నితిన్, మేఘాఆకాష్ జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఒక్క పాట చిత్రీకరణ మినహా పూర్తయింది.మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు మొదలై, జరుగుతున్నాయి. శ్రేష్ట్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై రూపొందుతున్న ఈ చిత్రం నితిన్‌కు 25వ చిత్రం కావటం ఓ విశేషం, త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తుండగా శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఇప్పటివరకు షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం గురించి నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 12న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేయనున్నామని తెలిపారు. అలాగే చిత్రం టీజర్‌ను ప్రేమికుల రోజు అయిన ఈ నెల 14న, సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు ఆయన వివరించారు.

దర్శకుడు కృష్ణచైతన్య మాట్లాడుతూ, ప్రేమతో కూడుకున్న కుటుంబ కథాచిత్రమిది. చాలా సరదాగా సాగుతుంది అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్‌స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రాశ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, షమ్మిసాయి, రాజశ్రీనాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బాల తారలు హాసిని, కృత్తిక, జోయ్, లిఖిత్, స్నేహిత్, స్కందన్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, సంగీతం: తమన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు: శేఖర్ వి.జె., స్టంట్స్: స్టంట్ సెల్వ, రవివర్మ.


విద్యాసాగర్ రాజు, సంచితా

రచయిత వస్తున్నాడు

దుహర మూవీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం రచయిత. విద్యాసాగర్ రాజు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తూ నటించిన చిత్రమిది. థ్రిల్లింగ్ లవ్‌స్టోరీగా తెరకెక్కింది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈనెల 16న విడుదల చేస్తున్నారు. ఒంగోలులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తారు.

నిర్మాత కల్యాణ్ ధూలిపల్ల మాట్లాడుతూ స్వచ్ఛమైన, అందమైన ప్రేమకథగా 1950 నేపథ్యంలో సాగే కథ ఇది. బడ్జెట్ విషయంలో కాంప్రమైజ్ అవకుండా రూపొందించాం. సంచితా పడుకోనే నాయికాగ నటించింది. వైజాగ్‌లో సెట్ వేసి కీలక సన్నివేశాలను చిత్రీకరించాం అని చెప్పారు.

విద్యాసాగర్ రాజు, సంచితా పడుకోనే, శ్రీధర్ వర్మన్, హిమజ, మునిచంద్ర, రాగిణి, సంజిత్, సుప్రియా, అనిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం షాన్ రెహమాన్, మాటలు కరుణాకర్ అడిగర్ల, ఛాయాగ్రహణం సాయిశ్రీరామ్.